జులై, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 6 పేజీలు: 64 వెల: రూ. 20/-



## జనాభా అదుపు ప్రగతికి మలుపు



# జులైలో చేయాల్సిన వ్యవసాయ పనులు

(వ్యాసం : 3వ పేజీలో)

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 6

జులై, 2010

ఎడిటర్

**డా॥ ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : phanikumar@ap.gov.in
phaniapard@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2

జూలైలో చేయవలసిన పొలం పనులు ........ 3

సమగ్ర నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి పథకం-
కొత్త మార్గదర్శక సూత్రాలు ........ 7

వైట్‌నర్ మత్తులో జోగుతున్న బాల్యం ........ 9

దేశి మార్గ కవితా నిర్ణాయకుడు-నన్నె చోడుడు ........ 12

రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాల మంజూరు ఎట్లా ? ........ 15

పాటల తోటమాలి (వేటూరి) ........ 17

గూగుల్ ఉత్తమ గ్రామం-మేడేపల్లి పంచాయతీ ........ 19

నిజాయితీకి సాకారం (మోక్షగుండం విశ్వేశ్వరయ్య) ........ 22

నీరు, భూమి, చెట్ల చట్టంతో ఎన్నో ప్రయోజనాలు ........ 25

సౌరశక్తితో విద్యుత్తు ఉత్పాదనే లక్ష్యంగా పనిచేస్తున్న
జవహర్‌లాల్ నెహ్రు జాతీయ సౌర మిషన్ ........ 27

రచయిత్రి కూతురు (కథ) ........ 30

ప్రపంచకప్ ఫుట్‌బాల్ పోటీల్లో తెలుగు తేజం ........ 32

పల్లవించిన పల్లె... హాజీపల్లి ........ 36

విముక్త (కథ) ........ 39

మహిళలలో మణిమాణిక్యం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ........ 42

గ్రామ రెవెన్యూ అధికారులు నిర్వహించవలసిన విధులు ........ 44

సూనృత వాక్యము మేలు చూడగన్... (వెంటాడే వాక్యం) ........ 47

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు ........ 48

శ్రీరమణ పేరడీలు ........ 50

మన రాష్ట్రంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర
ప్రయోజనాలకు మార్చుచేసే ప్రక్రియ ........ 54

వార్తల్లో 'అపార్డ్' ........ 56

చెంచుల అభివృద్ధికి అమలవుతున్న ప్రత్యేక ప్రణాళిక ........ 57

గ్రామీణాభివృద్ధికి పాడిపరిశ్రమ ........ 63

# సంపాదకీయం..

## జనాభా అదుపు ప్రగతికి మలుపు

మరో 20 సంవత్సరాల నాటికి మనదేశం ఒక అంశంలో యావత్ ప్రపంచంలోనే అగ్రస్థానానికి రాబోతోంది! జనాభా విషయంలో ఇప్పుడు రెండవ స్థానంలో ఉన్న మనదేశం 2030 సంవత్సరానికి మొదటి స్థానంలో ఉన్న చైనాను పక్కకు నెట్టివేసి, మొదటి స్థానాన్ని ఆక్రమించబోతోంది. అప్పటికి మన దేశ జనాభా 153 కోట్లకు చేరుతుందని అంచనా. ప్రస్తుతం మన దేశ జనాభా 115 కోట్లు.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 1947లో మనదేశ జనాభా కేవలం 35 కోట్లు మాత్రమే. గత 60 సంవత్సరాలలో మన జనాభా చాలా వేగంగా పెరిగి ప్రస్తుత స్థాయికి చేరుకుంది. అంటే, మూడు రెట్లకు పైగా పెరిగిందన్న మాట.

ప్రపంచ జనాభా 600 కోట్లను దాటిన సంవత్సరం తరువాత, అంటే 2000లోనే భారతదేశ జనాభా 100 కోట్ల స్థాయిని దాటింది. ఇప్పుడు ప్రపంచ జనాభా 683 కోట్లు కాగా, అందులో 17 శాతం మనదేశ జనాభాయే ఉంది.

**జూలై 11న ప్రపంచ జనాభాదినం**

1950లో మనదేశ పునరుత్పత్తి రేటు సుమారు 6 ఉండేది. అంటే ఒక స్త్రీకి సగటున పుట్టే పిల్లల సంఖ్య. 2000 సంవత్సరం నాటికి 2.1 రేటు సాధించాలనే లక్ష్యంతో 1952 నుంచి అనేక జనాభా నియంత్రణ పథకాలను అమలు చేయటం జరిగింది. కాని లక్ష్యాన్ని సాధించలేకపోయాము. తరువాత 2010 సంవత్సరం నాటికయినా 2.1 రేటుని సాధించాలనే లక్ష్యంతో 2000లో నూతన జాతీయ జనాభా విధానాన్ని రూపొందించారు. ఆ క్రమంలో 2002 నాటికి 2.6 రేటుని సాధించాలని ఆశించారు. కాని, ఇప్పటికీ, మన దేశ పునరుత్పత్తి రేటు 2.8 దగ్గరే ఉంది.

ఈ గణాంకాలన్నీ మన దేశంలో వేగంగా పెరుగుతున్న జనాభాను సూచిస్తున్నాయి. 2050 నాటికి గాని, భారతదేశంలో 2.2 రేటును సాధించలేమని కొన్ని అంతర్జాతీయ సంస్థల అంచనా. అప్పటికి దేశ జనాభా 180 కోట్ల వరకు పెరగవచ్చనే అంచనాలున్నాయి. ఆ రకంగా పెరిగి, ఈ శతాబ్దం చివరి నాటికి 218 కోట్ల వరకు మనదేశ జనాభా పెరుగుతుందని అంటున్నారు.

ఈ విధంగా పెరుగుతూ పోయి, 200 కోట్ల జనాభా పైబడిన అత్యధిక జనాభా కలిగిన దేశంగా భూమిపై భారతదేశం అవతరించనున్నదని అంచనా వేస్తున్నారు. ఇప్పుడు జనాభా విషయంలో అగ్రస్థానంలో ఉన్న చైనా జనాభా 2030 నాటికి 146 కోట్ల శిఖరాగ్ర స్థాయికి చేరి, ఆ తరువాత నుంచి క్రమంగా తగ్గిపోనున్నదట. అమెరికా జనాభా అయితే, ఎప్పటికీ 100 కోట్లకు కూడా చేరదని అంటున్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా నియంత్రణకు ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా, మనదేశ జనాభా అదుపులోకి రాకపోవటానికి అనేక కారణాలు ఉన్నాయి. నిరక్షరాస్యత, పేదరికం ప్రధాన కారణాలు. ఐక్యరాజ్యసమితి రూపొందించిన మానవాభివృద్ధి సూచికలో మనదేశం 126వ స్థానంలో ఉంది. దేశంలో నెలకొన్న సామాజిక, ఆరోగ్య, విద్యాపరమైన పరిస్థితులను ఈ సూచిక వెల్లడి చేస్తోంది.

ఈ వెనుకబాటుతనం వల్లనే, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో, చివరికి నగరాల్లో కూడా మగ సంతానం పుట్టే వరకు పిల్లలను కంటూ పోయే పరిస్థితి నెలకొని ఉంది, లేదా ఆడ పిండాలను గర్భస్థ స్థితిలోనే అంతమొందిస్తున్నారు. దీనివల్ల, జనాభాలో సమతుల్యత దెబ్బతిని, ప్రతి 1000 మంది పురుషులకు, 929 మంది మాత్రమే స్త్రీల సంఖ్య ఉంటున్నది.

పేదరికం, నిరక్షరాస్యతలను రూపుమాపడానికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నాయి. వీటికి తోడు, జనాభా నియంత్రణ పథకాలను పటిష్టవంతంగా అమలు చేయడానికి పట్టణ, గ్రామ స్థాయిల్లోని స్థానిక పరిపాలనా యంత్రాంగాలు సన్నద్ధమయితేనే, మనం ఆశించిన ఫలితాలను సాధించగలం. జనాభా నియంత్రణ పథకాల అమలుతో పాటు, బాలికల పట్ల నెలకొని ఉన్న వివక్షను తొలగించడానికి కూడా స్థానిక ప్రభుత్వాలు ముందుకు కదలాలి.



# జూలైలో చేయవలసిన పొలం పనులు

**వరి :** నాట్లు వేయటానికి 15 రోజుల ముందుగా పొలాన్ని తయారు చేసుకోవాలి. పొలమంత సమంగా దమ్ము చెక్కతోగాని, అడ్డతోగాని చదునుచేయాలి. రేగడి పొలాల్లో అయితే 2 రోజుల ముందు దమ్ము చేసి నాట్లు వేసుకోవాలి.

నాటేందుకు 4 నుండి 6 ఆకులున్న నారు ఎంపిక చేసుకోవాలి. నారు తీసేటప్పుడు మొక్కలు పచ్చగా వుంటే మూన త్వరగా తిరుగుతుంది. నాటేందుకు ముందు నారు కొనలను త్రుంచి నాటు కోవాలి. దీనివలన తాటాకు తెగులు కలుగచేసే హిస్పా పురుగుల గ్రుడ్లు వుంటే అవి నాశనమవుతాయి. అంతే కాదు నారు కొనలు తుంచి నాటటం వలన నాటిన నారు గాలికి కొట్టుకొని పోకుండా వుంటుంది. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ.ల చొప్పన కాలి బాటలు తీయాలి. ఈ కాలిబాటలు ఎరువులు, పురుగుమందులు చల్లటానికి, పైరు పరిస్థితి గమనించటానికి ఉపయోగపడతాయి. పైరుకి గాలి, వెలుతురు బాగా సోకుతుంది. చీడ పీడల ఉధృతి కొంతవరకు అదుపులో వుంటుంది.



దీర్ఘకాలిక రకాలైతే చ॥మీ.కి 33 కుదుళ్ళు, మధ్యకాలిక రకాలైతే 44 కుదుళ్ళు, స్వల్ప కాలిక రకాలైతే 66 కుదుళ్ళు వుండేలా నాటుకోవాలి. నాట్లు వేసేటపుడు నీరు పలుచగా వుండాలి.

హైబ్రిడ్ వరి సాగు చేస్తుంటే 22-25 రోజుల వయస్సు ఉన్న నారును ఎంపిక చేసుకోవాలి. కుదురుకు ఒకటి లేదా రెండు మొక్కలు చొప్పున చ॥మీ. కి షుమారు 50 కుదుళ్ళు ఉండేలా నాటుకోవాలి.

'శ్రీ' పద్ధతిలో వరిసాగు చేస్తుంటే 8 నుంచి 12 రోజుల వయసు గల రెండు ఆకుల నారును మాత్రమే నాటుకోవాలి. దీనివలన పిలకలు ఎక్కువ సంఖ్యలో వస్తాయి. వేర్లు బాగా వ్యాపిస్తాయి. నారు మడి నుండి మొక్కను జాగ్రత్తగా వేరు, బురద, గింజతో సహా తీసి పొలంలో పైపైన నొక్కి పెట్టాలి. మొక్కల మధ్య ఎటు చూసినా 25 సెం.మీ. దూరం వుండేలా నాటుకోవాలి. ఏ మాత్రం నీరు నిలువ వున్నా బయటకు పోవటానికి వీలుగా ప్రతి 5 మీటర్లకు ఒక కాలువ ఏర్పాటు చేయాలి.

## జొన్న

జొన్న పైరు విత్తిన 40 రోజుల వరకు పైరును కలుపు మొక్కల బారి నుండి కాపాడుకోవాలి. మెట్ట దంతులతో 2-3 పర్యాయాలు అంతర కృషి చేయాలి. విత్తిన 25-35 రోజులకు కలుపు తీసి 30 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువును పైపాటుగా వేసుకోవాలి. ఎరువువేసి బోదెల ను ఎగద్రోయాలి. జొన్న మొలిచిన 30-45 రోజుల వరకు కాండం తొలిచే పురుగు పంటకు హాని కలిగిస్తుంది. దీని నివారణకు మొక్కల సుడుల్లో హెక్టారుకి 8-10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3G గుళికలు పంట మొలిచిన 30-35 రోజులకు వేసుకోవాలి.

## సజ్జ

సజ్జ విత్తిన 30 రోజులకు పైపాటుగా ఎకరాకు 16 కిలోల నత్రజని ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. గుంటక లేద తంతితోలి అంతర కృషి చేసి ఎరువులు వేసుకోవాలి.

## మొక్కజొన్న

మొక్కజొన్న విత్తిన 35-45 రోజుల మధ్య పాపటంతో అంతరకృషి చేసి తర్వాత బోదె నాగలితో సాళ్ళు చేసుకోవాలి. భూమిలో తగినంత తేమ చూసుకొని పై పాటుగా నత్రజని వేసుకొని, తర్వాత సాళ్ళతో మట్టిని ఎగ దోసుకోవాలి.

## వేరుశనగ

వేరుశనగ ఉత్తర కోస్తా,ఉత్తర తెలంగాణాలలో జూన్, జూలై మాసాల్లోను, రాయలసీమ, దక్షిణ తెలంగాణాలలో జూలై నుండి ఆగస్టు 15 వరకు విత్తుకోవచ్చు. వేరుశెనగ వంగడాల గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తిన మోతాదు మారుతుంటుంది.

జె.యల్.24, కదిరి,3, కదిరి4, వేమన, తిరుపతి 3, తిరుపతి 4, కదిరి 5, కదిరి 6 లాంటి రకాలకు ఎకరానికి 60 కిలోల వొలచిన గింజలు అవసరమవుతాయి. ఐసిజియస్ 11, జె.సి.జ్ 88, తిరుపతి 1, తిరుపతి 2, లాంటి రకాలయితే 50 కిలో విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేక 1 గ్రాము కార్బండిజమ్ పొడి మందు చొప్పున విత్తనానికి పట్టించి వాడాలి. విత్తనాన్ని గొర్రుతో గాని నాగటి చాళ్ళలోగాని విత్తుకోవాలి. విత్తే సమయంలో నేలలో తగినంత తేమ వుండాలి. విత్తనాన్ని 5 సెం.మీ. లోతు మించకుండా విత్తుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 4-5 టన్నులు సేంద్రియ ఎరువు వేసుకోవాలి. నత్రజని యూరియా రూపంలో ఎకరాకు 27 కిలోల విత్తే సమయంలో వేసుకోవాలి. ఎకరాకు 100 కిలో సూపర్‌ఫాస్ఫేటు, 27 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి.

### ఖరీఫ్ 2010 మద్దతు ధరలు

| పంట | గతసంవత్సరం మద్దతు ధర రూపాయలలో (క్వింటాలుకు) | ఖరీఫ్ 2010 మద్దతు ధర రూపాయలలో (క్వింటాలుకు) |
|---|---|---|
| వరి (సాధారణ రకం) | 950 | 1000 |
| వరి (సూపర్ ఫైన్) | 980 | 1030 |
| మొక్కజొన్న | 840 | 880 |
| సజ్జలు | 840 | 880 |
| జొన్నలు (హైబ్రిడ్) | 840 | 880 |
| జొన్నలు (మాల్దండి) | 860 | 900 |
| కందులు | 2300 | 3000 |
| పెసలు | 2760 | 3170 |
| మినుములు | 2520 | 2900 |
| వేరుశెనగ | 2100 | 2300 |
| ప్రొద్దుతిరుగుడు | 2215 | 2350 |
| నువ్వులు | 2850 | 2900 |
| సోయాబీన్ (నల్లవి) | 1350 | 1400 |
| సోయాబీన్ (పచ్చ) | 1390 | 1440 |
| ప్రత్తి (పొట్టిపింజ) | 2500 | 2500 |
| ప్రత్తి (పొడుగు పింజ) | 3000 | 3000 |

## మిరప

మిరపలో అధిక దిగుబడి రకాలు : జి-3, జి-4, జి-5, యల్.సి.ఎ. 334, యల్.సి.ఎ 357, యల్.సి.ఎ 424 లాం 305, ప్రకాష్, భాస్కర్, అపర్ణ, కిరణ్ రకాలు అనుకూలం.

సెంటు విస్తీర్ణం నారు ముడికి 650 గ్రా. విత్తనం చల్లుకోవాలి. ఒక కిలో విత్తనానికి 8గ్రా. ఇమిగాక్లోప్రిడ్ అనే పొడి మందుతో విత్తన శుద్ధి చేసి, 15 నిమిషాలు నీడలో ఆరబెట్టి విత్తుకుంటే తామర పురుగులు, పేనుబంక పురుగులు దాదాపు 40 రోజుల పాటు ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చు. ఒక మీటరు వెడల్పు, 15 సెం.మీ ఎత్తు ఉండేటట్లు ఎత్తైన నారు మడులు చేసి మధ్యలో 30 సెం.మీ. కాలువలు తీయాలి. నారు ఆరు వారాలు పెరిగిన తరువాత నాటుకోవాలి. వర్షాధారపు పైరుకు పాదుకు ఒక మొక్క చొప్పున 5615 సెం.మీ ఎడంలో నాటు కోవాలి. నీటి వసతి కింద పాదుకు రెండు మొక్కలు 5656 సెం.మీ లేదా 6060 సెం.మీ ఎడంతో నాటుకోవాలి.



## వివిధ పథకాలు

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 'అపరాల ఉత్పత్తి వృద్ధి పరిచే కార్యక్రమం' (Accelereted pulse prodacation progaramme) అమలు చేస్తుంది. 2010 ఖరీఫ్ కాలానికి మన రాష్ట్రంలో 7 జిల్లాల్లో ఈ పథకం అమలులో వుంటుంది. నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో ఈ కార్యక్రమం అమల్లో వుంటుంది. ఈ 7 జిల్లాల్లో కంది, పెసర, మినుము పైర్లలో సమగ్ర పోషకాల యాజమాన్యం, సస్యరక్షణతో పాటు ఇతర యాజమాన్య పద్దతుల గురించి రైతుల్లో అవగాహన పెంపొందించి ఈ పంటలలో అధిక దిగుబడులకు వ్యవసాయ శాఖ కృషి చేస్తుంది. వెయ్యి హెక్టారులకు ఒక యూనిట్ చొప్పున నిర్ణయించి మొత్తం 28 యూనిట్లలో ఈ కార్యక్రమం అమలు అవుతుంది. రైతులకు సలహాలు అందించేందుకు ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ని కాంట్రాక్టు పద్ధతి నియమిస్తారు. హెక్టారుకి రూ 5400 కి మించకుండా ఒక రైతుకి 2 హెక్టార్ల విస్తీర్ణానికి సరిపడా వ్యవసాయ ఉత్పాదకాలు అంటే విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ మందులు అందజేస్తారు.

జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుల ఆధ్వర్యంలో ఈ పథకం అమలు చేస్తారు.

## వర్షాధార ప్రాంతాలలో అపరాలు, నూనెగింజల అభివృద్ధి పథకం

వర్షాధార ప్రాంతాలలో అపరాలు, నూనెగింజల దిగుబడులు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. మన రాష్ట్రంలో 660 యూనిట్లలో ఈ కార్యక్రమం అమలు అవుతుంది. ఒక్కొ యూనిట్‌లతో 10 గ్రాములు వుంటాయి.

ఆయా జిల్లాల్లోని కృషి విజ్ఞాన కేంద్రం సాంకేతిక సలహాలు ఇస్తుంది. భూమి చదును చేసుకోవటానికి ఇతర పనులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన రైతులకు అందజేస్తారు. వ్యవసాయ యంత్ర పరికరాలకు రూ. 50 లక్షలు, ట్రాక్టరుకి సంబంధించి డీజిల్, డ్రైవర్ నిత్యం ఖర్చులకు రూ 10 వేలు రివాల్వింగా ఫండ్ సమకూర్చుతారు. ప్రతి యూనిట్‌కి 35 H.P ట్రాక్టరుతో పాటు రిడ్జి/ ఫర్రోప్లాంటర్, ఒక రోటా వీడర్ మొదలైన వ్యవసాయ యంత్ర పరికరాలు అద్దె ప్రాతిపదికన ఇస్తారు. ఎంపిక చేసిన గ్రామాలలో రైతు మిత్ర గ్రూపులు, వాటర్ షెడ్ సంఘాలు ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు.

## పశుగ్రాసాల వారోత్సవాలు

పశు గణాభివృద్ధి కోసం అధిక పాల ఉత్పాదక శక్తి గల పశువుల ఎంపికకు ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నావెూ, పుష్టికరమైన పశుగ్రాసాల సాగుకు కూడా తగినంత ప్రాముఖ్యత ఇవ్వాలి. పాడి పరిశ్రమలో పశుగ్రాసాల సాగు ప్రాముఖ్యత గురించి రైతులను చైతన్య పరిచి పశుగ్రాసాల సాగు విస్తీర్ణాన్ని పెంచే ాద్దేశ్యంతో పశు సంవర్ధక శాఖ వారు ప్రతి సంవత్సరం జూలై రెండవ వారంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రైతులకు పశుగ్రాసాల సాగు గురించి అవగాహన పెంపొందించటమే కాకుండా పశుగ్రాస విత్తనాల ను రాయితీ ధరలో అందజేస్తారు.

పాడి పరిశ్రమలో సుమారు 60 శాతం పెట్టుబడి పశువుల మేతకే ఖర్చవుతుంది. కేవలం దాణా మీదనే ఆధారపడితే పాల ఉత్పత్తి ఖర్చులు పెరిగి రైతులకు పాడి గేదెల పెంపకం లాభసాటిగా వుండదు. ఈ సమస్యను అధిగమించాలంటే పుష్టికరమైన పచ్చి మేతల సాగు తప్పనిసరి. రైతులు తమకున్న భూమిలో కొంత భాగాన్ని తప్పనిసరిగా పశుగ్రాసాల సాగుకు కేటాయించాలి. అలా వీలుగాని రైతులు కనీసం అంతర పంటలుగా పశుగ్రాసాలని సాగు చేసుకోవాలి. ఖరీఫ్‌లో సాగు చేయటానికి అనువైన వివిధ పశుగ్రాస రకాల గురించి తెలుసుకుందాం.

## ఏకవార్షిక పశుగ్రాసాలు

### జొన్న

ఒకే కోత నిచ్చే రకాలు : సియస్‌వి -15, సి.యస్.హెచ్- 13, పంత్‌చారి -5

పలు కోతలనిచ్చే రకాలు: యస్.యస్.జి. 59-3 పి.సి.23, పి.సి.-106 సఫేద్‌మోతి

ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం అవుతుంది. మెట్ట ప్రాంతాల్లో ఎకరాకు దిగుబడి 6-8 టన్నులు, నీటిపారుదల పంటకు 16-24 టన్నులు దిగుబడి వుంటుంది. జొన్నను, పంట చిరు పొట్ట దశరాక ముందు ఎట్టి పరిస్థితులలోను పశువులకు మేపకూడదు. చొప్పను చిన్న చిన్న ముక్కలుగా నరికి పశువులకు మేపాలి.

**మొక్క జొన్న :** ఆఫ్రికన్ టాల్, విజయ కాంపొజిట్, మోతి కాంపొజిట్, జవహర్ కాంపోజిట్ రకాలు పశుగ్రాసంగా సాగు చేయటానికి అనువుగా వుంటాయి. ఎకరాకు 16 కిలోల విత్తనం అవసరం అవుతుంది.

వర్షాధారంగా 12 నుండి 18 టన్నులు, నీటిపారుదల పంటకు 20-24 టన్నులు దిగుబడి వుంటుంది. కండెపాల దశలో వున్నప్పుడు మొక్కజొన్నను పచ్చిమేతగా కోసి వాడు కోవాలి.

***సజ్జ :*** సజ్జలో ఏ.పి. మఫ్.బి.-2, .జైంట్ బాజ్రా రకాలు పశుగ్రాసాలుగా అనుకూలం. ఎకరాకు 3-4 కిలోల విత్తనం అవసరం. వర్షాధారపు పంటలో 6-8 టన్నులు, నీటిపారుదల పంటలో 14-16 టన్నులు దిగుబడి వస్తుంది. వర్షాధారంగా సాగు చేస్తున్నప్పుడు పంట 50 శాతం పూత దశలో ఉన్నప్పుడు కోసుకోవాలి. నీటి వసతి ఉన్నప్పుడు మొదటి కోత 50 శాతం పూత దశలో ఆ తరువాత 40 రోజుల వ్యవధిలో 12 నోతలు తీసుకోవచ్చు. సజ్జ చిరు పొట్ట దశకు రాకముందు పశువులకు మేపకూడదు.

పశువులకు ధాన్యపు జాతి, కాయజాతి పశుగ్రాసాలను కలిపి మేపుకుంటే మంచిది. వర్షాకాలంలో అధికంగా వచ్చే పశుగ్రాసాన్ని పాతర వేసి, నిల్వచేసి అవసరమైనపుడు వాడుకోవచ్చు. రైతులు పశువుల డాక్టరుని సంప్రదించి పశుగ్రాస విత్తనాలను తెప్పించుకొని ఈ ఖరీఫ్‌లో పశుగ్రాసాల సాగును తప్పని సరిగా చేపట్టాలి.

## ఖరీఫ్ మద్దతు ధరలు

వ్యవసాయ ఖర్చులు, ధరల కమీషన్ (సిఎసిపి) సిఫారసులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం జూన్ నెల 10 వ తేదీన ఖరీఫ్ 2010కి వివిధ పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. ఈ సంవత్సరం ప్రభుత్వం పప్పుధాన్యాల పంటలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. కందులకు కనీస మద్దతు ధరను క్వింటాల్‌కి రూ. 2800 గా కమీషన్



***పిల్లి పెసర :*** ఎకరాకు 8-10 కిలోల విత్తనం వాడుకోవాలి. వర్షాధారంగా 2-4 టన్నులు, నీటి వసతి వుంటే 6-8 టన్నులు దిగుబడి వస్తుంది. సారవంతమైన మాగాణి భూములు పిల్లి పెసర సాగుకు అనుకూలం.

***అలసందలు :*** రష్యన్ జాయింట్, యు.పి.పి. 5286, యు.పి.సి. 5287 ఐ.జి.యఫ్.ఆర్.ఐ -5-540 రకాలు అనుకూలం. ఎకరాకు కావలసిన విత్తన మోతాదు 10-12 కిలోలు. ఎకరాకు 8-10 టన్నుల దిగుబడి వుంటుంది. పంట 50 శాతం పూత దశలో  ఉన్నప్పుడు కోసుకోవాలి.

## బహువార్షిక పశుగ్రాసాలు

బహువార్షిక పశుగ్రాసాల్లో హైబ్రిడ్ నేపియర్, పారాగడ్డి, గినీగడ్డి, అంజన్‌గడ్డి, దీననాధ్ గడ్డి స్టైలోహెమాటే, హెడ్డి లూసర్న్ (దశరధ గడ్డి) ఖరీఫ్‌లో సాగుకు అనుకూలం.

సిఫారసు చేయగా, ప్రభుత్వం రూ. 3000 గా నిర్ణయించింది. గత ఏడాది ధరతో పోల్చితే రూ. 700 అదనంగా పెరిగినట్లయింది. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలనే వుద్దేశ్యంతో ప్రభుత్వం వీటి మద్దతు ధరను పెంచింది.

గత సంవత్సరం పప్పుధాన్యాల ఉత్పత్తి 14-77 మిలియన్ టన్నులు ఉండగా, డిమాండ్ 18-19 మిలియన్ టన్నులు వరకు వుంది. కందులతో పాటు మినుములు, పెసలు మద్దతు ధరలు కూడా పెరిగాయి. వరి, గోధుమలు లాగా ప్రభుత్వం నేరుగా రైతుల నుండి పప్పుధాన్యాలు కొనుగోలు చేయకపోయినా, మద్దతు ధరల కన్నా తక్కువగా మార్కెట్‌లో ధరలు పడిపోతే ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటుంది.

*- జి. విజయకుమార్, ఆకాశవాణి*



2003 మార్గదర్శక సూత్రాల ప్రకారం గ్రామ పంచాయితీ ద్వారా వాటర్‌షెడ్ అమలు జరిపే విధంగా "హరియాలీ మార్గదర్శక సూత్రాలు" అమలులోకి వచ్చాయి. 2008లో క్లస్టరు విధానం అనగా 4 నుండి 5 గ్రామాలులో సుమారు 1000 నుండి 5000ల హెక్టార్ల పరిధిలో వాటర్‌షెడ్‌ను గుర్తించి అమలు పరచుకొనే విధంగా నూతన కామన్ మార్గదర్శక సూత్రాలు రూపొందించబడినవి.

### మార్గదర్శక సూత్రాలలో ముఖ్యాంశాలు

- రాష్ట్రాలకు అధికారాలు
- వాటర్‌షెడ్ అమలుకు అంకితభావం కలిగిన సంస్థల ఏర్పాటు

# సమగ్ర నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి పథకం కొత్త మార్గదర్శక సూత్రాలు

కరువు పీడిత ప్రాంతాలలో సహజ వనరులైన భూమి, నీరు, పచ్చదనం కాపాడటం ద్వారా ప్రజల జీవనోపాధులు పెంపొందింప చేయడానికి నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి పథకాలను చేపట్టి అమలు చేస్తున్నారు. రైతులను, గ్రామీణ ప్రజలను, మహిళలను చైతన్య పరచి వారి భాగస్వామ్యంతో సహజ వనరుల సంరక్షణ, వ్యవసాయ, పశు ఉత్పాదకత పెంపుదల జీవనోపాదుల కల్పన ముఖ్య ఉద్దేశ్యంగా అమలు జరుపబడే ఈ పథకం అమలును పటిష్ట పరచవలసిన బాధ్యత మనందరిపైనా ఉన్నది.

ప్రొ. సి.హెచ్. హనుమంతరావు కమిటీ సిఫారసు మేరకు 1996 నుండి 2006 వరకు వాటర్‌షెడ్ పథకం నందు 1996 నుండి 2001 వరకు వాటర్‌షెడ్ పథకం నందు, ప్రజల భాగస్వామ్యాన్ని సమగ్ర విధానాల ద్వారా అమలు పరచడానికి ప్రయత్నించారు. మార్పు చేసిన మార్గదర్శక సూత్రాలు 2001 నుండి అమలులోనికి వచ్చాయి. గ్రామీణ జీవనోపాధుల పథకం మన రాష్ట్రంలో 5 కరవు ప్రాంత జిల్లాల్లో అమలు చేయబడింది.




- అంకిత భావం కలిగిన సంస్థలకు నిధుల ఏర్పాటు
- ప్రాజెక్టు అమలు వ్యవధి (4-7 సం.లు) (ప్రారంభ దశ, పనుల అమలు దశ, చివరి దశ)
- ప్రాజెక్టును ముందుగానే ముగించుకొనే అవకాశం
- సహజవనరులకు సంబంధించిన జీవనోపాధులు కల్పించడం
- 1000-5000ల హెక్టార్ల క్లష్టరు (సుమారు 4 నుండి 5 గ్రామాల పరిధిలో)
- సాంకేతిక ప్రణాళికలు (ఐ.టి. రిమోట్ సెన్సింగ్‌ను ప్రణాళికలలో ఉపయోగించడం)
- శిక్షణల మీద కేంద్రీకృతం

### పంచాయితీ రాజ్ సంస్థల పర్యవేక్షణ

- ప్రణాళికల ఆమోదం
- జిల్లా పరిషత్ అన్ని పథకాల సమన్వయాన్ని వాటర్‌షెడ్ పథకంతో చేస్తుంది.
- అమలు ప్రగతిని జిల్లా పరిషత్ పర్యవేక్షిస్తుంది.
- మండల పరిషత్ తన యంత్రాంగం ద్వారా సాంకేతిక సహకారం అందిస్తుంది
- గ్రామ పంచాయితీ నిధుల వినియోగాన్ని పర్యవేక్షిస్తుంది.
- గ్రామ పంచాయితీ ఆస్తుల రిజిష్టరు నిర్వహిస్తుంది.
- రైతులకు, మహిళా సంఘ సభ్యులకు వాటర్‌షెడ్ ద్వారా ఏర్పడిన ఆస్తులపై వినియోగ హక్కులు కల్పిస్తుంది.

### వాటర్‌షెడ్ కమిటీ

- గ్రామ సభ ద్వారా ఏర్పడుతుంది.
- గ్రామ సభ ద్వారా కమిటీ ఛైర్మన్ ఎన్నుకోబడతారు .



- వాటర్ షెడ్ సెక్రటరీని నియమించుకోవాలి.
- వాటర్‌షెడ్ కమిటీలో స్వయం సహాయక సంఘాలు, రైతులు ఉంటారు.
- వాటర్‌షెడ్ కమిటీ పేర బ్యాంకు ఖాతా ప్రారంభిస్తారు.
- ఈ మార్గదర్శక సూత్రాలు 1-4-2008 నుండి అమలులోనికి వస్తాయి.
- సమగ్రంగా సహజ వనరుల యాజమాన్యం ముఖ్య ఉద్దేశ్యం

### అమలు విధానం

1. తయారీ దశ (ప్రణాళికలు, శిక్షణలు) 1-2 సం.లు
2. పనుల అమలు 2-3 సం.లు
3. కన్సాలిడేషన్ (చివరిదశ) 1-2 సం.లు

### నిధుల కేటాయింపు

హెక్టారుకు రూ. 12000లు చొప్పున

- ప్రణాళిక ఆధారంగా మూడు విడతలలో విడుదల (20%-50% -30%)
- పరిపాలన-10%
- పర్యవేక్షణకు- 1%
- మూల్యాంకనం -1%
- తయారీ దశలో మొదటిగా నిర్వహించే పనికి-4%
- శిక్షణలకు - 5%
- ప్రణాళిక తయారీకి - 1%
- పనుల అమలుకు - 50%
- జీవనోపాధులకు - 10%
- ఉత్పాదకత జీవనోపాధులకు - 13%
- కన్సాలిడేషన్‌కు - (చివరి దశ) 5%

### సంస్థాగత ఏర్పాట్లు

రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ
↓
డి.డబ్ల్యు.డి.యు (జిల్లా నీటి అభివృద్ధి యూనిట్) (డ్వామా)
↓
ప్రాజెక్టు అమలు సంస్థ (పి.ఐ.ఎ)
↓
వాటర్‌షెడ్ కమిటీ
↓
రైతులు, కూలీలు, మహిళలు (సహజవనరులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన ప్రజలు)

### ముఖ్యంగా ఆచరించవలసిన అంశాలు

- ప్రణాళికా క్రమంలో అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించుకోవటం.
- పంచాయితీ రాజ్ సంస్థలకు, రైతులకు, మహిళా సంఘాలకు అవగాహనా కార్యక్రమాలు.
- సకాలంలో ప్రణాళిక ప్రకారం ప్రజల అభీష్టం మేరకు సాంకేతిక సహాయంతో వార్షిక ప్రణాళికలు రూపొందించుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, సాంకేతిక సహకారం అందిస్తూ అమలుపరచటం.
- రైతు సంఘాలు ఏర్పరచుకొని, భూమి, నీరు, పచ్చదనం కాపాడుకోవడానికి అవసరాలు గుర్తించుకుని అమలు పరచుకోవాలి.

మన రాష్ట్రంలో 12 జిల్లాలలో, 110 మండలాల్లో 110 క్రొత్త వాటర్‌షెడ్ ప్రాజెక్టులు ఈ మార్గదర్శక సూత్రాల ప్రకారం అమలు చేసుకొనవలసి ఉన్నందున పంచాయితీ రాజ్ సంస్థలు, ప్రజలు, రైతులు, మహిళల భాగస్వామ్యం ద్వారా అవకాశాలు, అవసరాలు గుర్తించి అమలు పరచుకుని సహజ వనరులను కాపాడుకోవడం లక్ష్యంగా ముందుకు సాగాలి.

**అమలు జరుగుతున్న జిల్లాలు (మండలాలు) వివరాలు**

| వరుస సంఖ్య | జిల్లా | మండలాల సంఖ్య |
|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | 9 |
| 2. | అనంతపురం | 17 |
| 3. | చిత్తూరు | 9 |
| 4. | కడప | 7 |
| 5. | ఖమ్మం | 2 |
| 6. | కర్నూలు | 13 |
| 7. | మహబూబ్ నగర్ | 17 |
| 8. | మెదక్ | 5 |
| 9. | నల్గొండ | 9 |
| 10. | ప్రకాశం | 14 |
| 11. | రంగారెడ్డి | 7 |
| 12. | శ్రీకాకుళం | 4 |

- సుమమాలిని
ఫ్యాకల్టీ, సి.ఎస్.ఆర్.యం., ఎ.యం.ఆర్. అపార్డ్




# వైట్‌నర్ మత్తులో జోగుతున్న బాల్యం

**'వైట్‌నర్ అంటే' ఆఫీసుల్లో టైపులో దొర్లే అచ్చు తప్పులను దిద్దడానికి వాడే తెల్లటి ద్రవం. దీన్నే కరెక్షన్ ఫ్లూయిడ్ అని కూడా అంటారు. కొంతకాలం క్రితం వరకూ నాకూ ఇంతే తెలుసు "వైట్‌నర్" గురించి. హైదరాబాదు కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రఫీయుద్దీన్ హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఈ 'వైట్‌నర్'ను మత్తు పదార్థంగా పిల్లలు దురుపయోగ పరచడం జరుగుతున్నదని తెలియచేస్తూ, ఒక వీడియో ఫిల్మ్ ప్రదర్శించారు.**

**అందులో కొందరు వీధి బాలలు వైటనర్‌ను కర్చీఫ్‌లపై కొన్ని చుక్కలు వేసుకొని పీల్చడం, దాని ప్రభావంతో మత్తుగా పడుకోవడం చూపారు. అది మొదటిసారి చూసినప్పుడు మనసులో ఎన్నో సందేహాలు, ప్రశ్నలు. మన ఆఫీసుల్లో కరెక్షన్ ఫ్లూయిడ్‌గా వాడే ఎరాజ్‌ఎక్స్ అనే తెల్లటి ద్రవం మత్తునిస్తుందా? ఇది పిల్లలకు ఎలా తెలుసు? వాళ్ళు నిజంగా దీనిని మత్తు పదార్థంగా వాడతారా ?**

ఆ తర్వాత ఒకరోజు డిన్నర్‌కి షాన్‌బాగ్ హోటల్‌కి వెళ్లడం జరిగింది. తిరిగి వస్తున్నప్పుడు పంజాగుట్ట నాలుగు రోడ్ల కూడలిలో వున్న ట్రాఫిక్ ఐలాండ్స్ దగ్గర నలుగురైదుగురు అబ్బాయిలు గుంపుగా చేరి వుండటం కనబడింది. చింపిరి గుడ్డలు, దుమ్ముకొట్టుకున్న శరీరాలు, తైలసంస్కారం లేని రేగిన జుట్టుతోనున్న వాళ్ల తలలు చూసి బాధ వేసింది. పాపం! ఎవరి పిల్లలో ఏమో! ఈ పట్టణంలో వీళ్ల బాగోగులు చూసే వాళ్లెవరూ లేక ఎట్లా బ్రతుకుతున్నారో ఏమో! ఇలా సాగుతున్నాయి ఆలోచనలు. కాస్త దగ్గరగా వచ్చాక వాళ్ల చేతిలో వున్న వస్తువు స్పష్టంగా కనబడి, ఉలిక్కిపడేలా చేసింది. ఎరేజ్-ఎక్స్ వైటనర్ సీసా!

అసలీ పిల్లలు దీన్ని ఎందుకు వాడతారు? వీళ్ల ఆరోగ్యంపై దీని ప్రభావం ఎలా వుంటుంది అన్న వివరాలలోకి వెళ్లడానికి ముందు వీళ్లు వీధి బాలలు ఎందుకవుతున్నారు అన్న విషయాన్ని కొంత పరిశీలిద్దాం!

హైదరాబాద్ జిల్లాలో యూనిసెఫ్, 2005 నివేదిక ప్రకారం నలభై ఐదు వేల మంది వీధి బాలలున్నారు. హైదరాబాద్ కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ వెల్ఫేర్ అనే మరో స్వచ్ఛంద సంస్థ 2006లో జరిపిన సర్వే ప్రకారం నగరంలోని ఒక్క సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోనే ప్రతి రోజూ నలభైమంది దాకా వీధి బాలలు హైదరాబాద్ జిల్లాకు తరలివస్తున్నట్లు తేలింది. ఇవి హైదరాబాదు జిల్లాకు చెందిన వివరాలు మాత్రమే. భారత ప్రభుత్వ అంచనాల ప్రకారం మనదేశంలో ఒక కోటి ఎనభై లక్షల మంది వీధి బాలలున్నారు.

ఇంతమంది పిల్లలు అనాథ జీవితాన్ని ఎందుకు ఎంచుకొంటున్నారు? ఏ దుర్భర పరిస్థితులలో 'వైటనర్' మత్తుకు అలవాటు పడుతున్నారు అన్న విషయాల పరిశీలనలోకి వెళితే కనిపించే కారణాలు.

- పేదరికం,
- తల్లిదండ్రులు లేకపోవడం, వున్నా ప్రేమ, ఆప్యాయతలు కరువవడం, లేదా ఆప్తుల నిరాదరణ,
- కొంత సినిమాల ప్రభావం

ప్రస్తుతం తామున్న బాధాకరమైన పరిస్థితులు, బాధించే మనషుల నుంచి పారిపోవడం మాత్రమే తెలుసు ఈ అమాయకపు పిల్లలకి. అమాయకత్వం, పసితనం-ఇవే ఆస్తిగా, ఇంతకంటే మంచి జీవితం దొరుకుతుందనే పిచ్చి కలలతో ఈ పిల్లలు కన్న వారిని, వున్న వూరిని వదిలి పట్టణాలకు చేరుకుంటున్నారు, కానీ అక్కడకు చేరుకున్నాక, చేరుకునే దారిలోనూ మరింత దయనీయంగా మారుతోంది వీరి స్థితి.

ఈ పసివాళ్ల లోకం తెలియనితనం, ఆకలి, ఇతరులను తేలికగా నమ్మే గుణం, వీరి గురించి పట్టించుకొని రక్షించే పెద్ద వాళ్లెవరూ వెంట లేకపోవడం-వీరి శ్రమని చౌకగా కొనే అవకాశాన్నిస్తోంది. ఫలితంగా వీళ్లలో కొందరు బాల కార్మికులౌతున్నారు. రైల్వే స్టేషన్లలో, బస్ స్టేషన్‌లలో, రోడ్ల కూడళ్లలో అడుక్కొనే వృత్తిలోకి నెట్టబడే వాళ్లు ఇంకొందరు. తమని చేరదీసిన వారి నాయకత్వంలో చాకచక్యంగా దొంగతనాలు చేయడాన్ని ఒంటబట్టించు కొంటున్నారు మరి కొందరు.

ఇట్లా వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, తమకు ఇష్టం

వచ్చిన పనికి ఉపయోగపడేలా ఈ పిల్లలను మలచడంలో, వీళ్లను అవమానపరచేలా మాట్లాడటం, తిండి పెట్టకుండా బాధించడం, చేతలతో హింసించడం వరిపాటి. వీరి అసహాయ స్థితిని ఆసరాగా తీసికొని వీళ్లపై లైంగిక అత్యాచారాలకు పాల్పడటం కూడా జరుగుతోంది. తీవ్రమైన అవమానం, ఎదిరించలేని అశక్తత, భయం, ఆందోళన, మనుషులంటే కోపం, కసి - ఈ భయంకర నరకం నుంచి బయటపడాలి, ఈ బాధల నుంచి పారిపోవాలి. ఎలా? ఎలా? అనే





వెతుకులాటలో ఈ పిల్లలు తమ కంటే పెద్ద పిల్లలను అనుకరిస్తూ పొగత్రాగడం, గుట్కాతినడం, వైటనర్‌ను పీల్చడం వంటి రకరకాల వ్యసనాలను అలవరచుకోవడం జరుగుతోంది.

### ఆశ్చర్యకరమైన నిజాలు

- టైప్ మిషన్ల వాడకం బాగా తగ్గి, కంప్యూటర్ల ప్రాధాన్యత, వినియోగం బాగా పెరిగిన ఈ రోజులలో కూడా టైప్‌లో దొర్లే తప్పులను దిద్దటానికి వాడే ఎరేజ్-ఎక్స్ కరెక్షన్ ఫ్లూయిడ్ అమ్మకాలు మాత్రం పడిపోలేదు.
- ఒకప్పుడు పుస్తకాలు, పెన్నులు వంటివి అమ్మే స్టేషనరీ షాపులలో మాత్రమే దొరికే ఈ ద్రవం ఇప్పుడు పాన్‌షాపులలోనూ, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్‌లలోని చిన్న షాపులలోనూ దొరుకుతోంది.
- దీని ధర ఇరవై మూడు రూపాయలు మాత్రమే. కానీ ఈ పిల్లలకు దీన్ని యాభైరూపాయల ధరతో అమ్ముతారు.

### వైటనర్ దురుపయోగం - దుష్పలితాలు

- ఈ ద్రవాన్ని పీల్చడం, దీనివెంట లభించే థిన్నర్‌ను అంటే వైటనర్ గట్టిపడినపుడు పలచబరచటానికి వాడే ద్రవాన్ని త్రాగడం వలన కలిగే దుష్ఫలితాలు ప్రాణాంతకమైనవి.
- మత్తుపానీయంగా ఆల్కహాల్‌ను తీసుకున్న అరగంట తర్వాతకానీ, మెదడుపైన దాని ప్రభావం వలన, మనిషి మత్తుకు లోనవడం జరగదు. కానీ ఈ వైటనర్‌ను పీల్చిన కొన్ని క్షణాలలోనే పిల్లలు మత్తుకు లోనవుతారు. అందువలన వీరు పరిసరాలను, ఆకలిని, తమ శరీరాలపై జరిగే దౌర్జన్యాన్ని గుర్తించలేని స్థితికి చేరుకుంటారు. తిండి తినకపోవడం వలన వీళ్లు బలహీనులవడం, రోగనిరోధక శక్తి తగ్గి రోగాల బారినపడటం జరుగుతోంది.
- ఈ వైటనర్ తాలూకు దుష్ప్రభావం అక్కడితో ఆగదు. ఊపిరితిత్తులు, మెదడు, కాలేయం, మూత్రపిండాలు - ఇలా శరీరంలోని అన్ని ప్రధాన అవయవాల మీద దుష్ప్రభావం చూపడం వలన అవన్నీ దెబ్బతింటాయి.
- అంతేకాదు, ఈ పిల్లలు గుండెపోటుతో మరణించడం కూడా జరుగుతుంది. ఇది వీళ్లు ఈ విధంగా వాసన చూడటం మొదలు పెట్టిన నాలుగోసారి కావచ్చు, నలభయ్యవసారి కావచ్చు లేదా వందవసారి కావచ్చు, ఇది ఎంత పరిమాణంలో వీళ్లు ఈ వైటనర్‌ను లోపలికి తీసుకుంటున్నారు అన్న దాన్ని బట్టి వుంటుంది. ఈ దురలవాటును మానకపోతే గుండెపోటు కారణంగా మరణం సంభవించడం మాత్రం ఖాయం.

### పాఠశాలలకు పాకుతున్న పెనుముప్పు

ఈ మధ్య కాలంలో ఈ దురలవాటుకు పాఠశాల పిల్లలు కూడా అలవాటు పడటం జరుగుతోంది. ఇంట్లో తరచూ చిల్లర డబ్బులు మాయమవుతున్నాయంటే తల్లిదండ్రులు కాస్త అప్రమత్తంగా వుండాల్సిందే. హైదరాబాదు జిల్లాలో వెలుగుచూసిన ఒక సంఘటన. ఆ కుటుంబంలో తల్లి, తండ్రి, ముగ్గురు పిల్లలు. తండ్రి కూలికి వెళ్లేవాడు. తల్లి నాలుగిళ్లలో పాచిపని చేస్తేకానీ కుటుంబం సజావుగా నడవని పరిస్థితి. వాళ్ల పెద్దబ్బాయి ఐదవ తరగతి చదివేవాడు. ఎట్లా అలవాటు పడ్డాడో తెలియదుకానీ, వైటనర్ మత్తుకు అలవాటు పడ్డాడు. ఇంట్లోంచి చిల్లర డబ్బులు మాయమవడం మొదలైంది. పిల్లవాడిలో చురుకుదనం తగ్గింది. చిరాకు, దురుసు ప్రవర్తన ఎక్కువయ్యాయి. డాక్టరు దగ్గరికి తీసుకెళితే విషయం బయట పడింది. ఇంట్లో వాళ్లకు వైటనర్ విషయం తెలిశాక ఆ అబ్బాయి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించడం మొదలుపెట్టాడు. ఇవ్వకపోతే చచ్చిపోతానని బెదిరించేవాడు. పెద్దగా అరచి, ఏడ్చి, తలబాదుకుని నానా రభసా చేసేవాడు. ఈ దురలవాటు మాన్పించడానికి అవసరమైన వైద్యం, కౌన్సిలింగ్ సేవలను ఇప్పించడానికి దాదాపు నలభై వేల దాకా ఖర్చు అయింది. ఒక స్వచ్ఛంద సంస్థ విరాళాలు ప్రోగు చేసి ఆ కుటుంబాన్ని ఆదుకొన్నది. ఈ వైటనర్ పీల్చడం మొదలు పెట్టక ముందు వినయ, విధేయతలతో మెలిగే పిల్లవాడు, అది అలవాటు అయినప్పటినుండి దురుసుగా ప్రవర్తించడం; ఇదంతా కూడా ఆ వైటనర్ మత్తుకు అలవాటు పడటం, అది లేకుండా వుండలేని స్థితికి చేరుకోవడం వల్లనే, అని ఆ అబ్బాయికి వైద్యం చేసిన డాక్టరు చెప్పారు.

### తల్లిదండ్రుల బాధ్యత

కుటుంబంలో తల్లిదండ్రులకు పిల్లల్ని పట్టించుకొనే తీరిక లేకపోవడం, పిల్లలు తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయతల కొరతను గుర్తించడం, ఆ లోటును మరొక విధంగా భర్తీ చేసుకోవడానికి వారుచేసే ప్రయత్నంలో భాగంగా ఇటువంటి దురలవాట్ల బారిన పడటం జరుగుతోంది. పిల్లలపైన పాఠశాలలో, మన పరిసరాలలో ఎటువంటి వ్యక్తులు ప్రభావం చూపుతున్నారన్నది తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

ఒక కంట కనిపెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. అంతేకాకుండా, తమకున్న సామాజిక, ఆర్థిక వనరుల పరిమితిలోనే పిల్లలను ప్రేమ, ఆప్యాయతలతో పెంచవలసిన గొప్ప బాధ్యత తల్లిదండ్రులైన వారందరిపైనా వున్నది.

### బాధ్యతాయుతమైన పౌరులుగా మన బాధ్యత

ఇదంతా బాగానే వుంది. రేపటి నుంచి వైటనర్‌ను ఎవరైనా పిల్లలు పీల్చడం చూసినా, మనకు తెలిసిన వారి పిల్లలెవరైనా వైటనర్ పీలుస్తారని తెలిసినా బాధ్యతాయుతమైన పౌరులుగా మనమేం చేయాలి? అన్నది మనందరిలో తలెత్తే ప్రశ్న.

- అలాంటి పరిస్థితి ఎదురైతే మీరు కంగారుపడి గొడవ చేయవద్దు. సంయమనం పాటించండి.
- దయచేసి, మీ ఆవేశాన్ని, ఆవేదనను అదుపులో ఉంచుకోండి. 'వైటనర్' పీలుస్తున్న పిల్లలను చూసినప్పుడు వారిని ప్రశ్నలతో



వేధించడం, మందలించడం చేయవద్దు. ఈ విషయంలో గొడవ చేయడం వలన పిల్లలు ఎదురుతిరగడం, తీవ్రమైన భ్రాంతికి లోనవడం జరగవచ్చు. అంతేకాదు, వీళ్ల గాభరా పడటం వల్ల వెంటనే గుండె పోటుకు గురికావచ్చు.
- వారికి సరైన వైద్యం, కౌన్సిలింగ్‌ల గురించిన సమాచారానికై 1098 టోల్ ఫ్రీ చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చు.

### ఈ దురలవాటును ఎలా మాన్పిస్తారు ?

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి ప్రభుత్వ సహాయంతో వీధి బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల అనుభవం ప్రకారం, వాళ్లు నడుపుతున్న వీధి బాలల గృహాలకు పోలీసుల ద్వారా వచ్చే పిల్లలలో సగం మందికి వున్న దురలవాట్లలో వైటనర్‌ను పీల్చడం ఒకటై వుంటోంది. వీరిని ఈ దురలవాటు నుంచి మాన్పించడానికి చేపట్టే రీహాబిలిటేషన్ చర్యలలో ప్రధానమైనవి మూడు అంశాలకు సంబంధించినవి.

**1. పరిసరాల మార్పు :** ఈ పిల్లలు ప్రస్తుతం వున్న పరిసరాల నుంచి వారిని సంస్థాగత సహాయం అందే చోటుకు తరలించడం. ఈ పిల్లల ప్రవర్తనలో మార్పు తేవాలంటే, ప్రస్తుతం వాళ్లలో ఈ దురలవాటుకు దోహదం చేస్తున్న పరిసరాలు, వ్యక్తుల ప్రభావం నుంచి వారిని దూరంగా వుంచడం ఎంత అవసరమో, వారిలో మార్పును తీసుకురాగల కౌశలం కలిగిన నిపుణుల సహాయం అందేలా చూడటం కూడా అంతే అవసరం.

**2. కౌన్సిలింగ్ :** ఈ అలవాటు వలన కలిగే తీవ్రదుష్పరిణామాల గురించి వారికి అర్థమయ్యేలా, వారి హృదయానికి హత్తుకునేలా వారికి సౌమ్యంగా వివరించి చెప్పడం ఈ కౌన్సిలింగ్‌లో మొదటి భాగం. వారి జీవితానికో లక్ష్యాన్ని ఏర్పరచి, ఆ లక్ష్యసాధనపై వాళ్ల దృష్టి మరల్చడం, ఈ దురలవాటును మానివేయాలనే కోరికకు అంకురార్పణ చేయడం కౌన్సిలింగ్‌లోని రెండవ భాగం. దీన్ని సాధించడానికి ఆ పిల్లల వ్యక్తిగత వివరాల సేకరణలో భాగంగా వాళ్ళు ఏ ఉద్దేశ్యంతో పట్టణానికి వచ్చారు? ఏమి సాధించాలనుకున్నారు? వంటి విషయాలను చర్చిస్తారు. వారు ప్రస్తుతం ఉన్నటువంటి పరిస్థితి నుంచి బయటపడి, చక్కగా చదువుకొని, ఏదో పని లేదా వుద్యోగంలో స్థిరపడి, సంతోషకరమైన కుటుంబ జీవితం గడుపుతున్న వాళ్ల సీనియర్లను పరిచయం చేయడం, అలాంటి వ్యక్తులతో వారి జీవితానుభవాలను చెప్పించడం వంటి వివిధ ప్రయత్నాల ద్వారా ఈ పిల్లలు తమంత తాము తమ జీవిత లక్ష్యాలను ఏర్పరచుకొనేలా, వాటి సాధనకై నడుం కట్టేలా ప్రోత్సహిస్తారు.

**3. నిరంతర పర్యవేక్షణ లేదా నిఘా :** ఈ దురలవాటును మాన్పించడానికి నిరంతర కౌన్సిలింగ్ ద్వారా ఈ పిల్లలు మళ్లీ ఆ వైట్‌నర్ జోలికి వెళ్లకుండా వుండేలా వారి మనోధైర్యాన్ని బలపరచడం, ఈ మార్పు స్థిరమయ్యే దాకా వీరి ప్రోగ్రెస్‌ను పర్యవేక్షించడం అత్యవసరం. ఇది దాదాపు మూడు, నాలుగు నెలల వ్యవధి తీసుకుంటుందన్నది కౌన్సిలర్‌ల అనుభవం.

### ప్రభుత్వ బాధ్యత

- వైట్‌నర్ దురుపయోగం ఎంతటి ప్రమాదానికి దారితీస్తుందో ప్రజలకు తెలిపే చర్యలు సంబంధిత శాఖల ద్వారా, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతోనూ చేపట్టాలి.
- పాన్‌షాపులలో, రైల్వేస్టేషన్లు, బస్టాండులలో చిన్న షాపులలోనూ వైటనర్ అమ్మకాన్ని నిషేధించాలి.
- స్టేషనరీ షాపులలో కూడా వైటనర్‌ను పిల్లలకు అమ్మడాన్ని నివారించాలి.
- ఇప్పటికే ఈ దురలవాటుకు లోనైన వారి రీహాబిలిటేషన్‌కు వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో రూపొందిస్తున్న కార్యక్రమానికి తగినన్ని నిధులు కూడా సమకూర్చాలి.

మనం తెలుసుకున్న ఈ విషయాలను పదిమందికీ తెలియజేయడం ద్వారా, మరింత మంది పిల్లలు ఈ దుర్వ్యసనం పాలుకాకుండా కాపాడటానికి మనవంతు కృషి చేద్దాం. ప్రాంతీయంగా వీధి బాలల సంక్షేమానికి పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు చేతనైన చేయూతనిద్దాం.

- డా. ఇ.వి. స్వర్ణలత,
సెంటర్‌హెడ్, మహిళా శిశు అభివృద్ధి కేంద్రం,
ఎ.ఎం.ఆర్ అపార్డ్, హైదరాబాద్.

**నన్నెచోడుడు అనే ఈ మహాకవి తెనుగులో కుమారసంభవము అనే చక్కని కావ్యాన్ని రచించాడు. ఇది పండ్రెండాశ్వాసాల గ్రంథం. నన్నెచోడ మహాకవి రచించిన ఈ కుమార సంభవ మహాకావ్యాన్ని సుప్రసిద్ధ సాహితీ పరిశోధకులైన శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు వెలుగులోకి తీసికొని వచ్చారు.**

నన్నెచోడుడు 'ఒరయూరు' అనే పట్టణాన్ని రాజధానిగా చేసికొని గోదావరీ సింహళాల మధ్యనున్న భూభాగాన్ని పరిపాలించిన మహారాజు. అందుచేత సామాన్యకవిగా కాక, రాజకవిగా ప్రసిద్ధి చెందాడు. నన్నెచోడునికి కొంచెం ఆత్మస్తుతి అంటే అభిమానం. అందుకే, తన గ్రంథంలో తనను గూర్చి,

*రవికుల శేఖరుండు, కవిరాజశిఖామణి, కావ్యకర్త, న*
*తృవి, భువి నన్నెచోడుడటె. . .*

అంటూ వివరించుకొన్నాడు. సూర్యవంశపు రాజు వంశానికి చెందినవాడు. ఆ కారణంగా ఆ వంశంలో జన్మించిన భగీరథుడు, శ్రీరామచంద్రుడు, కరికాల చోళుడు మొదలైన వారితో సమానుడనని తనను గూర్చి ఒక సీస పద్యంలో చెప్పుకొన్నాడు.

గీతము, వాద్యము, నృత్యము - ఈ మూడింటికి సంగీతం అని పేరు. వీటిలో మార్గము, దేశి అని రెండు రకాలున్నాయి. భరతాది మహర్షులు ఉచ్చరించేది మార్గకవిత. దేశంలోని జనులకు హృదయరంజకమైన గీతము దేశి అని వివరించారు.

నన్నెచోడుని కవిత్వం గురించి విశ్లేషకులు రకరకాలైన అభిప్రాయాలు వెలిబుచ్చారు. కొందరైతే పుస్తకాలే వ్రాశారు. ఈ సంగతి గ్రహించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు నన్నెచోడుని కవిత్వము మీద కవుల పోటీ నిర్వహించారు. 'నన్నెచోడుని కవిత్వము' - అనే శీర్షికతో వేదం వేంకటరాయ శాస్త్రిగారు, అమరేశం రాజేశ్వరశర్మ గారు పుస్తకాలు రచించారు. తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు కవిరాజ శిఖామణి అనే పేరుతో గ్రంథం రచించారు. ఇలా మరి కొంతమంది ఈ సాహితీయజ్ఞంలో పాలుపంచుకొన్నారు. నన్నెచోడుడు, కన్నడ భాషలో కూడ మంచికవి. సంస్కృతము, తెనుగు, కన్నడము ఈ మూడు భాషల్లోను ఈయన చేయి తిరిగిన కవి.

ఈయన నన్నయ తరువాతి వాడు అని విమర్శకులు తేల్చి చెప్పేసిన కారణంగా ఆదికవి పదవి నన్నెచోడునికి చేయి జారిపోయింది. అది పోయినా, నన్నెచోడుడు కవిత్వంలో మరెన్నో విషయాలను

# దేశి మార్గ కవితా నిర్ణాయకుడు

# నన్నెచోడుడు

ఆవిష్కరించడంలో ఆద్యుడయ్యాడు. గ్రంథ రచనకు పూనుకొనేవారు, ఇష్టదేవతా ప్రార్థన, పూర్వకవిస్తుతి, తన విషయాన్ని చెప్పుకోవడం, కుకవులను నిందించడం, కృతి భర్తను గురించి ప్రశంసించడం వంటివి ఉంటాయి. వీటికన్న ముఖ్యమైనవి షష్ఠ్యంతాలు. అంటే, కృతిపతిని షష్ఠీ విభక్తితో స్తుతించడం - ఈ మొదలైన సమస్త విషయాలకు నన్నేచోడుడు ఆద్యుడు. ఈయనను అనుకరిస్తూ తర్వాతి కవులు షష్ఠ్యంతాలు వ్రాశారు. ఇవి కంద పద్యాలలోనే ఉంటాయి.

నన్నెచోడుని తండ్రి చోడబల్లి, తల్లి శ్రీసతి. శ్రీసతినే; మాబలదేవి, మాచలదేవి అని శాసనకర్తలు శాసనాలలో తెలియజేశారు. గురువు జంగమ మల్లికార్జునుడు. నన్నెచోడునికి గురుభక్తి ఎక్కువ.

నన్నెచోడుడు, నన్నయ తిక్కనల మధ్యకాలములో ఉన్నవాడు. అనగా క్రీ.శ. 1160 తర్వాతి వాడని సాహిత్య విశ్లేషకులు నిర్ధారణ చేసి చెప్పారు. నన్నెచోడుని కావ్యాన్ని వెలుగులోకి తీసికొని వచ్చిన శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారైతే ఈయన క్రీ.శ. 940లోని వాడన్నారు. దానితో సాహితీ లోకంలో ఓ పెద్ద దుమారం రేగింది. ఇదే నిజమైతే నన్నయ గారి ఆదికవి ఆధిపత్యాన్ని ప్రశ్నించినట్లే. ఆకారణంగా నన్నయాభిమానులు, నయాభిమానులు కొందరేకమయ్యారు. శాసనాలు పరిశోధించారు. ముందు వెనుక ఉన్న కవుల గ్రంథాలను ఆపోశన పట్టారు. చివరకు నన్నయకే ఆదికవి పట్టం కట్టారు.

నన్నెచోడుడు తన కవిత్వం గూర్చి ఇలా అన్నాడు.

*మును మార్గకవిత లోకం*
*బున వెలయగ దేశికవితఁబుట్టించి తెనుం*
*గున నిలిపి రంధ్ర విషయం*
*బునఁజన చాళుక్యరాజు మొదలగుఁబలువుర్*

కవిత్వంలో మార్గకవిత్వం అని, దేశికవిత్వమని రెండు రకాలుంటాయన్నాడు. మార్గకవిత్వమంటే సంస్కృత కవిత్వమని, దేశికవిత అంటే దేశభాషా కవిత్వమని అర్థం. జనుల వ్యవహారంలో ఉండే భాష.

ఈ విషయాన్నే వివరిస్తూ సంగీత రత్నాకరం అనే గ్రంథంలో. . .

*గీతం వాద్యం తథా నృత్తం - త్రయం సంగీత ముచ్యతే!*
*మార్గో దేశీతి తద్ద్వేధా - తత్ర మార్గస్స ఉచ్యతే* అన్నారు.

నన్నెచోడ కవి తనది వస్తు కవిత్వం అని చెప్పాడు. వస్తు కవిత్వం అనే మాటకు తలకొక అర్థం చెప్పారు. కాని, ఏ కావ్యం వ్రాయాలన్నా, కథావస్తువు ఉండాలి కదా! ఆ కథ పెద్దది కావచ్చు, చిన్నదై యుండవచ్చు. వస్తుకవిత అనేది కన్నడంలో ప్రాచుర్యం పొందిన పదం. కన్నడాంధ్రాలలో కవిత చెప్పగల నన్నెచోడుడు దానిని తెనుగులోకి దిగుమతి చేశాడు.

ఒకడు, అభివృద్ధిలోకి వస్తున్నాడంటే, ఆ ప్రక్కనున్న వాడు బాధపడతాడు. అసూయా పరుడౌతాడు. అలాంటి మనస్తత్వమే కవుల్లో కూడా ఉంది. నన్నెచోడుడు అటువంటి వారిని సున్నితంగా మందలిస్తూ 'కుకవి నింద' చేశాడు.

*నెరయ రసవంతమగు కృతినెరగనేర*
*రల్పరసకృతి కెరగుదు రల్పులెల్ల,*
*చెరకు పిడిచిన రసమునకెరగిరాక*
*పిప్పి కరిగెడు నీగల పెల్లు వోలె* (1-30)




కుకవులు, చెరకు రసాన్ని విడిచిపెట్టి, రసం పిండేసిన పిప్పిమీద వాలే ఈగల వంటి వారన్నాడు. ఈ రీతిని అనుసరిస్తూ తరువాతి కవులు కుకవి నిందను తమ కావ్యాలలో ప్రవేశపెట్టారు. వారికి నన్నెచోడుడు ఈ ప్రక్రియలో ఆద్యుడయ్యాడు.

ప్రతి కవికి తన రచనను గూర్చి కొన్ని ఆశలు, ఆశయాలు ఉంటాయి. తన కవిత్వాన్ని రసజ్ఞులైన కవులు, పాఠకులు మెచ్చు కోవాలని ఉవ్విళ్ళూరుతాడు. అలాగే నన్నెచోడుడు, తన కవిత్వం చదివిన బుధులు నెమ్మనాలలో ఆనంద నిధులు నింపుకోవాలని, సమస్త వస్తు కవీశ్వరులు తన నూత్న రుచిర కావ్య రత్న వీధిలో విహరించాలని ఆశపడ్డాడు. ఈ విషయాన్ని "పదబంధంబుల నగ్గలించి. . . మదనాగంబును బోలె గ్రాలవలదా! మారెందు లేకున్నతిన్", అంటూ ఒక మత్తేభ పద్యంలో చెప్పాడు. 'మదనాగము' అంటే మదపుటేనుగు. దాన్నే మత్తేభము అంటారు. ఇక్కడ వాడిన పద్య ఛందస్సు కూడా మత్తేభకు, ఆపద్యంలో ఆపద్యనామాన్ని ఇమిడ్చి చెప్పడాన్ని 'ముద్ర' అంటారు. ఇదే ముద్రాలంకారం అంటే. . .

కుమారసంభవ కావ్యాన్ని సంస్కృతంలో కవికుల తిలకుడైన కాళిదాసు మహాకవి రచించాడు. ఈయనే కాక, ఉద్భటుడను ఒక సంస్కృత కవి కూడ కుమార సంభవము వ్రాశాడు. నన్నెచోడుడు కాళిదాసుని కుమార సంభవాన్ని, ఆదర్శంగా తీసికొన్నాడు.

*ముదమున సత్కవి కావ్యము, - నదరక విలుకాని పట్టినమ్మును, బరహృ*
*ద్భిదమై తలయూపింపని - యది కావ్యమె? వానిపట్టినదియుం గరమే?*

సత్కవీశ్వరుని యొక్క కావ్యము, విలుకాడు సంధించిన బాణము, పరుల గుండెలను చీల్చి ఆహా! అనిపిస్తూ తలయూపింపకపోతే, ఆ కావ్యమూ ఒక కావ్యమేనా? ఆ రచన చేసిన కవి కరము (చేయి) ఒక కరమేనా? - అంటూ గుండె నిబ్బరంతో చెప్పాడు.

కావ్యంలో చతురోక్తులు, అష్టాదశ వర్ణనలు, నవరసాలు, అలంకారాలు నింపి, ఇంపైన కవిత్వం చెప్పాడు నన్నెచోడుడు. కుమారసంభవంలో అష్టాదశ వర్ణనలతో కవిత్వం చెప్పి, ప్రబంధ కవిత్వానికి మార్గం నిర్దేశించిన వాడు ఇతడైతే, ప్రబంధ పరమేశ్వర బిరుదాన్ని ఈయనకు తరువాతి కాలం వాడైన ఎఱ్ఱాప్రగడ తన్నుకుపోయాడు. ఆ విధంగా నన్నెచోడుడు తన తరువాత వచ్చిన కవులకు ప్రబంధ రచనలో మార్గదర్శకుడయ్యాడు.

ప్రతి కవిలోను కొన్ని కవితా చమత్కారాలుంటాయి. హాస్యరస ప్రసంగాలుంటాయి. అవి అలతి అలతి తెలుగు పదాలతో లలితంగా ఉంటాయి. రసస్ఫూర్తిని కలిగిస్తాయి. ఓలోల, ఓలమ్మ, ఓలోలె, ఓలలాడె. . . అనే పదాలను జానపదుల వాడుకలో చూస్తాము. ఓలలాడడం అంటే మునిగితేలడం అని మనం సాధారణంగా అర్థం చెప్పుకుంటాము. ఆనందాంబుధి నోలలాడెను, అంటే ఆనందమనే సముద్రంలో మునిగితేలాడని భావం.

వసుచరిత్ర గ్రంథంలో రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) అనే కవి -

*ఓ లంబాలక 'ఓలఓల'యన ఓలోలంచు మేలంబునన్*
*లోలంబాలక యోర్తు గ్రుంకి బిసవల్లుల్ దున్మితూటాడి కెం*
*గేలం బట్టి తటాలునన్నెగసి . . .* అంటూ వర్ణించాడు.

అంతఃపుర స్త్రీలు కొందరు స్నానం చెయ్యడం కోసం క్రీడాసరస్సుకి వచ్చారు. అందులో కొందరు నీళ్ళల్లో మునిగారు. అది చూచి ఓ లంబాలక, ఓలఓల అని మరొకతెను ప్రశ్నించింది. అంటే అదెందుకు నీళ్ళల్లోకి దూకి మునిగింది? అని అడిగింది. (ఇక్కడ లంబాలక అనే పదానికి లంబ అంటే పొడవైన, అలక అంటే జుట్టు కలది అని అర్థం. బాగా పొడవైన జుట్టుగల స్త్రీ అని అర్థం) ఆ ప్రశ్నకు రెండవ స్త్రీ ఓలోల అని సమాధానం చెప్పింది, అదెందుకు మునిగిందో, ఎందుకు తేలిందో నాకేమీ తెలియదు అని చెప్పింది - ఇదే పద్ధతిలో నన్నెచోడుని చమక్ చూద్దాం.

*తనముఖ మంబుజాతమని దందడిమూవు నలి వ్రజంబుతో*
*బెనగు విదగ్ధ మ్రోలనొక బేలసతింగని యోలబెట్టి పి*
*ల్చిన నదితన్ను బట్టునని చేరిన తేటుల దాని మూవి కొం*
*డనుచును గ్రుంకిపోయి చదురాలయి నవ్వుచు లేచెనొక్కెడన్*

(9-88)

చెలికత్తెలతో కలిసి ఓ సుందరవదన జలక్రీడ లాడుతోంది. ఆమె ముఖం తామరపువ్వులాగా ఉంది. పైగా నీటిలో పీకలోతులో నిలబడింది. పైకి కనబడుతున్నది ముఖం మాత్రమే. ఆ, ముఖం నీటిమీద తేలుతున్న పద్మం లాగుంది. వెంటనే తుమ్మెదల గుంపు, ముఖం అనే పద్మం మీద వాలాయి. వాటిని తట్టుకోలేక, తరుమలేక ఆమె నానాయతనా పడుతోంది. అది చూసిన మరొక చెలికత్తె సమయం దొరికింది కదా! అని ఓలపెట్టి పిలిచింది. ఓలపెట్టి స్త్రీ తనను పట్టుకుంటుందేమోనని, తనముఖం చుట్టూ ముసురుకొన్న తుమ్మెదాలతో, "ఆమెను పట్టుకోండి" అని చెబుతూ నీళ్ళల్లో మునిగి మరో చోట తేలిందని దీని భావం. ఇటువంటి క్రీడలు. నదీతీరాలలో నివసించే వారు ఆడుకోవడం సహజమే.

ఈ ఉదాహరణను బట్టి జలక్రీడలో ఓల అనేది ఒక సంకేతం. ఒక శబ్దం. ఒక గుర్తు. ఈ విధంగా అష్టాదశ వర్ణనలతో నన్నెచోడ కవి రాజు

8 ఆశ్వాసాలతో కూడిన కుమార సంభవము అనే కావ్యాన్ని రచించాడు. కుమారసంభవము అంటే కుమారస్వామి యొక్క జననము. ఈయన ఎందుకు జన్మించవలసి వచ్చింది? దీనిలోని కథావస్తువు ఎటువంటిది? అని ప్రశ్న వేసుకుంటే, దానికి సమాధానమే కుమారసంభవము.

తారకాసురుడు అనే రాక్షసరాజు, బ్రహ్మదేవుని మెప్పించి వరాలు పొందాడు. అప్పటికి శివుని భార్య అయిన సతీదేవి ఆత్మాహుతి చేసుకుంది. శివుడు, సతీదేవి విరహానికి చింతిస్తూ తపస్సమాధిలో ఉన్నాడు. "శివుడు తిరిగి వివాహం చేసుకుంటే, ఆ దంపతులకు పుట్టబోయే కుమారుని చేతిలో మరణించే వరమిమ్మని తారకాసురుడు, బ్రహ్మదేవుని కోరాడు. బ్రహ్మవరం అనుగ్రహించాడు. వరగర్వంతో తారకాసురుడు, ఋషులను, దేవతలను, ఇంద్రుని పీడించసాగాడు. అందరూ కలిసి బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళారు.

శివ వీర్యం వల్ల ఉద్భవించిన వాడు తప్ప, మరొకడు తారకాసురుని సంహరించలేడని బ్రహ్మ వారికి చెప్పాడు. చనిపోయిన సతీదేవి, హిమవంతుని కుమార్తెగా జన్మించింది. ఆమెపేరు పార్వతి. హైమావతి అని కూడా ఆమెకు పేరుంది. పుట్టినప్పటి నుండి పార్వతి, పరమశివుని యందు ఆకర్షితురాలయింది. ఆయననే స్మరించడం, ధ్యానించడం నిత్యకృత్యాలయ్యాయి. హిమవచ్ఛిఖరాల మీద శివుడు తపస్సు చేస్తున్నాడని పార్వతికి తెలిసింది. తాను కూడ తపస్సు చేస్తానని తల్లి మేనాదేవికి చెప్పింది. అప్పుడామె, పార్వతితో, "అమ్మా! నీవు అతిసుకుమారివి, ఎండ కన్నెరుగక పెరిగిన దానివి. తపస్సు చెయ్యడమంటే అంత తేలికైన పనికాదు. తుమ్మెద వాలితే దిరిసెన పువ్వు సహిస్తుంది కాని, బలమైన పక్షి వాలితే సహించలేదు. నీ శరీరము అటువంటిదే. తపస్సు వద్దు" అని హితముపదేశించింది. అయినా పట్టుదలగా శివునకు అతిదగ్గరగా ఒక ప్రదేశాన్ని ఎన్నుకొని, పార్వతీదేవి తపశ్చర్యకు ఉపక్రమించింది.

ఈ దృశ్యం వేయి కళ్ళవాడి కళ్ళబడింది. వెంటనే మన్మథుని స్మరించాడు. ఇంద్రుని ముందు మదనుడు ప్రత్యక్షమయ్యాడు. దేవతల అవసరాలను వివరిస్తూ శివతపోభంగం కావించాలని, పార్వతీ పరమేశ్వరుల మనస్సులు ఒకటవ్వాలని, వారు వివాహం చేసుకోవాలని, ఇంద్రుడు మన్మథుడికి కర్తవ్యముపదేశించాడు. మన్మథుడింకా ఇంటికి చేరలేదేమా! అని రతీదేవి ఆలోచిస్తున్న సమయంలో మీనాంకుడు ఇంటిలో అడుగుపెట్టాడు. ఆయనలో గతంలో లేని ఉత్సాహం పెల్లుబికి వస్తోంది. అది కనిపెట్టిన రతి మన్మథుని ఆయనలోని ఉత్సాహానికి గల కారణం అడిగింది. దానికి మరుడు నవ్వుతూ "దేవీ! శివతపోభంగం కావించుమని, ఉమామహేశులనొకటి కావించుమని త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడు నన్నాదేశించాడు" అన్నాడు. ఆ మాటలు విని రతీదేవి అదిరిపడింది. మనసులో ఎంతో తల్లడిల్లింది. అపుడ మన్మథునితో,

"స్వామీ! శివుడు మన కులదైవం. ముల్లోకాలకు ఆరాధ్యుడు. బ్రహ్మదేవుని శిరసు తెగనరికిన జగజెట్టి. యముని జయించిన మృత్యుంజయుడు. శివుని మీదకు దండెత్తడమంటే. . సింహంతో వేటాడమే. స్వామీ! స్వర్గంలో ఉన్న రంభ, ఊర్వశి మొదలైన అప్సరస్త్రీలు, అందగాడవైన నీమీద మనసుపడ్డ కారణంగా నీ పీడ వదిలించుకోవాలని ఇంద్రుడు పన్నిన పన్నాగమిది. నీవు లేకపోతే అప్సరసలకు తానే (ఇంద్రుడే) దిక్కవుతాడు. ఆ విషయం ఆలోచించండి.

ఇంద్రుడు పంపాడు. నేను వెడుతున్నాను అని గొప్పలు చెప్పకండి. ఇంద్రుడు మహామాయావి. మీ మీద ఏదో ఇంద్రజాలం ప్రయోగించి ఉంటాడని నానమ్మకం. మీ ప్రయత్నం విరమించుకోండి అని రతి హితముపదేశించింది.

ఏదో ఘనకార్యం సాధించాలని బుజాలెగుర వేస్తున్న మన్మథుడికి, భార్య మాటలు రుచిస్తాయా? ఊహు... రుచించవు. అందుకే ఆమెతో,

"పిచ్చిదానా! నాశక్తి నీకు తెలియదా? నేను పుష్పబాణం విడిచిపెట్టానంటే పార్వతీపరమేశ్వరుల మనస్సులు కరిగి ఒకటైపోతాయి. నేనేమిటో, నాశక్తి సామర్థ్యాలేమిటో తెలిసి కూడా నీ యిష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావు. నీకెందుకింత భయం. శివుడు నన్నేం చేస్తాడు. ఆ భుజంగ భూషణుణ్ణి ఓ ఆటాడిస్తాను. చూడు" అన్నాడు. మదనుని మదించిన మాటలు విని రతీదేవి,

*అతని శరాసనంబు కనకాచల మిక్షు శరాసనంబు నీ*
*కతనికి నమ్ముపాశుపత మంటిన గందుడు పువ్వులమ్ము నీ*
*కతడు పురాపహరి విరహాతురపాంథజనాపహారి నీ*
*వతనికి నీకు హస్తిమశకాంతరమెమ్మెయి నెన్నిచూచినన్* (4-72)

ప్రియమదనా! శివుని ధనస్సు బంగారుకొండ (కనకాచలం). నీ ధనస్సు చెరకుగడ. శివుని బాణము పాశుపతము. ముట్టుకుంటే కందిపోయే పువ్వులు నీ బాణాలు. శివుడు త్రిపురాసుర సంహారం చేసినవాడు. నీవైతే విరహాతురులైన వారిని బాధ పెడతావు. నిజం చెప్పాలంటే నీకు, శివునకు దోమకు ఏనుగుకి ఉన్నంత తేడా ఉంది. శివభక్తులనే ఏమీ చెయ్యలేని నీ బాణాలు, శివుని ఏమి చెయ్యగలవు? అసాధ్యం సాధ్యమౌతుందని ఊహించకు మదనా!

నేనా! ఆడదాన్ని. గట్టిగా నేను కోపించి కళ్ళెర్రజేస్తే గజగజ వణికిపోయే నువ్వు, ఉగ్రలోచనుడైన ఉగ్రునిమీదికి ఉరకలెత్తి పోతాననడం చాలా విడ్డూరంగా ఉంది. పైగా ఇది అవివేకం అని హితంగానూ, మితంగానూ చెప్పిచూసింది. ఇంత చెప్పినా మన్మథుడు వినిపించుకోలేదు. చివరకు రతినే ఒప్పించి, శివతపోభంగానికి తనవెంట తీసుకువెళ్ళాడు.

చివరకు శివతపోభంగం జరుగలేదు, మన్మథ దహనం జరిగింది. రతీ విలాపం మిగిలింది. పార్వతీ కళ్యాణం జరిగింది. కుమారస్వామి జననం కూడా సాధారణంగా కాక, అసాధారణ రీతిలో జరిగింది. కుమారుని అవయవాలు గంగాస్నానానికి వచ్చిన కృత్తికలకు లభించాయి. అవయవాలన్నింటిని ఒకటిగా కలిపితే బాలుడు, శరవణభవుడుద్భవించాడు. కుమారస్వామి ఆరుగురు తల్లులబిడ్డడయ్యాడు. ఆకారణంగా కుమారుడు షాణ్మాతురుడయ్యాడు.

నన్నెచోడుడు తనకావ్యం, 'సకలావయవాలతో పరిపూర్ణత నందిన కావ్యాంగన' అన్నాడు. తనది అనూన ప్రతిభ అన్నాడు. ఎవరేమన్నా నన్నెచోడుడు నిజంగా ప్రబంధ ప్రజాపతి. ఇందులో సందేహమేలేదు.

నన్నెచోడుడు సాహిత్య ప్రపంచంలోనికి వచ్చే వరకు నున్న కవులెవరూ తమ కావ్యాలను ఎవరికీ అంకితం ఇవ్వలేదు. ఈ సదాచారాన్ని నన్నెచోడుడు ప్రారంభించాడు. తన గురుదేవుడైన గురుజంగమ మల్లికార్జునునకు అంకితం చేశాడు. కుమార సంభవం కావ్యానికి కథానాయకుడు శివుడు. ఈయన గురువు జంగమ మల్లికార్జునుడు. ఇద్దరికి అభేదం కల్పించి కథా నిర్వహణ చేసిన కవిరాజు నన్నెచోడుడు. ఈయన కృతి నవరసాకృతి.

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*

# రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాల మంజూరు ఎట్లా?

### 1. ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం 1971 రూపకల్పన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని 1971 సంవత్సరంలో తీసుకొని రావడం జరిగింది. ఈ చట్టాన్ని తర్వాత 1980, 1989, 1994, 2001 లలో సవరణ చెయ్యడం జరిగింది. ఈ చట్టాన్ని అమలు చేయటానికి 1989 ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల నియమావళిని కూడా రూపొందించడమైంది. ఈ చట్టం సమగ్రంగా రూపొంది, 09.6.1989 నుండి కార్యరూపం దాల్చింది.

### 2. ముఖ్యోద్దేశ్యం - ప్రాముఖ్యత

గ్రామ రెవెన్యూ రికార్డులు అవసరం లేకుండా రైతులకు ఋణసదుపాయాలు చేకూర్చటానికి వ్యవసాయ భూములు, హార్టికల్చర్ భూములకు సంబంధించిన హక్కుదారుల వివరాలను తయారుచేసి, వాటిని ఎప్పటికప్పుడు సరిచేసి/ తాజా పరచి, వాటి ఆధారంగా పట్టాదారు పాసుపుస్తకాలను జారీచేసే విధానం ఈ చట్టంలో నిర్వచించబడింది. ఈ చట్టం వ్యవసాయానికి ఉపయోగపడే, ఉపయోగించుచున్న భూములకు, హార్టికల్చరు భూములకు మాత్రమే వర్తిస్తుంది. వ్యవసాయేతరంగా ఉపయోగించే భూములకు, ప్రభుత్వ భూములకు ఈ చట్టం వర్తించదు.

### 3. హక్కుల రికార్డు తయారుచేసే ప్రక్రియ

సర్వే సెటిల్‌మెంటు కమీషనర్ గారి నోటిఫికేషను వెలువడిన పిమ్మట, రికార్డింగు అథారిటీ భూమి హక్కుదారుల నుండి ఫారం 1-ఎ లో క్లెయిమ్‌లు తీసుకొని బహిరంగ విచారణ జరిపి ఫారం 1 లో డ్రాఫ్ట్ భూమి హక్కుల రికార్డు తయారుచేయాలి. ఈ డ్రాఫ్ట్ రికార్డును గ్రామంలో ప్రచురించి, అభ్యంతరాలేమైనా ఉన్నట్లైతే వాటిపై విచారణ జరిపి భూమి హక్కుల రికార్డు ఖాయపరచాలి. ఈ ఖాయపరచిన భూమి హక్కుల రికార్డును (ఫారమ్ -1) బట్టి పట్టాదారు వారీగా ఫారం1.బి రిజిష్టరు తయారు చేయాలి. "1-బి" రిజిష్టరు ఆధారంగా పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్లు (హక్కు పత్రాములు) తయారు చేసి సంబంధిత భూమి హక్కుదారులకు ఇవ్వాలి.

**4.** ఈ చట్టపరిధిలో ప్రతి గ్రామంలో హక్కుల రికార్డులను తయారుచేసి, సెక్షన్ 3 ప్రకారం హక్కుదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను, టైటిల్‌డీడ్ (హక్కు పత్రాలు) లను ఇవ్వడం జరిగింది.

**5.** రూలు 15(3) ప్రకారం సెక్షన్3(3) ప్రకారం హక్కుల రికార్డు ఫైనలైజ్ చేసిన సంవత్సరంలోగా తహశీల్దారు గారు రికార్డులో గల తప్పులను సవరించవచ్చు.

### 6. హక్కుల రికార్డు కొనసాగించే ప్రక్రియ

చట్టంలోని 5వ సెక్షన్ ప్రకారం, హక్కుల రికార్డులు ఎప్పటికప్పుడు తాజా పరుస్తూ, మారిన పరిస్థితులు, హక్కుల దృష్ట్యా సరిచేసి కొత్తగా హక్కులు సంక్రమించిన హక్కుదారుల వివరాలను రికార్డులలో నమోదుచేయవలసి ఉంటుంది. ఈ నిర్వహణ విధానం నిరంతరం కొనసాగే ప్రక్రియ.

### 7. పట్టాదారు పాసు పుస్తక మార్పులు లేక కొత్తగా మంజూరు చేయవలసిన సందర్భాలు

1. పట్టాదారు మృతిచెందితే - వారసత్వ రీత్యా హక్కుదారులు
2. జాయింటు పట్టాల విభజనవల్ల
3. సమిష్టి హక్కుదారులు - వేరుపడటంవల్ల - విభజన
4. ఇనాముల రద్దు చట్టం ప్రకారం జారీకాబడిన రైత్వారీ పట్టా హక్కుల ధృవీకరణ పత్రం
5. కౌలు చట్టంలోని సెక్షన్ 38 ఇ క్రింద జారీ చేయబడిన ధృవీకరణ పత్రం
6. భూమి లేని పేదలకు డి-ఫారం పట్టా జారీచేయటంవల్ల
7. విల్లులు, విక్రయ పత్రాలు ద్వారా ఆస్తుల బదిలీ
8. రిజిష్టరైన దాన పత్రాలు
9. కోర్టు డిక్రీ
10. భూసేకరణ జరిగిన సందర్భంలో

సెక్షన్ 3 ప్రకారం రాష్ట్రంలో అన్ని గ్రామాలలో హక్కుల రికార్డులు తయారుచేయడం జరిగింది. వాటి ఆధారంతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, హక్కుల పత్రాలు (టైటిల్ డీడ్)లు చాల వరకు జారీ కాబడ్డాయి. ఐతే దరిమిలా సంభవించే భూ యాజమాన్య మార్పుల ప్రకారం హక్కుల రికార్డులలో మార్పు చేస్తూ, తాజా పర్చుకుంటూ ఉండాలి. పైన తెల్పిన సందర్భాలలో, హక్కులు సంక్రమించిన వ్యక్తి చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం హక్కులు సంక్రమించిన 90 రోజులలోగా ఫారం 6-ఎలో తహశీల్దారు వార్కి తెలియజేస్తూ, హక్కులు ఏ విధంగా సంక్రమించాయో తెలిపే డాక్యుమెంట్ల నకలు, తనకు గల పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్, హక్కులు కోల్పోయిన పట్టాదారుకి చెందిన పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ జతపర్చాలి. హక్కులు సంక్రమించిన వ్యక్తికి ఆ భూమి తప్ప గతంలో భూమి లేని కారణంగా పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ ఇచ్చి ఉండకపోతే 4 పాసు పోర్టు సైజు ఫోటోలు జతపర్చాలి. పట్టాదారు పాసు పుస్తకం పొందే నిమిత్తం రూ.15/- చెల్లించాలి. అసైన్ చేసిన భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు పొందడానికి రూ.15/- చెల్లించనవసరం లేదు.

సెక్షన్ 4 ప్రకారం హక్కులు సంక్రమించిన వ్యక్తి నుండి ఫారం-6-ఎలో ఇంటిమేషను అందిన తరువాత సెక్షన్ 5 లో నిర్దేశించిన విధంగా తహశీల్దారు దర్యాప్తు చేసి, హక్కుల రికార్డులలోను పట్టాదారు పాసుపుస్తకాలలో తగు మార్పులు చేయటానికి ఆదేశించాలి. మార్పులు చేయటానికి తిరస్కరించే సందర్భంలో హక్కులు సంక్రమించినట్లు తెలియజేస్తూ ఫారం 6-ఎ దాఖలుచేసిన వ్యక్తికి, మార్పుల వల్ల హక్కులకు భంగం వాటిల్లే ఇతర పట్టాదార్లకు తగు అవకాశం కలుగజేసి, వారి వాదనలు, రుజువులు, సాక్ష్యాలు పరిశీలించిన తరువాత మాత్రమే తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేయవచ్చు. తహశీల్దారు వారి ఉత్తర్వులకు సంతృప్తి చెందనిచో ఉత్తర్వులు అందిన 60 రోజులలోపు రెవెన్యూ డివిజనల్ అధికారి వద్ద అప్పీలు చేసుకోవచ్చును.

## 8. రిజిస్టరు కాని క్రయ దస్తా వేజుల క్రమద్ధీకరణ

సెక్షన్ 5-ఎ ప్రకారం రిజిష్టరు కాని క్రయ దస్తా వేజు ప్రకారం అనుభవిస్తున్న కొనుగోలుదారు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషను ఫీజు చలానా ద్వారా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేసిన సెక్షన్ 5-(4) ప్రకారం అట్టి క్రయాన్ని క్రమబద్ధీకరిస్తూ సర్టిఫికెట్టు జారీచేస్తారు.

ఫారం - **x** లో దరఖాస్తులు స్వీకరించటానికి గడువు ది. 28-2-2009 వరకు మాత్రమే ప్రభుత్వం వారు జి.ఒ.యం.యస్.నెం. 1445 (రెవిన్యూ డిపార్టుమెంట్) తేది: 05-12-2008 ద్వారా అనుమతి మంజూరు చేశారు. కాని సదరు సాదా బాయినామాల క్రయ విక్రయాలు ది.31-12-2000 సంవత్సరానికి పూర్వం అయి వుండాలి. ఈ ఉత్తర్వులు గ్రామీణ ప్రాంతంలో నున్న వ్యవసాయ భూములకు, చిన్న సన్నకారు రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములకు మాత్రమే వర్తిస్తుంది.

కొనుగోలుదారు దరఖాస్తును తిరస్కరించినచో, దానిపై 30 దినాలలోగా, సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి గారికి అప్పీలు చేసుకొనవచ్చును.

## 9. డూప్లికేటు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్లు పొందే విధానం

**I.** రూల్31 (1) ప్రకారం పట్టాదారు తన పాసుపుస్తకం పోగొట్టుకున్నా, లేదా పాసు పుస్తకం పాడైపోయినా, తహశీల్దారు వార్కి డూప్లికేటు పట్టాదారు పాసుపుస్తకం కొరకు అర్జీ దాఖలు చేస్తూ, రూ. 15/-లు రుసుం చెల్లించి, 4 పాసు పోర్టు సైజు ఫోటోలు జతచేయాలి. తన వద్దగల వినియోగించుటకు వీలుగాని పట్టాదారు పాసు పుస్తకం (తడిసి నందువల్ల, కాలినందువల్ల లేదా చెదలు పట్టి నందువల్ల) తహశీల్దారు వార్కి రద్దు పరచుటకు/సరెండరు చేయాలి. తహశీల్దారు డూప్లికేటు పట్టాదారు పాసుపుస్తకం తయారుచేసి, తన సంతకం చేసి, సీలువేసి ఇస్తారు.

**II.** రూల్ 31(2) ప్రకారం పట్టాదారు తన వద్దగల టైటిల్ డీడ్ తడిసి నందువల్ల, కాలినందువల్ల, లేదా చెదలు పట్టడంవల్ల అందుండే వివరాలు లేకపోయి నిరుపయోగమైనచో, అట్టి పుస్తకాన్ని సరెండరు చేస్తూ రూ.100/- లు చెలానాతో రెవెన్యూ డివిజినల్ అధికారి వార్కి దరఖాస్తు చేయాలి. అందుపై డూప్లికేటు టైటిల్ డీడ్ తయారు చేయటానికి ఉత్తర్వులు జారీ చేస్తారు. అట్టి ఉత్తర్వుల ప్రకారం తహశీల్దారు డూప్లికేటు టైటిల్ డీడ్ తయారు చేసి, అందుపై రెవెన్యూ డివిజన్ అధికారి వారి ఆమోదం, సీలు పొంది, పట్టాదారుకు అందజేస్తారు. సరెండరుచేసిన టైటిల్ డీడ్ రద్దు పరచి, పట్టా దారు ఎదురుగా రెవెన్యూ డివిజనల్ అధికారి తగుల బెట్టించాలి.

**III.** టైటిల్ డీడ్ జారవిడుచుకున్నచో (పోయినచో) తక్షణం పట్టాదారు పోలీసు స్టేషనుకు, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దార్ల పరిధి కలిగిన క్రెడిట్ ఏజెన్సీలకు (బ్యాంకు/పి.ఎ.సి.ఎస్ మొదలైనవి) లిఖిత పూర్వకంగా తెలియజేసి, తెలియజేసినట్లు ఎకనాలెడ్జిమెంట్లు పొందాలి. అలాగే టైటిల్ డీడ్ పోయినట్లు స్థానిక దిన పత్రికలో ప్రకటన చేయించి, ''ప్రకటన'' క్లిప్పింగు జాగ్రత్త పరచాలి. డూప్లికేటు టైటిల్ డీడ్ పొందుటకై రూ.100/- వంద రూపాయిలు చలానా కట్టి, చలానాతో అధికార్లకు టైటిల్ డీడ్ పోయిన విషయం తెలియజేసినట్లు పొందిన ఎకనాలెడ్జిమెంట్లు, ప్రకటన క్లిప్పింగు జతపర్చి డూప్లికేటు టైటిల్ డీడ్ జారీచేయవలసినదిగా కోరుతూ చేసే దరఖాస్తుతో జతపర్చి, 2 పాసుపోర్టు సైజు ఫొటోలతో రెవెన్యూ డివిజనల్ అధికారి వారి వద్ద దాఖలు చేయాలి.

పై విధంగా పట్టాదారు రూలు 31(2) ప్రకారం నిర్వహించవలసిన విధులు రెవెన్యూ డివిజనల్ అధికారి వారి సంతృప్తి మేరకు నిర్వహించినచో, రెవెన్యూ డివిజనల్ అధికారి వారు డూప్లికేటు టైటిల్ డీడ్ తయారుచేసి ఆమోదానికి పంపవలసినదిగా తహశీల్దారు వార్కి ఉత్తర్వులు ఇస్తారు. అట్టి ఉత్తర్వుల ప్రకారం తహశీల్దారు టైటిల్ డీడ్ డూప్లికేటు తయారు చేసి, అందుపై ఎర్రసిరాతో ''డూప్లికేటు'' అనివ్రాసి, 1-B రిజిష్టరులో కూడ డూప్లికేటు టైటిల్ డీడ్ నెంబరు నమోదుచేసి, రెవెన్యూ డివిజనల్ అధికారి వారి ఆమోదం, సీలు పొంది, డూప్లికేటు టైటిల్ డీడ్ పట్టాదారుకు నె.17 రు రిజిష్టరులో సంతకం చేయించుకొని అందజేస్తారు.

## 10. సెక్షన్ 9 ప్రకారం

కలెక్టరు వారు దరఖాస్తుపై గాని తనంతట తానుగాగాని మండల తహశీల్దారు, రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా, ఇతర దిగువ అధికార్ల ఫైల్సు హక్కుల రికార్డులు తెప్పించి, పరిశీలించి, చట్ట పరంగా సక్రమంగాను లేనిచో, దిగువ అధికార్లు సెక్షను 3,5,5- ఎ, లేదా 5-బి క్రింద జారీ చేసిన ఉత్తర్వులను రద్దు పర్చటం, మార్పు చేయటం లేదా పునర్విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేయవచ్చును. కలెక్టరు గారి వద్ద రివిజను దాఖలు చేయటానికి నిర్ణీత సమయం లేనప్పటికీ, వీలైనంత త్వరలో దాఖలు చేయాలి. భూమి హక్కుల రికార్డులు, సర్టిఫైడు నకళ్లు, సర్వే నెంబరు లేదా సబ్ డివిజను రూ.2/- ల చొప్పున రుసుము చెల్లించి పొందవచ్చును.

## 11. హక్కు పత్రాలు

### I. విధిగా రిజిస్టరు చేయించవలసినవి

1. దాన పట్టా (Gift Deed)
2. హక్కు బదిలీ (Transfer of Title in Land)
3. లీజు పట్టా (Lease of Immovable Property)
4. డిక్రీ ప్రకారం హక్కులు సంక్రమించిన సందర్భంలో (Transfer on account of a decree of a court or any award)

### II. రిజిస్టరు చేయనవసరం లేనివి

1. విల్లు (Will)
2. వారసత్వ రీత్యా హక్కు సంక్రమించిన సందర్భంలో (Succession by heirship)
3. వాటాల జాబితా (స్టాంపులపై వ్రాసి ఉండాలి) (Partition Deed need not be registered but sufficiently stamped)
4. డి-ఫారం పట్టా (D. Form Patta for assigned Land)

*- బి. వెంకటేశ్వర రావు,*
కన్సల్టెంట్, ల్యాండ్ సెల్, అపార్డ్

**తెలుగు నాట ఆబాలగోపాలానికీ వేటూరి పాట వేదం. అణువణువునా ప్రవహించే నాదం. మధురమైన వేదనలోంచి పాటకు పల్లవులూదడానికి వేటూరి ఈ భువనానికి కవితావేణువై వచ్చాడు. కృష్ణ ప్రపంచంలో మగ్గుతున్న మానవుడి చెంత సౌందర్యతీరాలను వెలిగించి 'నీకింక ఏ చింతాలేదు' అని ఊరడించిన మహానుభావుడు.**

సినీ సాహిత్యమంతా సన్నివేశ సాహిత్యం. కవికి స్వేచ్ఛ ఉండదు. మాటయినా, పాటయినా బాణీల ఇరుకు సందుల్లో పడి ఒరుసుకొంటూ నడవవలసిందే. అయితే ఆ నడకల్లోనూ ఒయ్యారాలను కులికించి, ఒంపుసొంపుల్ని ఒలికించి, కొత్తదనంతో మెరిపించి, కవిత్వంతో మురిపించిన ఘనత వేటూరి గేయ కన్యదే.

తొలినాళ్ళలో - రాసిన గేయాలకు బాణీలు కట్టేవారు. ఇది కవికి కొంతలో కొంత స్వేచ్ఛ. కానీ రాను రానూ బాణీలకి పాటల్ని మాటలతో పేర్చడం అనివార్యంగా మారింది. ఇక్కడ నుండే సంగీతం సాహిత్యంపై ఆధిపత్యం చలాయించడం మొదలయ్యింది. దాని విశ్వరూపదశలో నేడు మనం ఉన్నాం. ఈ రెండు సందర్భాలలోనూ వేటూరి పాటలు రాశారు. దేనికీ ఆయన ఇబ్బంది పడలేదు. అసలు ఇబ్బందిపడి రాసిన పాటా లేదు. కమ్మచ్చు తీగలాగా భావం, భాష, అభివ్యక్తి, ప్రయోగం ఒకదానికోసం మరొకటి పుట్టినట్టుండే ఆయన పాటలే ఈ విషయాన్ని చెప్తాయి. సందర్భాల వెంట పరుగులు తీసినట్లు ఏ పాటా ఉండదు. పాటలలో భావాలు, మాటలు సందర్భంలోంచి పుట్టుకొచ్చి, పాత్రల పెదాలపై మొగ్గతొడిగి, సహృదయుల హృదయాలలో పువ్వులై విరుస్తాయి.

పాట వేటూరి హృదయ స్పందన. అది మృదుపద స్యందనంపై, మధురోహలదారుల్లో ఊరేగింది. చిత్రవిచిత్రమయిన గతులతో, ప్రయోగాల మెరుపులతో గజ్జెకట్టి చలనచిత్ర రంగంలో వీరతాండవం చేసింది.

ఏ రసమైనా ఏ సన్నివేశమైనా ఏ ధోరణి అయినా రక్తి కట్టించేలా రాయడం ఒక్కటే ఆ కలానికి తెలుసు. ఆ భావుకతే వేటూరిని రససిద్ధి పొందిన కవిగా నిలబెట్టింది. తొలితరం రచయితలలో ఏ సందర్భానికయినా పాట రాసే ఘనత ఒక్క సముద్రాలదే. ఆ తరువాత స్థానం వేటూరి సంపాదించారు. వేటూరి అనువాదం అనువాదంలా ఉండదు. సహజంగా ఉంటుంది. 'శశివదనే శశివదనే స్వర నీలాంబరి నీవా', 'స్నేహితుడా స్నేహితుడా రహస్య స్నేహితుడా' మొదలయిన పాటలు తమిళానువాదాలని చెప్తే తప్ప తెలీదు. వేటూరి ప్రవేశించే నాటికి సినీరంగంలో మహావృక్షాల వంటి కవులున్నారు. వారందరి లక్షణాలను పుణికి పుచ్చుకొని తయారైన అంటుమొక్కయ్యాడు వేటూరి. నాటికీ, నేటికీ ఒక్కొక కవి ఒక్కొక తరహా పాటలకు ట్రేడుమార్కుగా ఉంటున్నారు.

కానీ ఏపాటకైనా వేటూరి వేటూరిమార్కే. ఎన్నో తను రాసిన పాటలలో - ఆత్రేయ చెప్పే అలతిలతి పదాల విరహవేదనలు, మల్లాదివారి నుడికారాల పోహళింపులు, పింగళి వారి భావచ్ఛాయలు, కొసరాజు జానపదబాణీలు, శ్రీశ్రీ సమ్మోహనశక్తి, దాశరథి ఉక్తి వైచిత్రులను ప్రదర్శించాడు.

వేటూరి పాట ఝుమ్మన్న నాదంలా ఘల్లుమన్న గజ్జెలా మురిపించడానికి కారణం సుష్ఠుగా చదువుకున్న సంప్రదాయ విద్య. అపారమైన శబ్దసంపద ప్రాచీన సాహిత్య అధ్యయనం ద్వారానే లభించింది. అన్నమయ్య సాహిత్యంపై విశేష కృషి చేసిన వేటూరి ఆనందమూర్తిగారి నుండి పద్యమూ, పాటా వంట పట్టింది. విశ్వనాథ వారి శిష్యరికంలో కండ పట్టింది. కీట్స్, వర్డ్స్ వర్త్ వంటి కవుల ఆకర్షణలతో అది వలపుల మొలక అయ్యింది. ప్రతిభకి తోడు పత్రికారంగం సాన పెట్టి వదిలింది. అదే తెలుగుగుండెని మధురగేయాలతో గాయాలు చేసేలా చేసింది.

# పాటల తోటమాలి



## వేటూరి

వేటూరి శబ్దబ్రహ్మ. భాషలో ఉన్న మాటల్ని తత్వాన్ని బట్టి ఏరుకొచ్చి పాటలలో పొదుగుతాడు. సన్నివేశానికి తగిన ఊహ.. ఊహకు తగిన పదబంధాలు.. భాషకు తగిన భావచిత్రాలు.. పాటకు అంతరంగ సౌందర్య హేతువులు. తడుముకున్నట్లుండని యతిప్రాసలు, శబ్దార్థాలంకారాలు, శ్లేషలు నగిషీలు దిద్దుతాయి.

వేటూరి మాటలు సందర్భాన్నీ సినిమానీ విడిచిపెట్టి సూక్తులులాగా నిలిచిపోయాయి. 'నిన్నటిదాకా శిలనయినా నీ పదము సోకి నే గౌతమినైనా', 'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహాపురుషులవుతారు యుగయుగాలకీ తరగని వెలుగవుతారు. ఇలవేలుపు లవుతారు' మొదలయినవి. అంతే కాదు సినీ సాహిత్యానికి వేటూరి మాట ఒక దివిటి. వేటూరి పాటల పల్లవులెన్నో తెలుగు సినిమా పేర్లయ్యాయి. పాతమాటల్నే కొత్తగా వాడి, కొత్త సౌరభాన్ని అద్ది లోకంపైకి వదిలాడు. ఆ పదాలే నేటికీ సినీ రచయితలకీ దారి చూపిస్తున్నాయి.

హరికథతో ప్రారంభమయిన వేటూరి సినీగేయ రచనా ప్రస్థానంలో శృంగార, వీర, హాస్య, కరుణ రస ప్లావితమైన రచనలెన్నో ఉన్నాయి.

రసోచింతగా రచించడం వల్ల ప్రతి పాటా ఒక కావ్యఖండికలా ప్రకాశిస్తుంది. పద్యపాదాల్ని సైతం గమ్మత్తుగా పాటలలో పెట్టిన నైపుణ్యం వేటూరిది. కేవలం సినీ సాహిత్యానికే పరిమితమైపోయానన్న చింత వేటూరికి లేదు. సమకాలీన సాహిత్యధోరణుల్ని ఒక కంట గమనిస్తూ, వాటినీ పాటలలో ఆయా సందర్భాలలో చెప్పిన ప్రతిభ పుష్కలంగా ఉంది. వేటూరి అద్భుతమైన భావకవి. వేటూరి రాసిన 'కొమ్మకొమ్మకో సన్నాయి కోటి రాగాలు ఉన్నాయి' అన్న పాట ఇప్పటికీ చాలామంది దేవులపల్లి రచనేననుకొంటారు. కృష్ణశాస్త్రి గారి ఊర్వశి, నండూరి వారి ఎంకి, బాపిరాజు శశికళలాంటి ఊహాసుందరులైతే వీరికి లేరు. కానీ ఆ కవుల ప్రభావాల వెల్లువని పట్టుకొని వారిలా కవిత్వాన్ని పండించిన కృషీవలుడు వేటూరి. ముఖ్యంగా ఎడబాటుపై వేటూరి రాసిన గీతాలు హృదయాలను కుదిపేస్తాయి.

'జంటని ఎడబాసిన ఒంటరి నా బ్రతుకున / మల్లె సిరివెన్నెల మంటలు రేపగ / వయసులా నులివెచ్చని, వలపులా మనసిచ్చిన / నా చెలీ చలి వేణువై వేదన లూదగా', 'మెరుపులా మెరిశావు తలపులా కలిశావు / కనులు తెరచి చూసేలోగా నిన్నలలో కలిశావు'.

అక్షరాక్షరంలోనే కాదు అక్షరంలోని శతాంశం కూడా కవిత్వంతో చిగురుటాకులా వణికి పోతుందిలా. 'పిల్లనగ్రోవికి నిలువెల్ల గాయాలు / అల్లన మోవికి తాకితే గేయాలు'. పసుపైనా కానీవా, పదాలంటు కోనీవా / పాదాలకు పారాణై పరవశించి పోనీవా / పలకరించి పోలేనా'. 'అటుచూడకు జాబిలి వైపు కరుగుతుంది చుక్కలుగా / చలిచీకటి చీరలోనే సొగసంతా దాచుకో / అటువెళ్ళకు దిక్కులవైపు, కలుస్తాయి ఒక్కటిగా / నా గుప్పెడు గుండెలోనే జగమంతా ఏలుకో' ఇది భారతీయ జీవనంలో అంతర్లీనంగా ఉన్న అద్వైత సంబంధం. అలాగే ఆదర్శ దాంపత్యం, ప్రేమ, స్నేహం, జీవితం, మానవతలకు వేటూరి ఇచ్చిన నిర్వచనాలు సార్వజనీనమైనవి.

వేటూరి పాట వయస్సెప్పుడూ పదహారేళ్ళే. ప్రేయసీప్రియుల కలల్ని అక్షరాల రెప్పల్లో పదిలంగా బంధించిన భావుకుడు. ప్రకృతిని మానవ జీవనంలో అంతర్భవింపజేసిన శక్తి వేటూరి కవిత్వానికే ఉంది. 'ఎదలో వెన్నెల / విరిసే కన్నులా', 'ఒయ్యారి గోదారమ్మ ఒళ్ళంతా ఎందుకమ్మ! కలవరం / కడలి ఒడిలో కలసిపోతే కలవరం', 'వెన్నెల్లో గోదారి అందం', 'ఉప్పొంగెనే గోదావరి' లాంటి పాటలలో సెలయేటి గలగలలు పదాల్లోకి సుతారంగా ప్రవహిస్తాయి.

ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో స్త్రీ స్థితిని వర్ణించాలంటే రక్తాశ్రువులు చిందిస్తూ మరో మహాభారతాన్ని ఆరవవేదంగా రాయాలన్నాడు. 'మర్మస్థానం కాదది నీ జన్మస్థానం / మానవతకు మోక్షమిచ్చు పుణ్యక్షేత్రం' అంటూ కాముక ప్రపంచంలో శిశువులుగా పుట్టి పశువులైన వారికి గుణపాఠం చెప్తున్నాడు. ఇది స్త్రీవాద దృక్పథం.

'తెల్లావు కడుపునా కర్రావు లుండవా/ కర్రావు కడుపునా ఎర్రావు పుట్టదా' అనే పాటలో దళిత చైతన్యాన్ని నింపాడు. 'గోవుల్లు తెల్లన / గోపయ్య నల్లన /గోధూళి ఎర్రన /ఎందువలన? అని అసమానతల్ని నిలదీశాడు. 'కదిలిరండి మనుషులైతే / కదలిరండి మనసులుంటే' అని విప్లవశంఖం పూరించాడు.

'తారతారకీ నడుమ ఆకాశం ఎందుకో / పాటపాటకీ నడుమ ఆవేశం ఎందుకో / మనిషి మనిషికీ మధ్య మన సనేది ఎందుకో' అని వేదాంతమూ పలికించాడు. 'బృందావనమది అందరిదీ, గోవిందుడు అందరి వాడేనే / ఎందుకె రాధా ఈసునసూయలు / అందములందరి ఆనందముకే' అన్న సామ్యవాది.

'నిత్యం ఏకాంత క్షణమే అడిగా / యుద్ధం లేనట్టి లోకం అడిగా / ఉదయం లాంటి హృదయం అడిగా /అనుబంధాలకు ఆయుష్షడిగా/ ఆనందాశ్రులకు ఆశీస్సడిగా / మది నొప్పించని మాటను అడిగా / ఎండమావిలో ఏరు నడిగా/మౌనభాషకు వ్యాకరణ మడిగా అన్న ఆశావాదంలో లోతయిన భావాలు, లోకహిత ఆకాంక్షలున్నాయి.

'ఎదలోతుల్లో ముళ్ళున్నా వికసించాలే ఇక రోజాలే' అన్న వేటూరి సందేశం నిరాశమయ ప్రపంచానికి దివ్యౌషధం.

మెత్తటి పదాల పొత్తిళ్ళకు, ఆణిముత్యాల్లాంటి ఆలివేణులకు, ఎలదేటి పాటలకు, వెన్నెలమ్మ వాకిళ్ళకు, మరుమల్లె తోటలకు, పుల కింతలకే పూచిన పొన్నలకు, వేటూరి పాటే చిరునామా.

ప్రాణాలన్నీ నీకే చలివేణు వైనాయి/ఉపిరి ఉయ్యాలూగే ఎదే మూగసన్నాయి' వంటి ప్రయోగాలు, తెల్లారని రాత్రులు, వేకువలో వెన్నెలలు.. సమకాలీన కవితా ప్రపంచంలో ఎక్కడా కనిపించవు. ఈ సృజన అచ్చంగా వేటూరికే సొంతం. ధ్వన్యనుకరణ శబ్దాలను లయాత్మకంగా ప్రయోగించడం, సంప్రదాయంలో ఉన్న రాగాలు, వాద్యాలను, స్వభావాలను కవితాత్మకంగా వాడడం, వేటూరిలోని ప్రయోగవైచిత్రికి నిదర్శనాలు.

పల్లవికి పలుకుబడితో ప్రాణం పోయడం, మాట్లాడే మాటలనే పాటలుగా మలచడం సామాన్యులను సైతం కట్టిపడేసే కైతపట్లు. 'కులుకుసిరి', 'నులివెచ్చని వలపు' వంటి అచ్చ తెలుగు సమాసాలు; అచ్చెరువున - అచ్చెరువున; కలవరం - కలవరం లాంటి శ్లేషలు వేటూరిలోని ప్రయోగశీలత, అలంకారాలలో ఉత్ప్రేక్ష, రూపకాలు, వాద్యాలలో పిల్లనగ్రోవి వేటూరి పాటలలో ఎక్కువగా కన్పిస్తాయి. తేటపదాలతో అలంకార బంధురంగా ధ్వని ప్రధానంగా చెప్పడమే వేటూరి పాటకు జీవం. కోకిలమ్మ పెళ్ళికి కోనంతా సందడి లాంటి పాటలు వీటికి ఉదాహరణలు.

సిరిసిరిమువ్వ, సప్తపది, శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం, మాతృదేవోభవ మొదలయిన అనేక చిత్రాల విజయానికి వేటూరి పాటే వెన్నెముక.

భావుకతను విత్తి, అభ్యుదయాన్ని పాదుకట్టి తెలుగు సినీసాహిత్యం అనే మరుమల్లె తోటని మారాకు వేయించిన ఈ పాటల తోటమాలి తన పలుకు పాటే బతుకై జీవించి ఎదమీటి వెళ్ళిపోయాడు. ఎడారిలో కోయిలలా...

*అంతే*
*కొన్ని పాటలింతే..*
*గుండెకోతలోనే చివురిస్తాయి*
*కొన్ని బతుకులింతే*
*వెన్నెలతో చితి రగిలిస్తాయి.*

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*

# గూగుల్ ఉత్తమ గ్రామం - మేడేపల్లి పంచాయతీ

పరిపాలనలో వినూత్న పద్ధతుల ద్వారా ప్రజలకు అత్యున్నత సేవలందిస్తున్నందుకుగాను గూగుల్ గ్రామ పురస్కారాలు అందుకున్న గ్రామ పంచాయతీల వివరాలను స్థానికపాలన మాసపత్రికలో గత మూడు సంచికల నుండి ధారావాహికంగా అందచేస్తున్నాము. ఈ సంచికలో ఈ పురస్కారాన్ని అందుకున్న ఖమ్మం జిల్లాలోని మేడేపల్లి, పంచాయతీ గురించి వివరాలు తెలుసుకుందాం.

### మేడేపల్లి గ్రామపంచాయతీ

స్వయంసహాయక సంఘాలు, నీటివినియోగ దారుల సంఘాలు, విద్యా కమిటీల వంటి సమాంతర ఏర్పాట్లు పంచాయతీరాజ్ సంస్థల ఎదుగుదలకు ముప్పుగా పరిణమిస్తున్నాయన్న వాదన నేడు పంచాయతీరాజ్ సంస్థలకు అనుకూలంగా పనిచేసే స్వచ్ఛంద, ప్రభుత్వ రంగాలలోని వారిలో ప్రబలంగా ఉన్నది. ఇటువంటి వాదనను పూర్తిగా కాదనలేకపోయినప్పటికీ, గ్రామంలో అభివృద్ధి సాధనకు మహిళాస్వయంసహాయక సంఘాల సంఘటిత శక్తిని సాధనంగా మలుచుకొన్న ఆసక్తికరమైన వైనం ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, మేడేపల్లి గ్రామపంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామంలో ఉన్న సుమారు 50 స్వయం సహాయక సంఘాలలోని 550 మంది మహిళల సహాయంతో మేడేపల్లి గ్రామపంచాయతీని మద్యపానరహిత గ్రామంగా బహిరంగ మలవిసర్జన రహిత, నిర్మల గ్రామంగా మలచటంలో గ్రామపంచాయతీ, ప్రత్యేకంగా సర్పంచ్, ఎం.పి.టి.సి ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు చేసిన కృషి అభినందనీయం.

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో మేడేపల్లి గ్రామపంచాయతీ ఇటీవలి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి శుభ్రం అవార్డు కేంద్ర ప్రభుత్వం నుండి నిర్మల గ్రామ పురస్కారం గూగుల్. ఓ.ఆర్.జి ఉత్తమ గ్రామపంచాయతీ పురస్కారం పొంది వార్తల్లో ప్రముఖంగా నిలిచింది. ఈ గ్రామపంచాయతీ జనాభా 2905. మొత్తం 780 కుటుంబాలలో సుమారు 658 కుటుంబాలు పేద కుటుంబాలే. ఐతే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలపటంలో వీరి పేదరికం ఏమాత్రం అడ్డురాలేదు. నేడు ఖమ్మం జిల్లాలో అత్యంత పరిశుభ్ర గ్రామం అనగానే మేడేపల్లి వైపు దారిచూపిస్తారంటే అతిశయోక్తిగాదు. రెండు సంవత్సరాల క్రిందట మేడేపల్లి పంచాయతీ గురించి జిల్లాలో పెద్దగా ఎవరికీ తెలియదు. ఐతే భారత ప్రభుత్వం "సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని" ప్రోత్సహించటానికి ప్రవేశపెట్టిన నిర్మల గ్రామపురస్కార్ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శుభ్రం అవార్డులు గ్రామ సర్పంచ్ సామినేని హరిప్రసాద్‌ను ఈ దిశగా ఆలోచింపచేసాయి. పంచాయతీ ప్రయత్నానికి జిల్లా కలెక్టరు, ఇతర అధికారులు, స్థానిక మండల పరిషత్ ప్రోత్సాహం, రీడ్స్ స్వచ్ఛంద సంస్థల సహకారం తోడవడంతో ద్విగుణీకృత ఉత్సాహంతో గ్రామ సర్పంచ్ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా మలచటానికి పలు చర్యలు చేపట్టారు.

గ్రామీణ ప్రాంతమనగానే పచ్చని పైర్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, కల్మషంలేని ప్రజలు ఇలా ఎన్నింటికో నెలవైనప్పటికీ మానవుని కనీస అవసరాలైన త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఆరోగ్యం తదితర రంగాలలో మౌలిక వసతులు లేమితో గ్రామీణ ప్రాంతాలు సతమతమవుతున్న ఈ రోజులలో పట్టణ ప్రాంతాలకు ధీటుగా గ్రామంలోనే ఈ సౌకర్యాలు ప్రజలకు అందజేస్తున్న మేడేపల్లి ముఖ చిత్రం ఒకనాడు అపారిశుద్ధ్య పరిస్థితులు, పూడుకపోయిన మురుగుకాల్వలు, రహదారులపైకి పొంగిపొర్లుతున్న మురుగునీరు, గ్రామ పొలిమేరల నుండే రహదారుల కిరువైపుల దుర్గంధాలను వెదజల్లుతూ మల విసర్జతాలు, కలుషిత త్రాగునీటి వనరులు పైపులైన్ల లీకేజీలు, పిట్‌ట్యాప్‌లు, గతుకులరోడ్ల తో నిండి ఉండేవి. ఐతే గ్రామ పంచాయతీ సర్పంచ్, గ్రామస్థులు చేసిన కృషితో నేడు ఈ గ్రామం తళతళలాడే అద్దంలా మెరిసే అంతర్గత రహదారులు, రహదారులకు ఇరువైపులు పచ్చని చెట్లు, పూల మొక్కలతో ప్రతీ ఒక్కరికీ స్వాగతం పలుకుతోంది మేడేపల్లి గ్రామం.

### అభివృద్ధి సోపానం

పరిశుభ్ర గ్రామంగా మేడేపల్లిని తీర్చిదిద్దటంలో గ్రామసర్పంచ్ సామినేని ప్రసాదరావు గ్రామ ప్రజలందరినీ భాగస్వామ్యులను చేయటంలో కీలకపాత్ర పోషించారు. గ్రామంలోని 48 డ్వాక్రా గ్రూపుల సంఘటిత శక్తిని వినియోగించుకుని గ్రామాన్ని ఆదర్శగ్రామంగా మలచిన తీరు ప్రశంసనీయమేకాక, అనుసరణీయం కూడా. ఒక ప్రణాళిక ప్రకారం మహిళా సంఘాలలోని 550 సభ్యులను గ్రామసభద్వారా సమావేశపరిచి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుకుంటే కలిగే లాభాలను గురించి ఆయన వివరించారు.

### గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చి దిద్దటానికి ప్రధానంగా

1. గ్రామస్థులందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొనేలా ప్రోత్సహించటం.

2.వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోలేని వారికోసం పంచాయితీ ఆధ్వర్యంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించటం.

3. పంచాయతీలోని వీధులు, ఇతర బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచటం.




4. గ్రామంలో రోజువారీ ఉత్పన్నమయ్యే ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల యాజమాన్యాన్ని సక్రమంగా నిర్వహించటం.

5. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన రక్షిత త్రాగు నీటిని సరఫరా చేయడం వంటి పనులు చేపట్టాలని సమిష్టిగా గ్రామ సభలో నిర్ణయం తీసుకొన్నారు.

నిర్ణయం తీసుకోవటం ఒక ప్రగతికి ఒక మెట్టయితే ఆ నిర్ణయాన్ని చిత్త శుద్ధితో అమలు చేయటం మరొక మెట్టుగా చెప్పవచ్చు.

### వ్యక్తిగత మరుగుదొడ్లు

ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొనేలా ప్రోత్సహించటానికి స్వయంసహాయక సంఘాలలోని మహిళల సహకారంతో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రజల అలవాట్లలో ఒక్కసారిగా మార్పు తీసుకొని రావటం కష్టం కాబట్టి నయానో, భయానో వారిని ఒప్పించేందుకు గ్రామ సర్పంచ్, మహిళా సంఘాలు చేయని ప్రయత్నం లేదంటే అతిశయోక్తి లేదు. బహిరంగ మల విసర్జన చేస్తే రూ. 500/లు అపరాధ రుసుం విధిస్తామని భయపెట్టడం మొదలు, బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య హాని, తదితర విషయాలపై అవగాహనా సదస్సులు, గోడలపై వ్రాతలు, కరపత్రాల పంపిణీ వంటివి చేపట్టారు.మొత్తం మీద ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు 8 నెలలకాలంలో నిర్మించుకొనేలా చేయగల్గారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయటమే కాక పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించి పరిశుభ్రతా విషయంలో విద్యార్థులు పాటించవలసిన జాగ్రత్తలు, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుగుకోవలసిన అవసరాన్ని చెప్పటం వంటివి గ్రామ పంచాయతీ సభ్యులతో కలసి మహిళలు చేపట్టారు. ఆరోగ్య సంరక్షణలో, పరిసరాల పరిశుభ్రంగా ఉంచటంలో ప్రజలు ఏ మేరకు పాల్గొంటున్నారు. నియమాలను పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించటానికి గ్రామంలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని పర్యవేక్షించటం వల్ల అనుకున్న ఫలితాలు సాధించారు.

గ్రామంలో గల అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంటే గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ సెంటర్లు, కో - ఆపరేటివ్ సొసైటీ, పశువైద్యశాల, సబ్‌సెంటర్ వంటి ప్రదేశాలలో కూడా మరుగుదొడ్లు నిర్మించారు.

### గ్రామపంచాయతీలో వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ

గ్రామంలోని అంతర్గత రహదారులను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను గ్రామంలో ఉన్న 48 ఎస్.హెచ్.జిలు పంచుకొన్నాయి. ఎస్.హెచ్.జిల వారీగా గ్రామ వీధులను దత్తత తీసుకొన్నారు. ప్రతి సోమ, గురువారాల్లో మహిళలు చీపురు చేత పట్టి ఊరు శుభ్రం చేయటం, వీధుల్లో చెత్తవేయకుండా ప్రజలలో అవగాహన కల్గించటం వంటి పనులు చేపట్టారు. ఎవరైనా తమకు కేటాయించిన వీధులను శుభ్రపరచకపోతే రూ 50/-లు అపరాధ రుసుం చెల్లించాల్సిందే. సర్పంచ్ భార్య మొదులుకొని సామాన్య మహిళ వరకూ ప్రతి ఒక్కరూ వీధులు శుభ్రపర్చవలసినదే. వారంలో 5 రోజులు తమ కుటుంబం కోసం రెండు రోజులు, గ్రామం కోసం శ్రమిస్తున్న మహిళా మూర్తులు నిజంగా అభినందనీయులు.

### ఘన, ద్రవ,వ్యర్థ పదార్థాల నిర్వహణ

గ్రామంలో ఉత్పన్నమయిన ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాల నిర్వహణకు కూడా పంచాయతీ పక్కా ప్రణాళికలను అమలు పరిచింది. రోజువారీ గృహ సంబంధ కార్యక్రలాపాల వల్ల ఇళ్ళలో పోగయ్యే వ్యర్థ పదార్థాలను గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సేకరించేముందు, ఈ వ్యర్థాలను తడిచెత్త, పొడిచెత్తగా విభజించుకోవాల్సిన ఆవశ్యకతను గ్రామ ప్రజలకు గ్రామపంచాయతీ, మహిళా సంఘాలే వివరించాయి. వ్యర్థపదార్థాలను తడిచెత్త అంటే సహజంగా భూమిలో కలిసిపోయే వ్యర్థ పదార్థాలని పొడిచెత్త అంటే ప్లాస్టిక్ భూమిలో సహజంగా కలిసిపోని ఇతర వస్తువులు గాను విడగొట్టి, తడిచెత్తను ఒక ప్రత్యేక చెత్తబుట్టలో, అలాగే పొడిచెత్తను మరొక ప్రత్యేక చెత్తబుట్టలో వేయవలసినదిగా గ్రామస్థులను ప్రోత్సహించి, ఈ విధంగా సేకరించిన వ్యర్థ పదార్థాలలో తడిచెత్త నుండి వర్మికంపోస్టును, పొడి చెత్తనుండి ప్లాస్టిక్, పేపర్, తదితర వస్తువుల విడదీసి ఊరికి దూరంగా ల్యాండ్ ఫిల్‌లో పారబోసే విధంగా గ్రామంలో చర్యలు చేపట్టారు. తొలి రోజుల్లో గ్రామస్థులకు కష్టం అన్పించినప్పటికీ ఇప్పుడు అందరికీ అలవాటయ్యిందంటారు సర్పంచ్ సామినేని హరిప్రసాద్. అదేవిధంగా ఇళ్ళలో వాడిన నీరు రహదారులపై ప్రవహించకుండా ఇంటింటా ఇంకుడు గుంటలు త్రవ్వుకోవటానికి ప్రజలను ప్రోత్సహించిన తీరు కూడా ప్రశంసనీయం. ప్రతీ ఇంటిలో ఇంకుడు గుంటలు ఉండటంతో రోజువారీ వాడకం నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకిపోతుంది, నీరు వృధాగా పొంగిపొర్లటానికి ఏ మాత్రం ఆస్కారం లేదు.

### సురక్షిత త్రాగునీరు

గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ, నీటివనరైన భూగర్భజలాలలో ఫ్లోరైడ్ పరిమాణం మోతాదుకి మించి ఉండటంతో

గ్రామస్థులంతా ఏకమై డీఫ్లోరిడేషన్ ప్లాంటు నిర్మించుకున్నారు. కల్పించుకున్న కొత్త మౌలిక వసతులను సుస్థిర ప్రాతిపదికన నిర్వహించుకోవటానికి గాను భాగస్వాములు అందరూ నిర్ణీత రుసుం చెల్లించి నీటిని పొందాలని గ్రామసభలో నిర్ణయించుకొని, నిర్ణయానికి అనుగుణంగా నీటి శుద్ధి ప్లాంటు నుండి వీరు రోజు వారీగా నామమాత్ర ధరకు అంటే 20 లీటర్లు ఒక రూపాయికి కొనుగోలు చేస్తున్నారు. స్వయంసహాయక సంఘాలు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నీటి శుద్ధి ప్లాంటు నిర్వహణకు నెలకు రూ 4,000/-లు ఖర్చుకాగా, మిగిలిన సొమ్ముతో గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా నీటిసరఫరా చేస్తున్నారు.

సురక్షిత త్రాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసుకొన్న నీటి శుద్ధి ప్లాంటు వల్ల గతంలో 2.5 గా ఉన్న ఫ్లోరైడ్ పరిమాణం 0.05 పి.పి.ఎంకు తగ్గింది. ఫ్లోరైడ్ రహిత నీటిని వినియోగించటం వల్ల రెండు సంవత్సరాల నుండి గ్రామస్థులకు కీళ్ళ నొప్పులు, సమస్యలు లేవు, గ్రామంలో క్రొత్త ఫ్లోరోసిస్ కేసులు లేవు, మహిళలు రుతుసంబంధ వ్యాధుల్లో తగ్గుదల, అతిసార కేసుల తగ్గుదల, జీర్ణ కోశ సంబంధ వ్యాధుల్లో తగ్గుదల వచ్చిందంటారు సర్పంచ్, పంచాయతీ సభ్యులు, గ్రామస్థులు

గ్రామంలో నీటివనరుల సంరక్షణకు, భూగర్భ జలాల సంరక్షణకు కూడా గ్రామపంచాయతీ కొన్ని చర్యలు చేపట్టింది. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బోర్‌వెల్సును భూగర్భ జలాల రీఛార్జింగ్‌కు వినియోగిస్తుండటం ప్రశంసనీయం.

### మానవ వనరుల అభివృద్ధి

మానవ అభివృద్ధి రంగంలోకూడా అంటే ప్రజలకు విద్య, వైద్యం, ఆరోగ్యం, తదితర సేవలు అందించటంలో కూడా గ్రామపంచాయితీ గణనీయమైన పురోగతి సాధించింది. గ్రామంలో బడి ఈడు గల విద్యార్థులంతా బడిలోనే ఉండటం, 0-6 సం॥ వయస్సు గల పిల్లలు 2 అంగన్ వాడీలలో నమోదు కావటం, గర్భవతులకు ప్రసవపూర్వ, ప్రసవానంతర సేవలు, పోషకాహారం సక్రమంగా అందచేయటం, ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు, పశు పక్ష్యాదులకు కూడా వైద్య సేవలు గ్రామంలోనే అందుబాటులో ఉండటంతో ప్రజలు సౌకర్యవంతమైన జీవితం గడుపుతున్నారు. గ్రామ ప్రజలు పంచాయతీపై విశ్వాసాన్ని వ్యక్తం చేయటం ఒక గుర్తించదగ్గ పరిణామం.

మహిళా సంఘాలు చైతన్యాన్ని ఉపయోగించుకోవటంలో గ్రామ సర్పంచ్ మరో అడుగు ముందుకు వేసి గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించటంలో విజయాన్ని సాధించారు. గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దారు.

గ్రామంలోని శ్రీ స్నేహిత, స్వయంకృషి గ్రామసంఘాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న 48 స్వయంసహాయక సంఘాలు క్రమం తప్పకుండా పొదుపు, అప్పు కార్యకలాపాలు మంచి క్రమశిక్షణతో నడుపుకుంటున్న తీరు, సుమారు కోటి రూపాయల పైబడిన కమ్యూనిటీ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్‌ను నిర్వహిస్తున్న తీరు కూడా ఆసక్తి కరమైన విషయం. గ్రామంలో 95 శాతం కుటుంబాలు జీవిత భీమా చందాదారులు. గ్రామ ప్రజల ఆరోగ్యం సంరక్షణ కోసం చిన్నపాటి జిమ్, ఆహ్లాదకరమైన పార్కు మొదలైన వసతులు కూడా స్థానిక ప్రజల సహకారంతో గ్రామపంచాయతీ ఏర్పాటు చేసింది. తరుచుగా గ్రామంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం గ్రామంలో పరిపాటి. గ్రామంలో నేత్రదానం చేసిన వ్యక్తులు 14 మంది ఉండటం కూడా ఒక విశేషమే.

ఏ సమస్యనైనా గ్రామసభలో చర్చించి, సమిష్టినిర్ణయం తీసుకోవటమే తమ గ్రామ పంచాయతీ విజయ రహస్యం అంటారు సర్పంచ్ శ్రీ సామినేని హరిప్రసాద్. సాధారణంగా కాగితాలకే పరిమితమైన గ్రామసభ, మేడేపల్లి గ్రామంలో మాత్రం మహిళా చైతన్యంతో రాజ్యాంగ స్ఫూర్తికి అద్దం పట్టేలా జరగటం శ్లాఘనీయం.

మేడేపల్లి గ్రామ పంచాయతీ ప్రజలకు అందచేస్తున్న సేవలను గుర్తించి గూగుల్ పురస్కారాన్ని అందచేసిందంటే పంచాయతీ చేస్తున్న విశిష్ట సేవలకు సముచిత గౌరవం దక్కినట్లే.

పట్టణాలలో లభించే సకల సేవలూ, పల్లెలలో అందుబాటులో ఉంటే గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలసలు తగ్గుతాయి. ప్రజల జీవన నాణ్యత పెరగటమే కాక పేదరిక నిర్మూలనకు కూడా ఎంతో అవకాశం ఉంటుంది. ప్రభుత్వం అందచేసే సహాయానికి స్థానిక న్యాయకత్వం, స్థానిక ప్రజల సహకారంతోడయితే అన్ని గ్రామాలు మేడేపల్లి లాంటి గ్రామాలే అవుతాయి. ఇప్పటికి ఖమ్మం జిల్లాలోని పలు గ్రామపంచాయతీలు మేడేపల్లి పంచాయతీ నుండి స్ఫూర్తి పొంది తమ గ్రామాలను కూడా మేడేపల్లి తరహాలో ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దుకుంటున్నాయి.

మనదేశంలో వివిద రాష్ట్రాల నుండేకాక అమెరికా, చైనా, యుగాండా వంటి విదేశాల నుండి పలువురు సందర్శకులు ఈ గ్రామపంచాయతీని సందర్శించి ప్రజల భాగస్వామ్యంతో, స్థానిక ప్రభుత్వం అందిస్తున్న సేవలపట్ల ముగ్ధులయ్యారు. ఆదర్శగ్రామంగా రూపుదిద్దుకొన్న గ్రామాన్ని పదికాలాల పాటు ఆదర్శంగా, నిలవడానికి గాను అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులుగా చేస్తూ గ్రామసభను ఒక వేదికగా చేసుకొని, ప్రగతిని తరుచుగా పర్యవేక్షించుకుంటూ, పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన సేవలందిచటానికి గ్రామపంచాయతీ అన్ని చర్యలూ తీసుకుంది. గ్రామపంచాయతీ చేస్తున్న ఈ కృషి సుస్థిరంగా నిలవాలని ఆశిద్దాం. వచ్చే సంచికలో మరో గూగుల్ ఉత్తమ గ్రామ పంచాయతీ కథతో మీ ముందుకువస్తాం.

***- డా.శివ శంకర ప్రసాద్***
ఫ్యాకల్టీ, అపార్డ్

# నిజాయితీకి సాకారం

**“ప్రజలు సంపాదనాశక్తిని, కార్యదక్షతను, నైపుణ్యాన్ని వివిధము లైన చేతిపనుల ద్వారా పెంపొందించుకోవాలి. చేతనైన వారందరూ కష్టించి పని చేసే వీలు కల్పించాలి. యాంత్రిక శక్తిని వినియోగించుకొని దేశ పారిశ్రామిక ప్రగతికి ముందంజవేయాలి. భారతీయులలో ప్రబలంగా వున్న ‘అంతా తలరాత’ అన్న అలసత్వభావం రూపుమాపి నిరంతర కృషి ద్వారా సంపదను, దీక్షను, కర్తవ్యపాలనను ప్రజలలో రేకెత్తించటం ప్రభుత్వ కర్తవ్యం”.**

**1912 మైసూరు సంస్థాన దివానుగా అధికారాన్ని చేపడుతూ, శ్రీ విశ్వేశ్వరయ్య చేసిన ప్రసంగం నుండి పై వాక్యాలు ఉటంకింపబడ్డాయి. విశ్వవిఖ్యాత ఇంజనీర్‌గా, పాలనాదక్షుడుగా, రాజనీతిజ్ఞుడుగా, నిష్కామదేశభక్తుడిగా అఖండ కీర్తిని ఆర్జించిన మహానీయుడు శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య.**




**భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య**

విశ్వేశ్వరయ్య పూర్వీకులు నేటి ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం గ్రామం నుండి సుమారు రెండు దశాబ్దాల క్రితం, కర్ణాటక రాష్ట్రం (అప్పట్లో మైసూరు) లోని, చిక్కబళ్ళాపుర సమీపంలోని ముద్దేనహళ్లిలో స్థిరపడ్డారు. అక్కడే విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబర్ 15 న జన్మించారు. తండ్రి శ్రీనివాస శాస్త్రి. తల్లి వెంకట లక్ష్మమ్మ. వారిదో సామాన్య కుటుంబం. బాల్యంలోనే తండ్రి మరణించాడు. మేనమామ రామయ్య బాలుడైన విశ్వేశ్వరయ్యను చేరదీసి బెంగుళూరు సెంట్రల్ కాలేజీలో చదువుకునే ఏర్పాటు చేశాడు.

విశ్వేశ్వరయ్య విద్యార్థి జీవితం విద్యాభ్యాసం సాగించే వారందరికి దిక్సూచి. మేనమామ ఇంట్లో వుంటూ, కాలేజి ఫీజుల కోసం ప్రైవేట్ ట్యూషన్ చెబుతూ 1881లో పట్టభద్రులయ్యారు. సెంట్రల్ కాలేజి ప్రిన్సిపాల్ ఛార్లెస్ వాటర్స్ విశ్వేశ్వరయ్య నెంతగానో ప్రోత్సహించాడు. గణితంలో అసామాన్య ప్రతిభగల విశ్వేశ్వరయ్య నుండి అధ్యాపకులే తమ సంశయాలను పరిష్కరించుకునేవారు.

శిష్యుని కుశాగ్ర బుద్ధికి ముగ్ధుడైన ప్రిన్సిపాల్ తాను ఉపయోగించుకునే వెబ్‌స్టర్ డిక్షనరీని బహుమానంగా ఇచ్చాడు. తన కోటుకున్న బంగారు బొత్తాలను భార్య ద్వారా శిష్యుడు విశ్వేశ్వరయ్యకు పంపారు. అదీ ఆనాటి గురుశిష్యుల అనుబంధం - శిష్యవాత్సల్యం.

ఇటువంటి పెద్దలు ఆదరించినందువల్లనే బాలుడైన విశ్వేశ్వరయ్య, ఆ తరువాత డాక్టర్ ఎం.వి.సర్, ఎం.వి. ‘భారతరత్న’ ఎం.వి. అంటూ ప్రస్తుతింపబడినారు. అప్పట్లో మైసూరు సంస్థాన దివానుగా వుండిన దివాన్ రంగాచార్లుగారు విశ్వేశ్వరయ్య విద్యావినయాలను గుర్తించి ఇంజనీరింగ్ విద్యాభ్యాసం సాగించేందుకు స్కాలర్‌షిప్ మంజూరు చేసి, పూనేకు పంపారు.

ఇంజనీరింగ్ పరీక్షలో బొంబాయి రాష్ట్రంలో సర్వప్రథముడుగా ఉత్తీర్ణులైన విశ్వేశ్వరయ్య గారిని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియమించింది. ఏడాది లోపునే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమించారు. ఆ రోజుల్లో అందులోను ఆంగ్లేయుల పాలనలో అంత త్వరలోనే పదవీ ఉన్నతిని పొందడం చాలా అరుదు. పూనేలో ఉన్నప్పుడే గోఖలే, తిలక్, రనడే వంటి మహనీయుల సాహచర్యం విశ్వేశ్వరయ్య గారికి లభించింది. గాంధీజీ, నెహ్రూల కంటే వయస్సులో పెద్ద విశ్వేశ్వరయ్య.

ఆంగ్ల పాలకులు విశ్వేశ్వరయ్య గారి కార్యదక్షతను గుర్తించి ప్రపంచ జలాశయాలలో ఒకటిగా గొప్పదైన సుక్కూర్ బరాజ్ (సింధురాష్ట్రం) నిర్మాణానికి ప్రత్యేక ఇంజనీర్‌గా నియమించారు. బ్రహ్మాండమైన ఈ జలాశయ నిర్మాణం నాలుగేళ్ళలో పూర్తి అయింది.

1901లో భారత ప్రభుత్వ ప్రతినిధిగా విశ్వేశ్వరయ్యగారు జపాన్ దేశం వెళ్లి అక్కడ కుటీర పరిశ్రమల తీరుతెన్నుల ను అవలోకించారు. ఆ పద్ధతిలో కుటీర పరిశ్రమల అభివృద్ధికి బృహత్ పథకాన్ని సిద్ధపరచి ప్రభుత్వానికి అందించారు. జపాన్ పర్యటనానంతరం, విశ్వేశ్వరయ్య గారు పూనా నగర నీటి సరఫరా పథకాన్ని రూపొందించారు.




ఈ నిర్మాణ కాలంలోనే ఆటోమేటిక్ స్లూన్‌గేట్ రూపొందించారు. ఈ స్లూన్‌గేట్ నిర్మాణం ప్రపంచ ఇంజనీర్ల మన్ననలందుకున్నది. ఈ కొత్త పరిశోధనను తన పేరు మీద పేటెంట్ చేసుకోవటం సముచితం కాదన్నాడు. లార్డ్ కిచనర్ స్లూన్‌గేట్ నిర్మాణంలో విశ్వేశ్వరయ్య ప్రతిభను కొనియాడాడు.

1906లో ఏడెన్ నగరం నీటి సరఫరా ప్రణాళికను రూపొందించారు. ప్రభుత్వం విశ్వేశ్వరయ్య గారిని సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా నియమించింది. అప్పుడే కొల్హాపూర్, ధార్వాడ, బిజాపూర్ మొదలగు పట్టణాలలో మంచినీటి పథకాలను సిద్ధపరచారు. బొంబాయి రాష్ట్ర ప్రభుత్వోద్యోగాన్ని స్వయంగా వదులు కున్నారు. రెండు సంస్థానాల నుండి ఛీఫ్ ఇంజనీర్ పదవులు చేపట్టమని ఆహ్వానాలు వచ్చాయి. అన్నిటిని తిరస్కరించి ఇటలీ, రష్యా, ఫ్రాన్స్, జర్మనీ మొదలగు దేశాలలోని బృహనిర్మాణాలను పరిశీలించి, ఆయా దేశ శాస్త్రవేత్తలతో సంప్రదింపులు జరిపి 1909లో స్వదేశం వచ్చారు.

ఇటలీ పర్యటనలో ఉన్నపుడే హైదరాబాద్ నగర రక్షణా పథకం నిర్మించటానికి స్పెషల్ ఛీఫ్ ఇంజనీర్‌గా ఆహ్వానించారు నిజాం. విశ్వేశ్వరయ్యగారి నేతృత్వంలో సాగినవే హుసేన్‌సాగర్, హైదరాబాదు నగర విస్తృత పథకాలు.

స్వరాష్ట్రమైన మైసూరు సంస్థానాన్ని ఆదర్శ సంస్థానంగా తీర్చి దిద్దిన వారు ఆయన. చీఫ్ ఇంజనీర్‌గా, ఆ తర్వాత దివాన్‌గా పనిచేసిన ఆరేళ్ళలో అరువదేళ్ళ అభివృద్ధిని సాధించారు. హెబ్బాళ్ వ్యవసాయ కళాశాల, మైసూరు విశ్వవిద్యానిలయం, ఛేంబర్ ఆఫ్ కామర్స్, సోప్ ఫ్యాక్టరీ కన్నడ సాహిత్య పరిషత్ మున్నగు వాటిని నెలకొల్పారు.

విశ్వేశ్వరయ్య గారి ప్రజ్ఞా ప్రతిఫలంగా నిర్మింపబడినదే కృష్ణరాజసాగర్, లక్షలాది ఎకరాల మెట్ట భూములు సస్యశ్యామలంగా మారాయి. బృందావన్ ఉద్యానవనం వారి ప్రకృతి ప్రేమకు నిదర్శనం. భారతదేశ సంస్థానాలలో మొదటి ఉక్కు కర్మాగారం నెలకొల్పినది మైసూరు.

మైసూరు మహారాజు గారితో అభిప్రాయభేదం రాగా, రాజీనామా చేసి బొంబాయి వెళ్ళిపోయారు. విదేశీ ఇంజనీర్ల ఆధ్వర్యంలో ప్రారంభింపబడిన భద్రావతి కర్మాగార నిర్మాణ కార్యక్రమం దెబ్బతింది. మహారాజు గత్యంతరం లేక బొంబాయిలోని విశ్వేశ్వరయ్య గారిని ఆహ్వానిస్తూ 'ఈ కర్మాగార పథకం మీదే, అది ఇప్పుడు రోగగ్రస్తమైంది. మీరు ప్రారంభించిన ప్రజాప్రతినిధి సభసభ్యులు దీనిని తెల్ల ఏనుగు అంటూ ఎగతాళి చేస్తున్నారు. మీరు వచ్చి దీనిని పునరుద్ధరించాలి' అని వ్రాశారు.

కర్మాగార పర్యవేక్షణ, వ్యయం మున్నగు వాటిపై అన్ని అధికారాలు విశ్వేశ్వరయ్య గారు చేపట్టారు. కార్మికులకు కొద్దిగా కూలీ పెంచారు. అవినీతిపరులైన విదేశీ ఇంజనీర్లను తొలంగించారు. రేయింబవళ్ళు కార్మికులను ప్రోత్సహిస్తూ, నష్టాల ఊబిలో నుండి లేవనెత్తి రెండేళ్లలో లాభాలు చూపించారు. పెద్ద కర్మాగారాల్లో సుశిక్షుతులైన భారతీయులనే నియమించాలని, అందుకు శిక్షణావకాశాలు పెంచాలన్నారు. భద్రావతి కర్మాగారం పర్యవేక్షకులుగా మహారాజుగారి నుండి లభించిన లక్షా యాభైవేల రూపాయలను తిప్పి పంపుతూ, ఆ పైకంతో పారిశ్రామిక శిక్షణ సంస్థను నెలకొల్పమని రాజుగారిని కోరారు విశ్వేశ్వరయ్య. ఆ సంస్థకు తన పేరు పెట్టటానికి సమ్మతించలేదు. ఆ విధంగా వెలిసిందే జయచామరాజేంద్ర ఆక్యుపేషనల్ ఇన్‌స్టిట్యూట్.

విశ్వేశ్వరయ్యగారు 1921లో భారత ఉత్పత్తిదారుల సమాఖ్యను నెలకొల్పి జీవితాంతం ఆ సమాఖ్య అధ్యక్షులుగా పనిచేశారు. 1922లో అఖిలపక్ష రాజకీయ సమ్మేళనానికి, 1923లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించారు.

స్వదేశీ సంస్థాన ప్రజలు బ్రిటీష్ ఇండియాలోని ప్రజలకంటే ఎక్కువ బాధలు పడుతున్నారని గ్రహించి వారి స్వేచ్ఛకోసం గొప్ప కృషి చేశారు. విశ్వేశ్వరయ్య మైసూరు సంస్థానంలో ప్రజాప్రతినిధి సభను ప్రారంభించారు.

కర్తవ్య నిర్వహణలో, నిజాయితీలో అటువంటి వారు అరుదు. దివాన్ పదవి స్వీకరించే ముందు బంధుమిత్రులను ఆహ్వానించారు. "నేను దివాన్ పదవిలో వుండగా, ఎటువంటి ఉద్యోగాలు కోరమనీ,

సిఫార్సులు చేయమనీ వాగ్దానం చేయమన్నారు. "తన బంధువులను ప్రభుత్వోద్యోగాల నుండి తప్పించి, ఇతర వృత్తులను చేపట్టటానికి సొంత పైకం యిచ్చారు.

మైసూరు సంస్థానంలో మోటర్‌కార్ల నిర్మాణం ప్రారంభించాల నుకున్నారు. బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం తిరస్కరించింది. రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. ఇండియాలో విమాన నిర్మాణం అత్యవసరమైంది. విశ్వేశ్వరయ్య గారి సలహా మేరకు బెంగుళూరులో భారత ప్రభుత్వం విమాన కార్ఖానా నెలకొల్పింది. విశాఖ పట్నంలోని నౌకా నిర్మాణ పథకాన్ని రూపొందించి వాల్‌చంద్ హీరాచంద్ గారిచే ప్రారంభింపచేసిన వారాయనే.

గాంధీజీ -విశ్వేశ్వరయ్య గార్లు దేశాభివృద్ధి సాధనలో భిన్న దృక్పథాలు కలవారు. గాంధీజీ గ్రామీణ పరిశ్రమలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. విశ్వేశ్వరయ్యగారు భారీ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చి, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

''నా అభిప్రాయాలు ఎలా ఉన్నా, మీ సహకారం లభించే అదృష్టానికి నోచుకున్నందుకు సంతోషిస్తున్నాను. నా అభిప్రాయాలను వ్యతిరేకించినా, మీ దేశ భక్తి, శక్తిసామర్థ్యాల పట్ల నాకున్న గౌరవం ఏ నాటికి తరగదు'' అన్నారు గాంధీజీ.

"మీరేమైనా చెప్పండి. భారత గ్రామీణుల గురించి నాకు మీ కంటే ఎక్కువగా తెలుసు" అని గాంధీజీ అన్నప్పుడు, "నేను మీ కంటే పదేళ్ళు పెద్దవాడినన్న విషయం గమనించ మనవి. దేశ ఆర్థిక ప్రగతి విషయంలో మీ కంటే ఎక్కువ అవగాహన నాకుంది" అంటూ బదులు వ్రాశారు విశ్వేశ్వరయ్యగారు, గాంధీజీకి వ్రాసిన జాబులో.

భారతదేశంలోని పెద్ద జలాశయాలు, ఆనకట్టలు నిర్మించటంలో వారి సలహాలను ప్రభుత్వం గొప్పగా భావించేది.

తొంభైయేళ్ళ వయసులో ప్రధాని నెహ్రూ ఆహ్వానాన్ని మన్నించి పాట్నా వద్ద గంగా నదిపై వంతెన నిర్మాణ పథకాన్ని కొందరు ఇంజనీర్ల బృందంతో రూపొందించారు. తుంగభద్ర ప్రాజెక్టు పథక శిల్పివారే

విశ్వేశ్వరయ్య నిజాయితీకి సాకారం. ఒకమారు విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. కొంత పైకం కావాల్సి వచ్చింది. మైసూరు బ్యాంక్ మేనేజర్ బి.ఏ నారాయణ రెడ్డి గారికి ముందుగా ఫోన్ చేసి, బ్యాంక్‌కు వెళ్ళారు. మేనేజర్ వారినెంతో గౌరవంగా లోపలికి తీసుకెళ్లారు. అన్నీ సిద్ధమైనాయి. విశ్వేశ్వరయ్య తన వద్ద ఉన్న భారత ప్రభుత్వ రుణ పత్రాలను ఇచ్చి తాకట్టు పెట్టకోమన్నారు.

మేనేజర్ ఆశ్చర్యంతో "తాము తాకట్టు పెట్టడమా! ఇది మీరు నెల కొల్పిన బ్యాంక్" అంటూ తిప్పి ఇవ్వగా, విశ్వేశ్వరయ్య తీసుకోలేదు. బ్యాంకు వారు తక్కువ వడ్డీ సూచించగా- అందరికీ విధించే వడ్డీ వేయమన్నారు.

"ఎక్కువ వడ్డీ వేయమని కోరిన వారు విశ్వేశ్వరయ్య గారొక్కరే" అన్నారు బ్యాంక్ మేనేజర్.

విశ్వేశ్వరయ్య వ్యక్తిగత జీవితం అతి క్రమశిక్షణలో వుండేది. రెండు సార్లు భార్యావియోగం కల్గింది. మూడోమారు పెళ్ళాడిన భార్య వ్యవహారం నచ్చక ఆమెకు విడాకులిచ్చారు. కాల నియమాన్ని, ఆహార నియమాలను కచ్చితంగా పాటించిన విశ్వేశ్వరయ్య 100 సంవత్సరాలు కళ్ళద్దాలు లేకుండా చదివేవారు.

''గంధపు చెక్కవలె సేవలో అరిగిపో, కాని ఇనుములా తుప్పు పట్టవద్దు'' అన్నది వారి జీవనధ్యేయం. దేశ విదేశాలలోని విశ్వవిద్యాల యాలు వారిని సత్కరించాయి. 1961 లో విశ్వేశ్వరయ్య గారి శతజయంతి ఉత్సవాలకు భారత ప్రధాని నెహ్రూ విచ్చేశారు.




"మేము మాటలతో కాల యాపన చేశాం. మీరు నిరంతర క్రియాశూరులై నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయులు' అంటూ నివాళు లర్పించారు నెహ్రూ.

భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్య గారిని 'భారతరత్న' బిరుదుతో సత్కరించింది. విశ్వేశ్వరయ్య ప్లాన్‌డే ఎకానమి ఆఫ్ ఇండియా రీకన్‌స్ట్రక్టింగ్ ఇండియా, మెమరీస్ ఆఫ్ వర్కింగ్ లైఫ్ (ఆత్మకథ) రచించారు.

జీవితాంతం దేశ ప్రగతికి, ప్రజా శ్రేయస్సుకు కృషి చేసిన విశ్వేశ్వరయ్య గారు డిసెంబర్ 4, 1962న దివంగతులయ్యారు.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*



# నీరు, భూమి, చెట్ల చట్టంతో ఎన్నో ప్రయోజనాలు

**మనకు ప్రకృతి ప్రసాదించిన అద్వితీయమైన వరాలు నీరు, భూమి, చెట్లు. మన భావితరాల మనుగడకు అవసరమైన వీటిని ప్రత్యేక చర్యల ద్వారా కాపాడుకొనే క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీరు, భూమి చెట్ల చట్టం 2002 ను రూపొందించింది. ఈ చట్టం 19-4-2002 నుండి రాష్ట్రం నందు అమలులో వుంది. భూ సంరక్షణ, పచ్చదనం మొదలైన కార్యక్రమాల పర్యవసానముగా ఈ చట్టం అత్యంత ప్రాచుర్యంలోనికి వచ్చింది. ఈ చట్టం నిర్వహణకు వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.**

## ముఖ్యాంశాలు

- ప్రతి బావి యజమాని విధిగా ఫారం-1 నమూనాలో గ్రామ కార్యదర్శుల వద్ద నమోదు చేయించుకోవాలి. నమోదు కాని బావి యజమాని పై చట్ట రీత్యా చర్యలు.
- భూ గర్భజలాలు తగ్గిపాయే విధంగా వున్న ప్రాంతాలలో (Over exploited areas) నీటిని తోడటం నిషేధం.
- క్రొత్తగా బావిని /బోరు త్రవ్వాలంటే, తహశీల్దారు అనుమతి పొందాలి.
- బావులను త్రవ్వి నీటిని వెలికి తీయటం అవాంచనీయమైన పోటీని నివారించే నిమిత్తం బావుల మధ్య వుండవలసిన దూరం, లోతు నిర్ణయం.



- భూగర్భ నీటి వనరులను సంరక్షించి అభివృద్ధి చేసే చర్యలలో భాగంగా వర్షపు నీటిని వృథా కాకుండా నిలువ చేయటానికి చర్యలు.
- పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, స్థానిక సంస్థలు ఉపయోగించి వదిలి వేసిన వ్యర్థ జలాల శుద్ధి చేసి తిరిగి వాపయోగించుటకు (Re-cycling, re use) సూచనలు.
- నీటి కాల్యుష నివారణ
- రిగ్గుల రిజిస్ట్రేషను - ప్రతి రిగ్గు యజమాని తమ మిషనరీని నిర్ణయించిన రుసుము (రూ.1000)ను చెల్లించి ఖచ్చితంగా రిజిష్టరు చేయించుకోవాలి. చట్టం నుల్లంఘించిన వారు శిక్షార్హులు.
- *ఇసుక త్రవ్వకం:* ఇసుక త్రవ్వకం వలన భూగర్భ జల ప్రక్రియకు అవరోధం కలుగుతుందని ప్రకటించిన ప్రాంతాలలో ఇసుక త్రవ్వకం, రవాణా నిషేధింపబడింది. సాగు నీరు లేదా త్రాగు నీరుకు సంబంధించి ఏదైనా భూగర్భ జలాలను బయటకు తీసే నిర్మాణాలకు 500 మీటర్ల లోపల, ప్రవాహాలలో ఇసుక మేట మందం 2 మీ. కంటే తక్కువ వున్న చోట ఇసుక త్రవ్వరాదు.
- త్రాగు నీటి సంరక్షణ
- పచ్చదనం కోసం వృక్షాలు నాటటం, సంరక్షణ.

### ఎపి వాల్టా చట్టం 2002 - సంప్రదించ వలసిన నియుక్త అధికారులు

1. బావుల నమోదు : గ్రామ కార్యదర్శి
2. కొత్త బావులకు అనుమతి : తహశీల్దారు (వ్యవసాయ/త్రాగు నీటి బావి) డిప్యూటీ డైరెక్టరు భూగర్భ జల శాఖ (పరిశ్రమల నిమిత్తం)
3. రిగ్గుల రిజిస్ట్రేషన్ : డిప్యూటీ డైరెక్టరు, భూగర్భ జల శాఖ
4. చెట్లను పడగొట్టడానికి అనుమతి :
   - మండల పరిధిల - ఫారెస్టు రేంజ్ ఆఫీసర్
   - జిల్లా పరిధిలో - డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్
   - రాష్ట్ర పరిధిలో - చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు

### ఎపి వాల్టా చట్టం 2002 - సంబంధిత రుసుములు (ఫీజులు)

రుసుములను (ఫీజులు) డి.డి. రూపేణా ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, చెట్లు అధికార వర్గం నిధి (ఎ.పి. వాల్టా అథారిటీ ఫండ్) కు చెల్లించాలి.

బావుల నమోదు : రూ. 10

కొత్త బావులకు అనుమతి : రూ. 100

రిగ్గుల రిజిస్ట్రేషన్ : రూ. 1000

చెట్లను పడగొట్టడానికి అనుమతి : రూ. 50 (పట్టణ, సంస్థాగత ప్రాంతాలకు)
: రూ.100 (పట్టణ వాణిజ్య ప్రాంతాలకు)

## కొత్త బావులకు అనుమతించే విధానం

ఎవరైనా ఒక వ్యక్తిగాని, సంస్థ గానీ తమ స్థలాలందు క్రొత్తగా ఏ విధమైన బావిని / బోరు తవ్వాలన్న (అనగా బోరు బావి, బోరింగు లేక క్రొత్తగా తవ్వబడు బావి లేదా ఉన్న బావిని లోతు చేయుట) క్రింది విషయాలను పాటించాలి.

- క్రొత్తగా ఏవిధమైన బావిని / బోరు తవ్వాలంటే ఫారం - 2 లో అర్జీ రాసి గ్రామ కార్యదర్శికి ఇవ్వాలి. వారు తహశీల్దారుకు రెండు రోజులలో పంపాలి.
- తహశీల్దారు అర్జీ అందిన 15 దినాలలో అనుమతి ఇవ్వాలి. ఏక గవాక్ష (సింగిల్ విండో) పద్ధతిలో అర్జీలు పరిష్కరించాలి.

## ప్రజాహిత త్రాగునీటి సంరక్షణ

- ప్రజలకు తగినంతగా త్రాగు నీటిని సరఫరా చేయటం భాగంగా పబ్లిక్ నీటి వనరులున్న ప్రదేశం నుండి 250 మీటర్ల పరిధి లోపల బోరులు త్రవ్వరాదు.
- బహుళ అంతస్తుల భవనాల ప్రాంగణం నుండి నీటిని వెలికి తీసి ఇతర ప్రాంతాల వారికి విక్రయించటం నిషేధం.
- పారిశ్రామిక స్థానిక సంస్థలు, ఆక్వా పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు త్రాగు నీటి వనరులలో పంపటం నిషేధం.

## చెట్ల సంరక్షణ

ప్రతి మునిసిపల్ కార్పోరేషను లేదా మునిసిపాలిటీ (పురపాలక సంస్థ) లేదా ఇతర స్థానిక సంస్థలలోని నివాస ప్రాంతాలలో నాట వలసిన చెట్లు, నిర్వహణ క్రింది విధంగా వుండాలి.

| | |
|---|---|
| 100 చ.మీ. కంటే తక్కువ విస్తీర్ణంలో | 3 చెట్లు |
| 101 నుండి 200 చ.మీ విస్తీర్ణంలో | 5 చెట్లు |
| 201 నుండి 300 చ.మీ విస్తీర్ణంలో | 10 చెట్లు |
| 301 చ.మీ. పై బడిన విస్తీర్ణంలో | 10 చెట్లు |





ప్రతి 100 చ.మీ. పెరుగుదల విస్తీర్ణానికి 5 చెట్ల చొప్పున

నియుక్త అధికారి పూర్వానుమతి లేకుండా చెట్లను పడగొట్టరాదు. ఎవరైనా యజమాని చెట్లను పడగొట్టాలన్నా (నమూనా) ఫారం - 13 నందు వివరాలు వ్రాసి దిగువ తెలిపిన రుసుంతో నియుక్తుడైన అధికారికి అనుమతి కోసం దరఖాస్తు చేయాలి. నియుక్త అధికారి అనగా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (మండల పరిధిలో), డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ (జిల్లా పరిధిలో), చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (రాష్ట్ర పరిధిలో).

- నియుక్త అధికారి లేదా తనచే అధికారాన్ని పొందిన అధికారి సదరు దరఖాస్తు (ఫారం-13)పై తనిఖీ, విచారణ జరిపి అనుమతి లేదా నిరాకరణ ఫారం - 14 నందు ఇవ్వబడును.
- అనుమతి లేనిదే పడిపోయిన / పడగొట్టబడిన చెట్లు సామాగ్రిని రవాణా చేయరాదు.
- నియుక్త అధికారి దరఖాస్తు అందిన 15 రోజుల లోపల పరిష్కరించాలి.
- చెట్టును పడగొట్టవలెనన్న 30 దినాల లోపల రెండు చెట్లను అదే స్థలంలో గాని లేదా అనువైన ప్రాంతంలో గాని నాటాలి.
- అనుమతి లేకుండా చెట్లను పడగొట్టినట్లయితే ఆ చెట్టు విలువకు రెండు రెట్ల నుండి ఐదు రెట్ల వరకు ఫైన్ విధిస్తారు.

## జరిమానాలు (పెనాల్టీలు)

- చట్టాన్ని అతిక్రమించిన యెడల రూ. 1000/-లకు తగ్గకుండా రూ. 5000/- లకు మించకుండా జరిమానాను విధించవచ్చును.
- పబ్లిక్ నీటి వనరులను పాడు చేసినా, ఆక్రమించినా భూగర్భ నీటిని పాడుచేసినా ఆ వ్యక్తులను ఒక నెల నుండి 6 నెలల వరకు జైలు శిక్షతో లేక రూ. 2000/- నుండి రూ. 50,000/- జరిమానాతో శిక్షిస్తారు లేక రెండు కలిపి కూడా శిక్షింపవచ్చును.
- రెండవ సారి, తిరిగి నేరాలు చేస్తే రెండు రెట్ల జరిమానాతో శిక్షిస్తారు.

*- టి. పద్మావతి, జూనియర్ ఫ్యాకల్టి, ల్యాండ్ సెల్*

# సౌరశక్తితో విద్యుత్తు ఉత్పాదనే లక్ష్యంగా పనిచేస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సౌర మిషన్

ఒక దేశ అభివృద్ధిని నిర్ణయించే అంశాలలో దేశంలో వినియోగిస్తున్న విద్యుత్తు ఒక ముఖ్య అంశం. ప్రజల జీవన ప్రమాణాల నాణ్యతను కొలవటానికి కూడా తలసరి విద్యుత్తు అందుబాటును ఒక కొలమానంగా పరిగణిస్తున్నారు. దేశ ఆర్థిక రంగం ప్రగతి కూడా విద్యుత్తు వినియోగం మీదనే ఆధారపడుతుంది. గణాంకాల ప్రకారం చూస్తే, ప్రపంచంలో అత్యధికంగా విద్యుచ్ఛక్తి వినియోగించుకొంటున్న ఆరో దేశం మనదేశం.

దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి జరగకపోవటం వల్ల డిమాండుకు సరిపడా విద్యుత్తు సరఫరా చేయలేని పరిస్థితిలో నేడు మనదేశం పలు సమస్యలను ఎదుర్కొంటోంది. దేశంలో మూడు దశాబ్దాలుగా ఏటా 3.6 శాతం చొప్పున విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. పట్టణ ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా ఎంతో కొంత నయమనిపించినా గ్రామీణ ప్రాంతాలలో రోజులో మూడవవంతు మాత్రమే విద్యుత్తు సరఫరా అవుతున్న విషయం నేడు మనం చూస్తున్నాం. వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తును కనీసం 9 గంటలు అయినా నిరంతరాయంగా సరఫరా చేయటానికి ప్రభుత్వాలు కృషిచేస్తున్నప్పటికీ ఈ లక్ష్యం సాధించటం కష్టమవుతోంది. స్వాతంత్ర్యం వచ్చి 6 దశాబ్దాలు గడిచినా చాలా గ్రామాలు విద్యుదీకరణకు నోచుకోక నేటికీ కారుచీకటిలోనే మగ్గుతున్నాయి.

## విద్యుత్తు ఉత్పాదనలో మనదేశ ప్రస్తుత స్థితి

దేశంలో వినియోగమవుతున్న విద్యుత్తులో 76 శాతం ధర్మల్ విద్యుత్తు, 21 శాతం జలవిద్యుత్తు, 4శాతం అణువిద్యుత్తు ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్తులో సౌరవిద్యుత్తు వాటా కేవలం 0.4 శాతం మాత్రమే 2010 మార్చి నాటికి దేశంలో స్థాపిత విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం లక్షా నలభై ఏడువేల మెగావాట్లు. 2008-09 విద్యుత్తు సరఫరాతో పోలిస్తే విద్యుత్తు అవసరాలు 9.5 శాతం మించిపోయాయి. విద్యుత్తు వినియోగం అధికంగా ఉండే సమయంలో ఐతే ఈ లోటు 13.8 శాతానికి పైబడి ఉంటోంది. ఈ లోటును భర్తీచేసుకోవటానికి 2012 నాటికి అంటే 11వ పంచవర్ష ప్రణాళికా కాలం పూర్తయ్యే నాటికి అదనంగా 78,700 మెగావాట్ల స్థాపిత విద్యుత్తు ఉత్పాదన సామర్ధ్యం సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దేశంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా, భవిష్యత్తులో చైనా తరువాత విద్యుత్తు వినియోగంలో భారతదేశం తలసరి విద్యుత్తు వినియోగంలో ముందుంటుందని అంతర్జాతీయ విద్యుత్తు రంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

## విద్యుత్తు లోటును భర్తీ చేయటం ఎలా ?

విద్యుత్తు ఉత్పత్తికి, వినియోగానికి మధ్య అంతరం పెరిగిపోవటం, సాంప్రదాయ ఇంధనవనరులైన బొగ్గు, జలవిద్యుత్తు లభ్యత భవిష్యత్తులో ప్రశ్నార్ధకం కావటం వంటి అంశాలు ప్రధానంగా సౌరశక్తి/ పవనశక్తి/ బయోమాస్ వంటి సాంప్రదాయేతర/ పునరుత్పాదక వనరుల ఉత్పత్తి, వినియోగంవైపు దృష్టి సారించేలా చేసాయి. అంతేకాకుండా ఇంధన అవసరాలకోసం మనదేశంలో ప్రధానంగా ధర్మల్ విద్యుత్తుపై ఆధారపడటం వల్ల విద్యుత్తు ఉత్పాదనలో వెలువడే కర్బన ఉద్గారాలు కూడా అధికంగానే వాతావరణంలోకి విడుదల అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం, గ్లోబల్ వార్మింగును సమర్ధవంతంగా ఎదుర్కొనటంకోసం సోలార్ విద్యుత్తు, పవన విద్యుత్తు వంటి పర్యావరణ అనుకూల విధానాల ద్వారా విద్యుత్ ఉత్పాదన చేపట్టాలని అభివృద్ధి చెందిన దేశాలు మనమీద చేస్తున్న ఒత్తిడి, ఐక్యరాజ్యసమితి సభ్యదేశంగా సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత కూడా మనదేశం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం వైపు దృష్టి సారించేలా చేశాయి.

## జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సౌర మిషన్

దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని దేశంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని





పెంపొందించటానికి గాను 2009 సంవత్సరం నవంబరులో భారతప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సౌర మిషనును ప్రారంభించింది. అంతేగాకుండా వాతావరణ మార్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకుగాను అనుసరిస్తున్న వ్యూహంలో భాగంగా దేశంలో ఏర్పాటుచేస్తున్న 8 కీలక మిషన్లలో సోలార్ మిషను ఒకటి. సాధ్యమైనంత తక్కువ సమయంలో దేశంలో నలుమూలలా సౌరశక్తి వినియోగాన్ని పెంచటానికి అవసరమయిన విధాన నిర్ణయాలను, అనుకూల పరిస్థితులను కల్పించటం ద్వారా సౌరశక్తిరంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో ఈ జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సౌర మిషను పనిచేస్తోంది. 2013 సం. నాటికి దేశంలో అదనంగా 1100 మెగావాట్ల గ్రిడ్ సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని, 2022 నాటికి 20000 మెగావాట్ల గ్రిడ్ సోలార్ విద్యుత్ ఉత్పాదన చేయాలనే లక్ష్యంతో ఈ మిషను పనిచేస్తోంది.

### జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సోలార్ మిషను లక్ష్యాలు

| ఉత్పత్తి రంగం | ఫేజ్ 1 (2010-13) | ఫేజ్ 2 (2013-17) | ఫేజ్ 3 (2017-22) |
|---|---|---|---|
| సోలార్ కలెక్టర్లు | 7 మిలియన్ చ.మీ | 15మిలియన్ చ.మీ | 20 మిలియన్ చ.మీ |
| ఆఫ్ గ్రిడ్ సౌరఇంధన వినియోగం | 200 మె.వా | 1000మె.వా | 2000 మె.వా |
| గ్రిడ్ సౌరశక్తి ఉత్పాదన, ఇంటి పైకప్పు కూడా కల్పుకొని | 1000-2000 మె.వా | 4000-10000 మె.వా | 20000 మె.వా |

### సౌర మిషను ముఖ్యంగా ఈ క్రింది అంశాల సాధనకు ప్రాధాన్యత ఇస్తోంది

◌ విస్తారంగా లభించే సౌరశక్తిని వినియోగించుకొని ఇంధన భద్రత, కార్బన్ ఉద్గారం తగ్గింపు సాధించటం

◌ గ్రిడ్‌కు అనుసంధానింపబడని విద్యుత్ ఉత్పాదక కేంద్రాలద్వారా గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్తు సౌకర్యం కలుగచేయటం.

◌ ఉష్ణ/శీతల సంబంధిత అవసరాలకు గాను పరిశ్రమలు, వ్యాపార, గృహ సంబంధ, రంగాలలో సోలార్ థర్మల్ ఉపకరణాలను అధికంగా వినియోగంలోకి తీసుకొని రావటానికి ప్రయత్నించటం.

◌ అంతర్జాతీయ మార్కెట్లుకు ధీటుగా భారత సౌరవిద్యుత్తు రంగాన్ని అభివృద్ధి చేయటం. ప్రపంచ స్థాయి పరిమాణాలకు అనుగుణంగా సౌరశక్తి సంబంధ పరికరాలను భారతదేశంలో ఉత్పత్తి చేసేందుకు పరిశోధన, అభివృద్ధి రంగాలలో కృషి చేయటానికి బృహత్తర ప్రణాళిక అమలు చేయటం.

### సౌరశక్తి ఉత్పాదనకు అనుకూల అంశాలు

నైసర్గిక స్వరూపం, శీతోష్ణస్థితి, భిన్న సంస్కృతులలాంటి లక్షణాలతో ప్రపంచదేశాలలో భారతదేశం ఒక ఉపఖండంగా పరిగణించబడుతోంది. సగటున సంవత్సరంలో 300 రోజులు సూర్యరశ్మి అందుబాటులో ఉండటం అన్నది దేశంలో సౌరవిద్యుత్తు ఉత్పాదనకు భారతదేశానికి కలిసి వచ్చే అంశం.

పచ్చని పంటపొలాలను ప్రత్యేక ఆర్థికమండళ్ళు/ పారిశ్రామిక కూడళ్ళుగా మార్చుతున్న సందర్భంలో పరిశ్రమల కోసం భూసేకరణ వంటి పలు అంశాలలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఐతే సౌర విద్యుత్తు ఉత్పాదనకు విడనిరుపయోగంగాఉన్న బీడు భూములను సైతం పరిశ్రమలకు కేటాయించవచ్చు. దీనివల్ల నిరుపయోగంగా ఉన్న బీడు భూములను సైతం పరిశ్రమలకు కేటాయించవచ్చు. దీనివల్ల నిరుపయోగంగా పడివున్న భూమి వినియోగంలోకి వచ్చినట్లవుతుంది.

◌ ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో సోలార్ విద్యుత్తు ఉత్పాదన ప్లాంట్ల నిర్మాణానికి భూములను ప్రైవేటు సంస్థలకు తక్కువ వెలలో అందజేయటం, ఉత్పత్తయిన విద్యుత్తును కొనుగోలు చేయటానికి ఒప్పందాలు కుదుర్చుకోవటం వంటి ప్రోత్సాహకాలు అందచేయటానికి జాతీయ సోలార్ మిషన్ ముందుకు వస్తోంది.

◌ సౌర శక్తిని వినియోగించుకొని ప్రాంతీయంగా విద్యుత్తు అవసరాలు తీర్చుకోవచ్చు కాబట్టి ఆయా ప్రదేశాలు ఆర్థికంగా పరోగతి చెందటానికి అవకాశం ఉంటుంది.

◌ గ్రామీణ ప్రాంతాలలో కనీస సౌకర్యాల లేమివల్ల పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నాయన్నది తెలిసిన విషయమే. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించటం పట్టణాలలోని స్థానిక సంస్థలకు తలకు మించిన భారమే. గ్రామీణ ప్రాంతాలలోనే పట్టణ సౌకర్యాలను కల్పిస్తే వలసలను అరికట్టటమే కాక, ప్రజల జీవన ప్రమాణాలలో నాణ్యతను పెంచవచ్చు. 11వ పంచవర్ష ప్రణాళికా కాలాంతానికి సుమారు 70

లక్షల సోలార్ విద్యుత్తు బల్బులను అందచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతీ గృహానికి సౌర విద్యుత్తు పరికరాలను సబ్సిడీపై అందచేస్తే ఈ లక్ష్యాన్ని తేలికగా చేరుకోవచ్చు.

### సౌరశక్తి ఉత్పాదనలో ఎదురయ్యే సవాళ్ళు

భారతదేశ ఇంధన విధానంలో గమనించదగ్గ మార్పు ఈ జాతీయ సోలార్ మిషను ద్వారా వచ్చిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఐతే ఈ సోలార్ ఉద్దేశ్యాలు నెరవేరాలంటే విధాన నిర్ణయాలలో పలు సంస్కరణలతో పాటు, ప్రజలలో సరియైన అవగాహన కల్గించటం ఎంతో అవసరం.

ఐతే ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో సౌరశక్తి ఉత్పాదన అత్యంత ఖరీదయిన ప్రక్రియ. ప్రస్తుతం అంచనాల ప్రకారం 1 మెగావాటు సౌర విద్యుదుత్పాదనకి రూ 18 కోట్లు ఖర్చు అవుతుండగా, 1 మె.వా విద్యుత్తు పవన శక్తి ద్వారా ఉత్పత్తి చేయటానికి రూ 5 కోట్లు, థర్మల్ విద్యుత్తు ఉత్పాదనకు రూ 4 కోట్లు వ్యయమవుతుంది.

సౌరవిద్యుత్తు ఉత్పత్తికి మొదట్లో భారీగా వ్యయమయినప్పటికీ, దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా ఈ పెట్టుబడి లాభదాయకమే. సౌరవిద్యుత్తు ప్రణాళిక అమలుకు అవసరమయ్యే వేలాది కోట్ల రూపాయలు మనదేశం తనంతట తాను సమకూర్చుకొనే పరిస్థితి లేదు. కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలని ఒత్తిడి చేసే అభివృద్ధి చెందిన దేశాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, ఈ బృహత్తర లక్ష్యాలను సాధించటానికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గృహ సంబంధ విద్యుత్తు అవసరాలు తీర్చటానికి, ప్రతి నివాస గృహంలో సౌరవిద్యుత్తును వినియోగించేలా ప్రోత్సహించటం అన్నది కష్టంతో కూడుకొన్న పని. అంతేకాకుండా అందుకు తగినట్టుగా సౌరవిద్యుత్తు ఉపకరణాల తయారీ కూడా పెద్ద ఎత్తున మనదేశంలో చేపట్టవలసి ఉంటుంది. విడి భాగాల ఉత్పాదనకు ముందుకు వచ్చే పరిశ్రమలకు ప్రభుత్వం సబ్సిడీలను అందచేయటం, ఇతరత్రా సాయం చేయటం తప్పనిసరి.

గ్రామస్థాయిలో ప్రజలలో అవగాహన తీసుకొనిరావాలంటే పంచాయతీరాజ్ సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి. ఐతే పంచాయతీ రాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధులు, ఈ సంస్థలతో పనిచేసే అధికారులలో సంప్రదాయేతర ఇంధనవనరుల వినియోగంపై అవగాహన తీసుకొని రావటం, వీరి సామర్థ్యాలు పెంచటం అన్నది ఒక సవాలు లాంటిదే కానీ సాధ్యంకానిది మాత్రంకాదు.

భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నట్లుగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో ఫోటోఓల్టాయిక్ సెల్సు 15% సామర్థ్యంతోనే పనిచేస్తున్నాయి. ఈ ఫోటో ఓల్టాయిక్ సెల్సు సామర్థ్యాన్ని ప్రస్తుత ఉత్పాదక వ్యయంలో మార్పులేకుండా 15 శాతం నుండి 50 శాతం వరకు పెంచగల్గితే దేశ ఇంధన అవసరాలు గణనీయంగా తీర్చుకోవచ్చు. ఐతే ఈ దిశలో ప్రయోగాలు జరపటానికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు

విస్తారంగా లభిస్తున్న సౌరశక్తినుండి విద్యుత్తును ఉత్పత్తిచేయటానికి గత 3 దశాబ్దాలుగా మనదేశంలో ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ఇవన్నీ పవర్ గ్రిడ్‌కు అనుసంధానం కాకుండా కేవలం లైటింగు, నీటిని వేడిచేసుకోవటం వంటి గృహ వినియోగాలకు మాత్రమే ఉపయోగపడే సౌరవిద్యుత్తును ఉత్పత్తిచేసే కోవలోకే వస్తాయి. ఐతే ఇటీవలి కాలంలో సరళీకరించిన కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పలు రాష్ట్రాలలో గ్రిడ్‌కు అనుసంధానింపబడిన సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తున్నాయి. సౌరవిద్యుత్ ఉత్పాదక పరిశ్రమలను ప్రోత్సహించటంలో గుజరాత్ రాష్ట్రం ముందుంది. సోలార్ విద్యుత్తును ఉత్పత్తిచేసే కంపెనీలకు గుజరాత్ రాష్ట్రంలో వలె 1 మెగావాటు విద్యుత్తు ఉత్పాదనకు 5 ఎకరాల భూమి చొప్పున తక్కువధరకు భూములను కేటాయించటానికి మన రాష్ట్రం కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదేవిధంగా అన్నిరాష్ట్రాలు ముందుచూపుతో ప్రయత్నాలు ప్రారంభిస్తే విద్యుత్తు లోటును కొంతైనా భర్తీ చేసుకోవచ్చు. కర్ణాటక రాష్ట్రంలో కోలార్ జిల్లాలోని యేలేసంద్ర గ్రామంలో 15 ఎకరాలలో సుమారు రూ 57 కోట్లతో కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటుచేసిన సౌర విద్యుత్తు ప్లాంటు దేశంలోకల్లా అత్యధిక ఉత్పాదక సామర్థ్యంగల్గిన గ్రిడ్ అనుసంధానిత సౌరవిద్యుత్తు ప్లాంటు. మూడు మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యం గల ఈ విద్యుత్తు ప్లాంటు ద్వారా రోజుకు 15000 యూనిట్‌లు ఉత్పత్తి అవుతోంది. ఇలా ఉత్పత్తయ్యే సౌర విద్యుత్తువల్ల చుట్టుప్రక్కల 20 గ్రామాలలోని 10 హెచ్.పి. సామర్థ్యం గల సుమారు 600 వ్యవసాయ బోరువెల్సుకు పగటి పూటనే 6 గంటల నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేయగల్గుతున్నారు.

గ్రిడ్‌కు అనుసంధానం కాని విద్యుత్తు ఉత్పాదనలో కూడా పలు గ్రామాలు, నగరాలు మార్గదర్శిగా ఉంటున్నాయి. ఉదాహరణకు, మనరాష్ట్రంలోని నల్గొండ జిల్లాలోని వగిడిపల్లిగ్రామంలో గ్రామపంచాయతీ చొరవతో భారత ప్రభుత్వ సాంప్రదాయేతర ఇంధనవనరుల శాఖ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సుమారు 60 సోలార్ వీధిపాలు, 350 పై చిలుకు సోలార్-ఎల్.ఇ.డి బల్బులను ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేసారు. ఈ ప్రయత్నం ద్వారా సాలీనా సుమారు 50000 యూనిట్ల విద్యుత్తును ఆదాచేయవచ్చని అంచనా. ఇలాగే ప్రతీ గ్రామపంచాయతీ ముందుకు వచ్చి అపారంగా అందుబాటులో ఉన్న సౌర శక్తిని వినియోగించుకొని స్థానిక విద్యుత్తు అవసరాలను తీర్చుకొనేందుకు ప్రణాళికలను రూపొందించుకొని, ప్రభుత్వ-ప్రైవేటు నిధులను సమీకరించుకొని పథకాలను అమలుచేస్తే విద్యుత్తు కొరతను అనతి కాలంలోనే అధిగమించవచ్చు.

*- డా. వి. శివశంకర ప్రసాద్,* జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డు



నెల తప్పిన రోజు నుండీ సరోజ చెయ్యని పూజల్లేవు. మొక్కని దేవుడు లేడు.

'అమ్మాయే పుడుతుంది అమ్మలాగే వుంటుంది' పాట సీడీ కొనుక్కుని అది అరిగిపోయే వరకు రాత్రీ పగలు నిద్రాహారాలు మాని వింది. అది పాడై పోగానే మరోటి కొందామనుకుందిగాని ఆ వూళ్ళో సీడీలు అమ్మే వెంకటేష్‌కి సరోజ మొగుడు రెండు వేలిచ్చి ఆ సీడీ ఇక రాదని చెప్పించాడు.

సరే మరింక లాభం లేదనుకుని మహా రచయిత్రుల పుస్తకాలన్నీ తెచ్చుకుని గది నిండా నాలుగువైపులా వాళ్ళ ఫొటోలు కనిపించేలా అమర్చుకుంది. మాదిరెడ్డి సులోచన, వాసిరెడ్డి సీతాదేవి, యద్దనపూడి సులోచనా రాణి, కోడూరి కౌసల్యా దేవి, ముప్పాళ రంగనాయకమ్మ. పుస్తకాల దుకాణంలో కూడా అంత బాగా అమర్చలేరేమో...

"డిసైడవటమేనా? అమ్మాయిపుట్టంగానే అలిపిరి నుండి ఏడుకొండ లెక్కి ఇద్దరం తలనీలాలు సమర్పించుకుంటామనీ మొక్కా..."

"ఎవరిద్దరూ? నువ్వూ, పిల్లానా?"

"ఉహు.. మనిద్దరం"

నెత్తిమీద మిగిలిన నాలుగు వెంట్రుకలను అపురూపంగా వేళ్ళతో దువ్వుకున్నాడు....

'ఇవి కూడా నాకు ప్రాప్తం లేవా?' అతని మనసు ఆక్రోశించింది.

"ఇదెక్కడి పిచ్చి, ఎవరైనా వారసుడు కావాలని మొక్కుతారుగాని...."

"వారసుడా గీరసుడా... అమ్మాయే పుట్టాల - అది రచయిత్రి అయ్యే తీరాల"

"రచయిత్రా? అదేంటీ?" అయోమయంగా చూశాడు. అప్పటికే అతనికి కాస్త తనకు మతి భ్రమణం మొదలయిందేమోనని అనుమానం వచ్చింది.

# రచయిత్రి కోరిక

స్వాతీ శ్రీపాద



ఎటు చూసినా రచయిత్రులు.... వాళ్ళ నవలలే...

"వామ్మో! ఎన్ని వేలు ఖర్చు పెట్టావు వీటికి... ఇవన్నీ నువ్వెప్పుడు చదవాలి... అసలు నీకివన్నీ అర్థం అవుతాయా?" గుండెలు బాదుకున్నాడు సరోజ మొగుడు. కిలకిల నవ్వింది సరోజ.

"అంతగా రెచ్చిపోకండి... ఇవన్నీ కొనలేదు. ఫలాన పుస్తకాల షాప్‌లో ఐదువేలకి అద్దెకి తెచ్చుకున్నా... ముందే చెప్పానులెండి. పుస్తకం ఏ మాత్రం నలక్కుండ వున్నదున్నట్టు తెచ్చిస్తానని..."

"చదవనికాడికి ఐదువేలు బుగ్గిలో పోసి ఈ అద్దె భాగోతమెందుకే" లబలబలాడాడు నెత్తిబాదుకుంటూ...

"అబ్బ వూరుకోండీ...ఇప్పటినించీ వీళ్ళందరినీ రోజూ చూస్తేనే కదా రేపు మన అమ్మాయి రచయిత్రి అయ్యేది" గారాలు పోయింది సరోజ.

"మనమ్మాయా? అదెవరు? ఎక్కడుంది?" అయోమయంగా చూశాడు.

"అయ్యో రామా, అది కూడా తెలీదా ? అదేనండీ మనకు పుట్టబోయే అమ్మాయి..." సిగ్గు పడుతున్నట్టు వంకర్లు తిరిగింది సరోజ.

"వామ్మో, అమ్మాయేనని డిసైడయిపోయావా?"

"మీకేం తెలుసు రచయిత్రుల గురించి? మా చిన్నప్పుడు చూశాం... సెక్రటరీ సీరియల్ కోసం నిద్రాహారాలు మాని ఎదురు చూసేవాళ్ళనూ... రాజశేఖర్ లాంటి మొగుడు కావాలని కలలుగనే వాళ్ళనూ... అప్పటినుండీ నాతో బాటూ పెరుగుతూ వచ్చిందీ కోరిక. అమ్మాయే పుట్టాలి. అది రచయిత్రే కావాలని...."

"ఇదెక్కడి వింత యవ్వారం అమ్మడూ? ఆల్లేదు చూల్లేదని ఎప్పుడో పుట్టే బిడ్డ ఆడపిల్ల కావాలనీ అదీ రచయిత్రి కావాలనీ, చిన్నప్పటి నుండీ కోరుకున్నావా? ఎవరైనా కూతురు డాక్టర్ కావాలనో, ఇంజనీర్ కావాలనో, అంతగా అయితే కలెక్టర్ కావాలనుకుంటారు గాని, ఇలా రచయిత్రి కావాలనుకునే వాళ్ళు ఈ భూమ్మీద ఎవరైనా ఉంటారా అని అనుమానం"

"నీకన్నీ ఇలాంటి అనుమానాలే, చెప్పలేక చస్తున్నా..."

"అసలు ఆ రచనలేవో నువ్వే చేస్తే సరిపోయేదిగా...."

"నాకంతమాత్రం తెలీదనుకోకండి అదీ ప్రయత్నించా... ఎన్ని కథలు

హాస్య కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

వ్రాసి పంపినా తిరిగి రావడంతో బెంగెట్టుకుని మంచం పట్టిన మా అమ్మ నా మీద ఒట్టేసుకుంది మళ్ళీ కంఠంలో ప్రాణముండగా నన్ను కలం పట్టనివ్వనని... అది సరేలెండి... పుట్టకముందునించే పిల్లల అభిరుచులేర్పడతాయటగా... అందుకే అనుక్షణం ఈ రచయిత్రుల పుస్తకాలు చూస్తూ వారి కథలు సీరియళ్ళుగా చూస్తూ ఈ తొమ్మిది నేలలూ గడిపితే పుట్టిన బిడ్డ తప్పకుండా రచయిత్రే అవుతుంది...." పరవశిస్తూ చెప్పింది సరోజ.

"నా నెత్తీ, నా బొంద" నెత్తీ నోరూ బాదుకున్నాడు సరోజ మొగుడు.

మనలో మనమాట రచయిత్రి కాబోయి తప్పిపోయిన సరోజకు ఎవరు మొగుడ్ని పేరెట్టి పిలిచినా నచ్చదు, సరోజ మొగుడనడమే ఆవిడకిష్టం.

ఆరో నెల్లో సీమంతం అనే సరికి మరో విపరీతపుటాలోచన రానే వచ్చింది సరోజకు. వెరైటీగా రచయిత్రులందరినీ పిలిచి సీమంతం జరుపుకోవాలని... ఖర్చు విషయంలో మొగుడు గింజుకున్నా వినిపించుకోలేదు. దూరాన వున్న వారికి రానూ పోనూ ఛార్జీలివ్వడమే గాకుండా, వసతి సౌకర్యం కోసం మంచి లాడ్జింగ్‌లో రూమ్స్ బుక్ చేసి మరీ పిలిపించుకుంది. అందర్నీ అడిగి మరీ రచయిత్రి ప్రాప్తిరస్తు అని దీవించేలా చూసుకుంది.

క్షణమో యుగంలా, దినమో యమగండంలా రోజులు గడిచాయి సరోజకు. కాదు ఆమె భర్తకు... ఎప్పుడు ఏ క్షణాన ఏ కోరిక కోరుతుందేమోనన్న భయంతో...

ముందుగానే ముగ్గురు పేరున్న జ్యోతిష్యులను పిలిపించుకుని ఏ క్షణాన పుడితే ఆడపిల్ల అవుతుంది అదీ రచయిత్రి అవుతుంది అని లెఖ్ఖలు వేయించుకుని మరీ సిజేరియన్ ఆపరేషన్‌కు నిర్ణయించుకుంది - అదీ ఓ రచయిత్రి గైనకాలజిస్ట్ దగ్గరే...

ఎదురు చూసిన సమయం రానే వచ్చింది. ఉదయం నుండి ఒక్కటే హడావిడి... సరిగ్గా సాయంత్రం ఆరింటికి ఆపరేషన్.

పుడుతూనే పిల్లకు కావలసిన సామాగ్రి అంతా సమకూర్చుకుంది. ప్రస్తుతం అద్వితీయంగా వెలిగిపోతున్న రచయిత్రి అందమైన ఫొటో.... ఏ పేరు పెట్టుకుంటే రచయిత్రి అవుతుందో న్యూమరాలజీ ప్రకారం చెప్పిన ఐదారు పేర్లు... వీటితో పాటు ఓ ఇద్దరు ప్రఖ్యాత జ్యోతిష సిద్ధాంతులు.

ఉదయం వచ్చెయ్యమని డాక్టర్ చెప్పినా రాహు కాలం మంచి సమయం అంటూ మూడింటి వరకూ గడపదాటలేదు సరోజ.

నిజానికి క్రితం రోజునించే ఒళ్ళు తేలిగ్గా అనిపించడం లేదు... ఎక్కడో ఆగి ఆగి సన్నని నొప్పులు... అయినా ధైర్యంగానే వుంది సరోజ. ముందే చెప్పారుగా.... పిల్ల ఆరింటికే పుడుతుంది... రచయిత్రి అయ్యే తీరుతుంది...

'సరే! ఇక రాజు వెడలె రవితేజములు రాగా' అన్నట్టు మందీ మార్భలంతో నాలుగు కార్లు బయల్దేరాయి... ఇంటికీ, నర్సింగ్ హోంకీ గంట ప్రయాణం. సరిగ్గా రెండు నిమిషాలు ముందుకు సాగి ఏదో అడ్డం వచ్చిందని డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడో లేదో కెవ్వుమంది సరోజ...

ఠక్కున కారాపాడు డ్రైవర్... కారు వెనక కారు నాలుగు కార్లూ ఆగాయి... నొప్పితో విలవిల్లాడి పోయింది సరోజ..

మొదటిసారేమో నొప్పుల తడాఖా తెలియక తేలిగ్గా తీసుకుంది.... అందుకే క్రితం రోజునించీ సన్న సన్నగా ఓ మోస్తరుగా నొప్పులను అంతగా పట్టించుకోలేదు... కాస్త సర్దుకున్నాక "తొందరగా పోనీమనండి" అని అన్నదో లేదో మరో నొప్పి.

అంతేనా ఒక దాని వెనక మరొకటి ఆగకుండా నొప్పులూ ఆరంభమయ్యాయి... వాటితో పాటే సరోజ కెవ్వు కెవ్వున అరుపులు.

నొప్పే తెలీకుండా బిడ్డను కందామనుకుంది...

ఏం చెయ్యాలో తోచక సరోజ మొగుడితో సహా అందరు మగవాళ్ళూ దిగి ఓ పక్కన నుంచున్నారు..

ఆడ జనాలంతా చేరి మాటా మంతీ అయ్యే లోగానే సరోజ నడిరోడ్డు వారన కారులో తను కలలు గన్న రచయిత్రిని సరిగ్గా మధ్యాహ్నం మూడున్నరకు ప్రసవించింది.

అయోమయ స్థితిలోనే అందరూ నర్సింగ్‌హోం కి వెళ్ళారు.. ఆపరేషన్ థియేటర్ సిద్ధం చేసుకుని ఎదురు చూస్తున్న డాక్టర్ రచయిత్రికి ఆశ్చర్యం కలిగేలా చంటిబిడ్డా, నలుగురు పొదివి పట్టుకున్న సరోజా ఎదురయ్యారు...

సరే కావల్సిన కార్యం గంధర్వులే తీర్చినా తన ఫీజ్‌కు డోకా లేదని తృప్తి పడిన డాక్టర్ తన వంతు డ్యూటీ హడావిడిగా నిర్వహించారు...

పదోరోజు మంగళ స్నానం అయ్యేవరకు జాతకాలు రాయకూడదనడంతో ఎలాగో వుగ్గబట్టుకున్న సరోజ ఇలా స్నానమవ్వుతూనే అలా సిద్ధాంతులను పిలిపించి జాతకం చూపించింది.

"మిగతా ఏదెలాగుందని అడగను కాని నా చిట్టితల్లి గొప్ప రచయిత్రి అవుతుందా లేదా చెప్పండి..."

అంటూ వారిని ఊదరగొట్టింది.

"ఎందుక్కాదూ...ఇంతకు మించిన రాత గాళ్ళు మరొకరుండరు... పుట్టడమే కలాన్ని ధరించి మరీ పుట్టిందని" పొగిడి పొగిడి బారీ సంభావనలు అందుకుని వెళ్ళి పోయారు జాతక రత్నలు.

పిల్ల పెరిగి పెద్దయింది. దాని పేరు మనోజ్ఞ గీతిక.

అది పదోయేట అడుగు పెట్టాగానే కథ రాయించాలని చూసింది సరోజ....

అలిగింది. కోపగించుకుంది. చివరకు రాసి చూపిస్తే గాని నాతో మాట్లాడకు అని కసురుకున్నాక -

ఓ కథ రాసి తల్లికిచ్చింది. దాన్ని చూసి పొంగి పోయి మాంఛిపేరున్న పత్రికకు పోటీకి పంపడం దానికి మొదటి బహుమతి రావడం ఒక ఎత్తైతే తిరుగు టపాలో అది కాపీ కథ అనీ తన కథ కాపీ కొట్టినందుకు క్షమార్పణ, నష్ట పరిహారం కోరిందా రచయిత్రి. చావు తప్పి కన్నులొట్టపోయిన రీతిలో బయట పడ్డాక మరి రాత మాటెత్తలేదు సరోజ.

ఇప్పుడు మనోజ్ఞ గీతికకు పాతిక నిండాయి.

"ఇంకా పడుకోలేదా?"

"వ్రాయాల్సింది చాలావుంది అమ్మా, ఈ నెల లెసన్ ప్లాన్ రాయాలి, నోట్స్ రాయాలి, పిల్లల ప్రశ్న పత్రాలు రాయాలి..."

"బాబోయ్ నేరకపోయి రచయిత్రి కూతురు కావాలనుకున్నాను..."

చెంపలేసుకుంది సరోజ.

అవును మరి మనోజ్ఞ గీతిక కేంద్ర ప్రభుత్వ పాఠశాలలో టీచర్... మరి. ☆

# ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీల్లో తెలుగు తేజం








ఒలింపిక్స్ క్రీడల తరువాత ప్రపంచంలో అత్యంత పెద్ద క్రీడా సంరంభం ఫిఫా వరల్డ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ మాత్రమే. జూన్ 11 నుంచి ఇది దక్షిణాఫ్రికాలో జరుగుతోంది. జూలై 11న జోహాన్స్‌బర్గ్‌లో జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలను ప్రత్యక్షంగానో,




**టెలివిజన్ ద్వారా పరోక్షంగానో ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది క్రీడాభిమానులు వీక్షిస్తారు. ఒక క్రీడా సంరంభాన్ని చూడటంలో ఫుట్‌బాల్ క్రీడాభిమానులదే అతి పెద్ద సంఖ్య. 2006లో ఇటలీ, ఫ్రాన్స్ దేశాల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ని 70 కోట్ల మంది వరకు చూశారని అంచనా.**

2010 వరల్డ్‌కప్‌లో 32 దేశాల నుంచి టీమ్‌లు పాల్గొంటున్నాయి. భారతదేశం పాల్గొనక పోయినప్పటికీ ఈ పోటీలు దేశంలో అత్యంత ఉత్సాహాన్ని రేకెత్తించాయి. భారతదేశం ఇప్పటికీ ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ అర్హతా ప్రమాణాలను సాధించలేదు.

80 సంవత్సరాల ఫుట్‌బాల్ కప్ పోటీల్లో కేవలం 7 దేశాలే కప్ గెలుస్తూ వస్తున్నాయి. ఆ 7 దేశాలు : బ్రెజిల్, ఇటలీ, జర్మనీ, అర్జెంటీనా, ఉరుగ్వే, ఫ్రాన్స్, ఇంగ్లాండ్.

బ్రెజిల్ ఐదుసార్లు, ఇటలీ నాలుగుసార్లు, జర్మనీ మూడు సార్లు, అర్జెంటీనా రెండు సార్లు, ఉరుగ్వే రెండు సార్లు, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ దేశాలు ఒక్కొక్క సారి ఫుట్‌బాల్ కప్‌ను గెలుచుకున్నాయి. 200 పైగా దేశాలు ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నప్పటికీ, కేవలం 32 దేశాలు మాత్రమే ప్రతిష్ఠాత్మకమైన ఛాంపియన్ షిప్ వరకు వెళ్లగలిగాయి. ఫుట్‌బాల్ కప్ పోటీలు మొదటి సారిగా ఆఫ్రికా ఖండంలో ఈ సారి జరుగుతున్నాయి.

ఒక తెలుగు క్రీడాకారుడు 2006లో జర్మనీలో జరిగిన వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. నమ్మలేకపోతున్నారు కదూ? అవును ఇది నిజం. ఆయన ఫ్రాన్స్ దేశం తరపున ఆడారు. ఇటలీకి, ఫ్రాన్స్‌కి మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో జనాదినె జిదానె వంటి గొప్ప క్రీడాకారుల సరసన ఆడారు. ఆ పోటీల్లో ఇటలీ వరల్డ్ కప్ గెలిచింది. ఆ తెలుగు వ్యక్తి పేరు వికాస్ దొరాసూ.

వికాస్ పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారు. తన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నేపథ్యం గురించి వికాస్ గర్వపడతారు. ఆయన పూర్వీకులు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌గా వ్యవహరించబడే స్థలం నుంచి ఇరాన్‌లోని షిరాజ్‌కి వలసవెళ్లి, ఆ తరువాత మారిషస్‌కు వలసవెళ్లారు. అక్కడ చెరకు తోటల్లో పనిచేశారు. తరువాత వికాస్ తండ్రి మారిషస్ నుంచి ఫ్రాన్స్‌కి వలసవెళ్లారు. వికాస్ 1973, అక్టోబర్ 10వ తేదీన ఫ్రాన్స్‌లో జన్మించారు.

మరొక తెలుగుతేజం రామన్ సుబ్బారావు. పదహారణాల తెలుగు పేరులా కన్పిస్తోంది కదూ! ఎవరీయన? 1950లో దశకంలో, 60ల దశకంలో ఆయన ఇంగ్లాండ్ తరపున ఆడారు. తరువాత ఆయన అంపైర్‌గా మారారు. ఆయన తండ్రి గుంటూరు జిల్లాలోని బాపట్లకు చెందినవారు.



ఫ్రాన్స్‌లోని నార్మండీ రాష్ట్రంలో హార్ఫ్లుయార్‌లో జన్మించిన వికాస్ దొరాసూ. మొదటిసారిగా 1993లో లె హావ్రెఎసితో తన ఫుట్‌బాల్ కెరీర్‌ను ప్రారంభించారు. మిడ్ ఫీల్డర్‌గా, ఒక మంచి డ్రిబ్లర్‌గా ఆయన తనకంటూ ఒక

మంచి స్థానం సంపాదించుకున్నారు.

1998లో ఒలింపిక్ లియోనాయిస్‌లో చేరి, 2003లో, 2004లో 8 సార్లు ఫ్రెంచి లీగ్ ఛాంపియన్ షిప్‌ను ఆయన గెలుచుకున్నారు. 2004లో ప్రతిష్ఠాత్మకమైన ఎసి మిలన్‌లో చేరడానికి ఆయన ఫ్రాన్స్‌ను వదిలిపెట్టి, ఇటలీకి వెళ్లారు. 2005 యుఇఎఫ్ఏ ఛాంపియన్స్ లీగ్ ఫైనల్‌లో ఆయన ఉపయోగించుకొని సబ్‌స్టిట్యూట్‌గా ఉన్నారు. ఆ పోటీల్లో లివర్‌పూల్ ఎసిమిలన్‌ను ఓడించింది.

2005లో వికాస్ దొరాసూ ఫ్రాన్స్‌కి తిరిగి వచ్చారు. పారిస్ సెయింట్ జర్మెయిన్ (పిఎస్‌జి) తరపున ఆడి 2006 ఫ్రెంచికప్‌ను ఈ జట్టు గెలుచుకోవడానికి దోహదపడ్డారు. ఫైనల్ మ్యాచ్‌లో ఒలింపిక్ డెమార్సెల్లెతో పారిస్ సెయింట్ జర్మయిన్ ఆడినప్పుడు 25 గజాల దూరం నుంచి సూపర్బ్‌షాట్ కొట్టి, తన జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు.



ఈ మధ్యకాలంలో, 2006 ఫిఫావరల్డ్ కప్ కోసం ఫ్రెంచ్ స్క్వాడ్‌కి ఆయన ఎంపికయ్యారు. అయితే, టోర్నమెంట్‌లో పరిమిత కాలానికే ఆయన ఆడవలసి వచ్చింది. 2006 సెప్టెంబర్‌లో ఒక మీడియా ఇంటర్వ్యూలో ఆయన పిఎస్‌జి జట్టు మేనేజర్‌ను విమర్శించడంతో ఆయనను జట్టు నుంచి తొలగించారు. ఆ తరువాత సంవత్సరంలో లివర్నో జట్టులోకి వికాస్‌ని తీసుకున్నారు. అయితే, వివాదాలు ఆయనను వెన్నంటాయి. లివర్నో జట్టు తన జూనియర్ జట్టుతో ఆడినప్పుడు అందులో పాల్గొనడానికి నిరాకరించటంతో, వికాస్‌ను ఆ జట్టునుంచి కూడా తీసేశారు. దీంతో కలత చెందిన వికాస్ 2008లో ఫుట్‌బాల్ క్రీడ నుంచి రిటైరవుదామని భావించారు. మరొక జట్టు నుంచి ఆయనకు ఆఫర్ వచ్చినా తోసిపుచ్చారు.

వికాస్ కెరీర్ మొత్తం ఆయనను వెన్నంటి ఉన్న వివాదాలను పరిశీలిస్తే, ఆయన సున్నితమైన మనస్కుడనీ,, ఉద్రేకపరుడని అర్థం అవుతుంది. అందువల్లనే దేశీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆయన సాధించిన రికార్డు అంత గొప్పగా లేదు. 1993 - 2006 మధ్యకాలంలో 370 సార్లు ఆడిన దేశీయ మ్యాచ్‌లలో ఆయన చేసిన గోల్స్ కేవలం 16. 1999 - 2006 మధ్య కాలంలో ఆడిన 18 అంతర్జాతీయ మ్యాచ్‌లలో చేసినది కేవలం ఒక్క గోల్. అయితే, ఒక ఫుట్‌బాల్ క్రీడాకారుడిని అంచనా వేయడానికి గోల్స్ సంఖ్య ఒక్కటే ప్రామాణికం కాదు.

ఫైనల్ మ్యాచ్‌లో అతికొద్దిసేపు కన్పించడం తప్పితే, 2006 వరల్డ్ కప్‌లో వికాస్ దొరాసూ ఎక్కువ భాగం సబ్‌స్టిట్యూట్‌గానే ఉండిపోయారు. ఆడటానికి వచ్చే పిలుపు కోసం ఎదురు చూస్తూ, హోటల్ రూమ్‌లో టెన్షన్‌తో గడపటం ఆయనకు చాలా చికాకు తెప్పించేది. తను స్వయంగా అనుభవించిన చికాకు అనుభవాల నుంచి ఆయన ఒక డాక్యుమెంటరీని నిర్మించారు. దాని పేరు 'సబ్‌స్టిట్యూట్'. సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్ల వేదనలను అందులో వివరంగా చూపించారు. ఈ డాక్యుమెంటరీ పట్ల కోపోద్రిక్తులైన ఫుట్‌బాల్ యాజమాన్యాల నుంచి ఎన్ని బెదిరింపులు వచ్చినా, వికాస్ దాన్ని విడుదల చేశారు. 2008లో ఆయన మరొక చిత్రం విడుదల చేశారు.




క్రీడల్లో కనపడే వివక్షను ఆయన నిర్ద్వాక్షణ్యంగా ఎండగట్టారు. పేదరికం అనుభవించిన మనిషిగా, మానవతా వాదిగా మూడవ ప్రపంచ దేశాల్లో పేదరికాన్ని ఎదుర్కోవడానికి చేపట్టిన అనేక కార్యక్రమాల్లో వికాస్ పాల్గొన్నారు.

వికాస్ తన భారతదేశ నేపథ్యం గురించి, తెలుగు నేపథ్యం గురించి గర్వపడతారు. భారతదేశాన్ని సందర్శించాలనే ఆయన కోరిక గత ఏడాది తీరింది. మామూలు టూరిస్టు



లాగా ఆయన ఇక్కడికి రాలేదు. ఈ దేశంలో ఫుట్‌బాల్ క్రీడను పెంపొందించాలనే ఆశయంతో వికాస్ తన సందర్శన జరిపారు.

## మన సొంత తెలుగు బిడ్డ

భారతదేశంతో, ఆంధ్రప్రదేశ్‌తో రామన్ సుబ్బారావు అనుబంధం మరింత దగ్గర, మరింత పటిష్ఠం. ఆయన తండ్రి న్యాయశాస్త్రం చదువుకోడానికి ఐర్లాండ్‌కి వెళ్లారు. ఇంగ్లాండ్‌లో ఉన్న కొద్దికాలంలోనే ఆయన ఒక ఆంగ్ల వనితను కలిసి, పెళ్లికూడా చేసుకున్నారు. తన ఇంగ్లీషు భార్యతో ఆయన ఇండియాకు తిరిగివచ్చి, మద్రాసులో కొంతకాలం లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. 1920లో తిరిగి ఇంగ్లాండ్‌కి వెళ్లిపోయి, అక్కడే స్థిరపడ్డారు.

1932లో జన్మించిన సుబ్బారావు లెఫ్ట్‌హేండ్ బ్యాట్స్‌మన్‌గా, స్పిన్‌బౌలర్‌గా కేంబ్రిడ్జి యూనివర్సిటీ తరపున క్రికెట్ ఆడారు.

తరువాత సర్రే, నార్తంప్టన్‌షైర్ కౌంటీల తరపున రామన్ సుబ్బారావు ఆడారు. నార్తంప్టన్‌షైర్ కౌంటీకి ఆయన కేప్టెన్‌కూడా అయ్యారు. 1950ల దశకంలో జరిగిన మ్యాచ్‌లలో ఆయన డబుల్ సెంచరీ, ట్రిబుల్ సెంచరీ కూడా సాధించారు. 1961లో ఆయనను విస్‌డన్ క్రికెటర్ ఆఫ్‌ది ఇయర్‌గా సత్కరించారు.




సుబ్బారావు మొదటిసారిగా కామన్‌వెల్త్ బృందంలో సభ్యుడిగా 1953లో భారతదేశాన్ని సందర్శించారు. ఆ తరువాత అనేక సార్లు భారతదేశం వచ్చారు. తన భారతదేశ నేపథ్యం అంటే ఆయనకు ఎంతో మక్కువ. బాపట్లను మూడుసార్లకు పైగా సందర్శించారు. భారతదేశంలో ఆయనకు చాలా మంది స్నేహితులున్నారు. భారతదేశం తరపున ఆడాలని ఆయనకు ఎంతగానో ఉన్నా, 1959లో ప్రతిష్ఠాత్మక ఓవల్ పోటీల్లో భారతదేశానికి వ్యతిరేకంగా ఆడవలసివచ్చింది. అప్పుడు సెంచరీ ఆయనకు కొద్దిలో తప్పిపోయింది. 1991 - 2001 మధ్యకాలంలో ఆయన అంపైర్‌గా మంచి పేరు సంపాదించారు.

**- దాసు కేశవరావు,** (అనువాదం : టి.నర్మద)



# పల్లవించిన పల్లె... హాజీపల్లి

మహబూబ్ నగర్ జిల్లా ఫరూక్ నగర్ మండలంలోని ఓ కుగ్రామం హాజీపల్లి. 250 కుటుంబాలు, దాదాపు వెయ్యి మంది జనాభా. 600 మంది ఓటర్లు ఉంటారా ఊళ్లో. బలహీనవర్గాలకు చెందిన గౌడలు, మున్నూరు కాపులు, ముదిరాజ్‌లు, కమ్మర్లు, ఇంకా షెడ్యూల్డ్ కులాల వారు కొద్దిమంది ఉంటారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటింటికీ మరుగుదొడ్లు, సిమెంట్ కాంక్రీట్‌తో వేసిన రోడ్లు, ప్రతి ఇంటికీ నీటి కుళాయిలు, వీథిలైట్ల వంటి పట్టణప్రాంతంలో ఉండే అన్ని రకాల సదుపాయాలు ఆ ఊళ్లో ఉన్నాయంటే, ఎవరికైనా ఆశ్చర్యం కలుగక మానదు. కానీ ఆ ఊరి ప్రజలంతా వ్యవసాయం, పశు పోషణపైనే జీవన భృతి పొందుతుంటారు. మండల కేంద్రమైన షాద్‌నగర్‌కు దగ్గరగా ఉండటం వల్ల ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్ పథకం వైపు గ్రామస్థులు ఆకర్షితులు కాలేదు. ఇది ఎలా సాధ్యం? గ్రామీణ ప్రాంతాలలో అర్బన్ సౌకర్యాలుండాలన్న మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విజన్ హాజీపల్లిలో అచరణ రూపం పొందిందని మనం అనుకోవాలా? ఇది మనలో చాలా మందికి "యాలిస్ ఇన్ వండర్ ల్యాండ్" స్టోరీ లాగా అనిపిస్తుంది. కానీ ఇది నిజం. దీనంతటికీ కారణం, కొందరు వ్యక్తుల సమిష్టి కృషి వల్ల ఈ మార్పు సాధ్యమైంది.

హాజీపల్లి 1981 లోనే స్వతంత్ర గ్రామ పంచాయతీగా అవతరించింది. కానీ, 2001 వరకు ఆ ఊరిగురించి ఎవరికీ తెలియదు. ఈ గ్రామానికి వెళ్లడానికి సరైన రోడ్డు కూడా ఉండేది కాదు. గ్రామస్తులు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేవారు. బహిర్భూమిలోనే కాలకృత్యాలు తీర్చుకునే వారు. వీటికి తోడు మలేరియా, డయేరియా వ్యాధుల వల్ల వారి ఆరోగ్యం బాగా క్షీణించి పోయేది. ఫలితంగా వారి జీవితాలే గాలిలో దీపాల్లా తయారయ్యేవి. గ్రామస్తులు వారి సమస్యలనన్నింటిని, ప్రవాస గ్రామస్తుడు, షాద్‌నగర్‌లో క్వారీ రాళ్ల దుకాణ యజమాని శ్రీనివాస్‌కు చెప్పుకుంటూ ఉండేవారు. ఓ మంచి వ్యక్తిగా, గ్రామస్తుల శ్రేయోభిలాషిగా, వారికి తోచిన సహాయం చేస్తూ, వారికున్న చిన్న చిన్న అవసరాలను తీర్చుతూ ఉండేవాడు. అయితే, ఆయన వల్ల గ్రామంలో ముఖ్యమైన సమస్యలేవీ పరిష్కారం కాలేదు. 2001 గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరిగాయి. గ్రామస్తులందరూ శ్రీనివాస్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గ్రామ చరిత్రలో అదొక మలుపుగా మారింది.

గ్రామంలో అన్నిటికన్నా ముందు పరిష్కరించాల్సింది మంచినీటి సమస్య. సరిగ్గా సమయానికి గ్రామంలో ఉన్న 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకును అప్‌గ్రేడ్ చేస్తామని వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద



సంస్థ ముందుకొచ్చింది. అప్పుడే, ఎన్‌జీఆర్‌పై పథకంకింద గ్రామంలోకి రావడానికి మట్టిరోడ్లు, మురుగునీరు పోవడానికి రోడ్డుకిరుపక్కలా కాల్వలు కట్టించాలని సర్పంచ్ శ్రీనివాస్ నిర్ణయించారు. 2006 నాటికల్లా గ్రామస్తులకు మౌలిక సదుపాయాలు, ప్రాథమిక వసతుల విషయంలో బ్రహ్మాండమైన మార్పులు వచ్చాయి. బహిర్భూముల్లో కాలకృత్యాలు తీసుకోవద్దని గ్రామస్తులను అంగీకరింపజేయడానికి ఆరేళ్లు పట్టింది. వాళ్ల ఇళ్లలోని మురుగుదొడ్లను ప్రధాన మురుగు కాల్వలకు కలిపారు. ప్రజలకు ఈ విషయాలను నచ్చజెప్పేందుకు వివిధ పద్ధతులను అనుసరించాల్సి వచ్చింది. వాటిలో కళాజాతరలు, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయడం, గ్రామసభలను ఏర్పాటు చేయడం వంటి పద్ధతులను అవలంబించాల్సి వచ్చింది. అధికారులతో సమావేశాలను, వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆకట్టుకోవడం, తెల్లవారుజామున, రాత్రుళ్లలో నిఘావేసి ఉంచడానికి బృందాలను ఏర్పాటు చేయడం, బహిర్భూమికి వెళ్లిన వారినుంచి అపరాధ రుసుములు వసూలు చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టాల్సి వచ్చింది.

కాస్త నెమ్మదిగా ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఈలోగా, భూముల ధరలు చుక్కలనంటాయి. దానితో గ్రామ పంచాయితీ నిధులు ఏడాదికి 17 లక్షల రూపాయిలకు పెరిగాయి. స్టాంపు డ్యూటీ రూపంలో ఈ నిధులు సమకూరాయి. ఇళ్లపన్ను, నీటి పన్ను, పశు సంపదపై పన్ను రూపంలో గ్రామ ఆదాయం ఉండేది. ఇలా ఉండగా, కొందరు గ్రామస్తులు, మురుగు నీటి పారుదల వ్యవస్థ గురించి తెలుసుకొనేందుకు కొన్ని అభివృద్ధి చెందిన గ్రామాలను సందర్శించారు. ముందుగా పెట్టే పెట్టుబడులు పెద్ద మొత్తంలో ఉన్నప్పటికీ, గ్రామంలో మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి మొత్తం 25 లక్షల రూపాయిలు అవుతుందని అంచనా. అయినప్పటికీ, ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని తీరాల్సిందేనన్న పట్టుదలతో గ్రామస్తులు ఉన్నారు. ఎందుకంటే, మురుగు నీరు మాటిమాటికీ అడ్డుకుపోయి, దాన్ని నిర్వహించడం తలనొప్పిగా తయారయ్యేది. గ్రామంలోని కొన్ని కీలకమైన జంక్షన్‌లలో హైమాస్ట్ విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేసుకున్నారు.

2006లో షెడ్యూల్డ్ కులానికి చెందిన జంగమ్మ ఊరి సర్పంచ్‌గా ఎన్నికైంది. శ్రీనివాస్ నుంచి పదవీ బాధ్యతలను ఆమె స్వీకరించింది. మిగతా గ్రామాల్లో లాగా ఆమెకు పురుష దురహంకార సమస్యలవంటివి ఏవీ ఎదురు కాలేదు. ఆమెను గ్రామస్తులంతా సాదరంగా ఆహ్వానించి, గ్రామ సమస్యలపై పనిచేయడానికి, గౌరవప్రదమైన జీవితం గడపటానికి కావలసిన మద్దతునిచ్చారు.

గ్రామంలో వారు చేపట్టిన కార్యకలాపాల పట్ల ఎందరో ప్రశంసలనందుకున్నారు. 2008 నవంబర్ 1న జంగమ్మ 'శుభ్రం' అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదుగా స్వీకరించింది. ఆ తరువాత నెలలో రాష్ట్రపతి చేతులు మీదుగా 'నిర్మల్ గ్రామ పురస్కార్' అవార్డును కూడా అందుకొంది. వారి కార్యకలాపాలను మెచ్చుకుంటూ మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను ఎన్నింటినో ఆ గ్రామవాసులు పొందారు. గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం, స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ సంచులను నిషేధించడం, ఇళ్లలో చెత్తను సేకరించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి చర్యలు తీసుకున్నందుకు గ్రామీణాభివృద్ధి జాతీయ సంస్థ (ఎన్‌ఐఆర్‌డి) సర్పంచ్ జంగమ్మను








అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు సత్కరించింది.

జంగమ్మ గ్రామ అభ్యుదయం కోసం ఇంకేమైనా కలలు కంటుందా? అంటే ముమ్మాటికీ 'అవును' అనే సమాధానం వస్తుంది. గ్రామంలోని ఇళ్లన్నిటికీ, వీధిలైట్లను సౌరవిద్యుత్ ద్వారా వెలుగుతుంటే చూడాలని అనుకొంటోంది. ఇది చాలా పెద్ద మొత్తం ఖర్చుతో కూడుకున్న ఆలోచనే కానీ తన లక్ష్యసాధనకు ఆమె సిద్ధమే. యువతరానికి మంచి జీవనాధారం, హాజీపల్లివాసులను నాణ్యమైన చక్కని జీవితం అందించి వారంతా తమ ఊరు హాజీపల్లిలో తప్ప




మరెక్కడా ఉండజాలమని భావించేలా చేయాలని జంగమ్మ కోరిక.

మన దేశంలో ప్రతీ పల్లె హాజీపల్లి లాగా ఉంటే గ్రామీణ భారతం ఎంతో మెరుగవుతుందని మేమీ గ్రామాన్ని సందర్శించాక అన్పించింది. ఇప్పుడు సింహావలోకనం చేసుకోవాల్సిన సమయమిది. హాజీపల్లి విజయానికి దారి తీసిన అంశాలేవి? మొట్టమొదటిగా చెప్పుకోవలసింది, చైతన్యవంతుడైన నాయకుడు శ్రీనివాస్ గురించి. కృష్ణ భగవానుడిలా ప్రతి గ్రామానికీ వెళ్లి ఆయన చేయలేడు. ఏకాభిప్రాయాన్ని టీం స్పిరిట్ ద్వారా వాటిని పరిష్కరించడం ముఖ్యం.

గ్రామంలో పెత్తందార్లు, అగ్రకులాల, భూస్వాముల ఆదిపత్యం లేకుండా ఉండాలి. బడుగు వర్గాల వారిని అధికారంలో భాగస్వాములను చేయాలి. కులాల ప్రసక్తిలేకుండా చదువుకున్న వారిని ప్రోత్సహిస్తే సమానత్వం, సాంఘికన్యాయం జరుగుతుంది. ప్రస్తుతమున్న గ్రామ పంచాయతీ కమిటీలను పటిష్టం చేయడం తక్షణం మేమిచ్చే సలహా. ప్రస్తుత సేవలను కొనసాగించేందుకు యూజర్ చార్జీలను వసూలు చేయాలి. అభివృద్ధిని సాధించాలంటే ప్రజలంతా భాగస్వాములు కావాలి. హాజీపల్లిలో మెరుగైన జీవితం, భద్రత కోసం ఎదురయ్యే సవాళ్లను వచ్చే తరాల వారు అర్థం చేసుకొనేలా చేయాలి.

**డాక్టర్ కె. జయలక్ష్మి**
ఫ్యాకల్టీ మెంబర్, సెంటర్ ఫర్ పంచాయతీ రాజ్,
ఎన్ఐఆర్డి, హైదరాబాద్
- అనువాదం: ***బి. లలిత***

గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# విముక్తి

కె. వరలక్ష్మి

**సొర్గం అనుకుని వస్తే ఇదికాస్తా పాతాళమై కూర్చుంది, పచ్చని పొలాలు మధ్యలో మూడంతస్తుల రాసమేడ, ఎత్తైత్తు మనుషులు, సాకలి ఉతికిన సలవ జారీ బట్టలు, వొళ్లంతా దిగేసుకున్న బంగారాలు, చాలా ఖరీదు ఖరీదుగా కనపడుతుంటారు, బుద్ధులు మాత్రం చిన్నవి,**

**లేకపోతే పదేళ్లై ఈ ఇంటికి కోడలిగా వొచ్చిన నన్ను ఇంకా దూరం పెట్టే ఉంచుతున్నారు. అడుగడుగునా నా కులాన్ని ఆళ్లు మరిచిపోరు, నన్ను మరవనివ్వరు, ఊరేగింపులాగ అందరూ బైటికెళ్తున్నారు. కిటికీలోంచి చూసేను. నరేషు కారు తీసి డ్రైవింగు సీటులో కూర్చున్నాడు. అతని తండ్రి అతని పక్క సీట్లో. వెనక సీట్లో అతని తల్లి, చెల్లి, బావ, ఓడంత ఇన్నోవా కారు. నాకూ, నా పాపకూ ఆ వెనక సీట్లోనైనా చోటుండదా?**



కారు కదలి పెద్ద గేట్లోంచి బైటికెళ్లిపోయింది. అరమైలు దూరంలో పెద్ద గేటు, బిల్డింగు చుట్టూ కొన్ని ఎకరాల పూలతోట, బైటి నుంచి చూసే వాళ్లకిది పెద్దకాపుగారి మేడ, సొర్గం.

ఒకటోరకం టేకు కర్రతో చేసిన జిలుగు జిలుగు నగిషీల సింహద్వారం, దాని వెనకున్న మొదటి హాలు తప్ప బైటి వాళ్లు చాలామందికి ఈ భవనంలోకి ప్రవేశం లేదు. నేను మాత్రం చిన్నప్పట్నుంచి ఈ భవనంలోనే పెరిగేను. మా అమ్మ ఇక్కడే కదా పని చేసేది! తెల్లవారు ఝామునొచ్చి రాత్రి తొమ్మిది వరకూ వంచిన నడుం ఎత్తకుండా ఇంటెడు చాకిరీ చేసుకుపోయేది. అప్పట్లో కాపమ్మ గారు ఎంతమంచిది! ఆళ్లమ్మాయి కన్నా నేను కొంచెం చిన్నదాన్ని కావడం వల్ల ఆ అమ్మాయి పాత బట్టలన్నీ నాకే ఇచ్చేది. ఆ అమ్మాయి తినగా మిగిలినవన్నీ నాకే పెట్టేది. కాపమ్మగారి ఖరీదైన పాత జరీచీరలు చిరుగులు పట్టి, రంగులు వెలిసిపోతేనేం అమ్మకిచ్చేది. అదంతా పనిచేయించుకునే ఉపాయమని పాపం పిచ్చి అమ్మకి తెలీదు. నేను సగం పనిని పంచుకుంటున్నా. ఇప్పుడు ఈ ఇంట్లో పనివాళ్లెవరూ పట్టుమని పదినెలలైనా చెయ్యరు. కాపమ్మగారి మాటలతీపి అందరికీ అర్థమైపోయింది. అమ్మ కాబట్టి పద్ధెనిమిదేళ్లు ఎదుగుబొదుగూలేని జీతం డబ్బులకి పనిచేసింది.

మాటలకందని కృతజ్ఞత మా అమ్మది. నేను పుట్టినప్పుడు ఏ గొంతెమ్మో, నూకాలమ్మో అని పెట్టనీకుండా నాకు సంధ్య అని చక్కని పేరు పెట్టిందంట కాపమ్మ. చిన్నప్పుడే బళ్లో ఏయించి ఆళ్లమ్మాయి పాత పలకలూ పుస్తకాలు ఇచ్చేదంట. పిచ్చితల్లికి అదంతా నేను తన పనికి అడ్డం రాకుండా చెయ్యడమని తెలీదు. నేను కొంచెం ఎదిగిన కాణ్నుంచీ బడి నుంచి రాగానే అమ్మకి చెయ్యి సాయంగా పనులందుకోవాల్సి వచ్చింది కదా! ఆళ్లమ్మాయి హోం వర్కులు చేసుకుంటూ, స్నేహితుల్తో

ఆడుకుంటూ ఉంటే నేను మాత్రం పుస్తకాలక్కడ పడేసి కాపమ్మ గారి పనుల్లో మునిగిపోయేదాన్ని. అందరూ తినగా మిగిలిందేదో పెడితే అదే బ్రహ్మానందం అమ్మకి.

''అమ్మా'' అని నా కొంగులాగింది పాపాయి, ఆలోచనల్లో పడి కారెళ్లిన ప్రదేశాన్నే చూస్తున్నానింకా. అక్కడే కదా నేను మౌన పోరాటం చేసింది!

పాపాయికి స్నానం చేయించి బట్టలు మార్చి, హోమ్‌వర్క్ చేయిస్తున్నానన్న మాటేకాని నా మనసు మాత్రం గతంలోకి, నాకంటూ ఏ వివేకమూ లేని ఆ రోజుల్లోకి పరుగులు పెడుతూనే ఉంది - పదోతరగతి పరీక్షలు రాసాను. ఆ రాత్రి ఇంట్లో అమ్మ, నాయన నా పెళ్లి గురించి మాట్లాడుకోవడం విని భయపడిపోయేను. నాకింకా చదువుకోవాలని ఉంది. అమ్మ తమ్ముడు ఆ తుమ్మమొద్దు సీతిగాడితో నాకు పెళ్లి చేస్తారంట. ఆడు పనిచేసే చెరుకుతోటల్లోంచి బెల్లంపాకం, చెరుకుముక్కలు మోసుకొచ్చి పెద్ద ఘనకార్యం చేసినట్టు నా కళ్లల్లోకి చూస్తాడు.




పెళ్లి అనగానే నాకు చినబాబు నరేషు గుర్తుకొచ్చేడు,. ఎంత అందంగా ఎంత స్టైలుగా ఉంటాడు! మంచి బలంగా నా మీద రెండు జానల ఎత్తుగా ఉంటాడు. ఈ మధ్య ఒక ఏడాదిగా నన్ను ప్రత్యేకంగా చూస్తున్నాడు. ఎవరూ చూడనప్పుడు గమ్మత్తుగా నవ్వుతాడు. రంగురంగుల జడబేండ్‌లూ, ఫాన్సీ ఆభరణాలూ వాళ్ల చెల్లితో బాటు నాకూ తెచ్చి ఇస్తున్నాడు. ఒకసారి నేను వెనక్కి తిరిగి ఏదో పని చేసుకుంటూంటే బలంగా వాటేసుకున్నాడు. అన్నిటికన్నా నాకు నచ్చింది- నేను మొక్కలకి నీళ్లు పోస్తూంటే ఎర్రటి గులాబీ పువ్వొకటి కోసి నా జడలో తురమడం. నరేష్‌బాబు నా కళ్లకి గొప్ప సినిమా హీరోలా కన్పించేవాడు. ఈ మాట పైకి అన్నానంటే మా అమ్మ నన్ను చంపేస్తుంది.

మర్నాడు మా అమ్మ కాపమ్మ గారితో చెప్పడం విన్నట్టున్నాడు ఒంటరిగా నన్ను కారుషెడ్డు దగ్గరికి పిల్చి ''పెళ్లి చేసుకుంటున్నావట కదా!'' అన్నాడు. ఆ గొంతులో నిష్ఠూరం.

''ఏం చెయ్యను చినబాబు మరి, మా అమ్మ, అయ్య ఇష్టం కదా!''.

''నన్నేమైపొమ్మంటావు?'' ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ ఉండే చినబాబు కళ్లల్లో నీళ్లు.

''నిన్ను నా ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాను తెల్సా'' అచ్చంగా సినిమా హీరోలాగే అన్నాడు.

నా మనసు కరిగి నీరైంది, ఒక గొప్ప పులకింత, మైకం నన్నావరించిననట్టై ఒక్క ఉదుటున ముందు కెళ్లి చినబాబు కౌగిలిలో వొదిగిపోయేను. అదే సమయానికి సరిగ్గా మా అమ్మ వచ్చేసిందక్కడికి. మమ్మల్నిద్దర్నీ అలా చూసి నిర్ఘాంతపోయింది. నోరు నొక్కుకుని, చినబాబుకి దణ్ణం పెట్టి, నా చెయ్యి పట్టుకుని విసురుగా లాక్కొనిపోయింది. కడుపులో నొప్పని కాపమ్మగారికి వంకచెప్పి నన్నింటికి తీసుకుపోయింది.

అదే రోజు సాయంత్రం పక్కవూళ్లో ఉన్న మావయ్యనీ, అమ్మమ్మనీ పిలిపించి పెళ్లికి లగ్గం పెట్టించేసారు. నన్ను ఇంట్లోంచి కదలకుండా అమ్మమ్మని కాపలా పెట్టి తను పెదకాపుగారింటికెళ్లేది.

పెళ్లి అయిదు రోజులుందనగా కాపమ్మగారిచ్చేరంటూ ఒకపాత బట్టల మూట మోసుకొచ్చింది. రెండు పాత పట్టుచీరలు, ఒక కొత్త సిల్కు చీర, ఇంకా ఏవేవో జాకెట్లు, తువాళ్లు అన్నీ ఏరి ఏరి చూసుకుని తెగమురిసిపోయేరిద్దరూ. అమ్మ మొలలోంచి అయిదు వందనోట్లు తీసి పెళ్లి ఖర్చులకిచ్చేరని చూపించింది. అమ్మ, అమ్మమ్మ కాపమ్మగార్ని భట్రాజుల్లాగా ఒకటే పొగిడేరు, ''నీ మొగుడి కంట పడనియ్యకు. తాగి తలకోసుకుంటాడు'' అని హెచ్చరించిందమ్మమ్మ.

పెళ్లి రెండు రోజులుందనగా మా తాటాకుల ఇంటిముందు చిన్నకొబ్బరాకుల పందిరేసారు, మావిడాకుల తోరణాలు కట్టేరు, వాకిట్లో రోలు పెట్టి పసుపు దంచేరు. నా వొళ్లంతా పసుపు పూసి తలంటు పోసేరు.

ఆ రాత్రి అందరం మంచి నిద్దర్లో ఉండగా ఎవరో నా చెయ్యిపట్టి గుంజి నిలబెట్టి, అరవకుండా నా నోరుమూసేరు. గుడ్డిదీపం వెలుతుర్లో కళ్లు విప్పార్చుకుని చూస్తే చినబాబు. అరవొద్దని పెదవుల మీద వేల ఉంచుకుని సైగ చేసి నన్ను బైటికి లాక్కుని పోయేడు. అందరూ నడిచేదారి వదిలేసి గుడిసెల మధ్య సందుల్లోంచి, పెంటకుప్పల మీంచి పరుగులాంటి నడకతో చెరువు గట్టున తన కారు ఆపిన చోటికి తీసుకుపోయేడు. కారులోకి నన్ను తోసి, తను డ్రైవ్ చెయ్యడం మొదలు పెట్టేడు. ఎక్కడికెళ్తున్నామో ఏమో అంతా నాకు అయోమయం అయిపోయింది.

తెలతెలవారుతుండగా ఏదో బస్తీలో ఒక ఖరీదైన హోటల్లో దిగేం.

''ఏంటిదంతా చినబాబూ'' అంటే -

''నీ మీద ఇష్టం. నిన్నొదులుకోలేను'' అన్నాడు.

"అంటే మనం పెళ్లి చేసుకుంటామా" అని నేనంటే- "అవును" అన్నాడు.

ఎప్పుడుకొన్నాడో ఏమో కారులోంచి నా కోసం కొత్త చీరలు, పూల మాలలు తెచ్చేడు. నేను స్నానం చేసి కొత్త చీర కట్టుకున్నాక ఒక మాల నా మెడలో వేసి "ఇదే మన పెళ్లి" అన్నాడు.

"ఈ రోజు నుంచి నువ్వు పెద్దకాపుగారి కోడలివి" అన్నాడు.

ఆనందంతో పులకరించిపోతున్న నన్నాక్రమించుకుంటూ "ఇంతకన్నా స్వర్గం మరెక్కడుంది సంధ్య" అన్నాడు.

పది రోజులు బైటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఆనంద డోలికల్లో సాగిన మా కాపురపు కల ఆ రాత్రి పెద్ద కాపుగారి మనుషులు వచ్చి మమ్మల్ని పట్టుకోవడంతో ముగిసిపోయింది.

తెల్లవారేలోగా నన్ను మా గూడెం బైట వదిలేసి, చినబాబుని ఇంటికి తీసుకుపోయేరు. కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరుకున్న నన్ను మా అమ్మ జబ్బల సత్తువ తీరే దాకా కొట్టింది. ఎంత సేపటికీ "ఆ మారాజులకి నా మొఖం ఎలా సూపించను?" అని నెత్తికొట్టుకుని ఏడ్చింది. బాగా తాగి ఉన్న మా అయ్య నన్ను కౌగిలించుకుని "ఎంత పని సేసేవే కూతురా" అని ఏడ్చేడు. జరిగిందాంట్లో నా తప్పేముందో నాకేమాత్రం అర్థం కాలేదు. అసలే పచ్చిపుండైన శరీరం మా అమ్మకొట్టిన దెబ్బలకి మరింత సున్నమైంది. గుడిసెలో చింకి చాపమీద ముణగదీసుకుని పడి ఉన్నాను.

సాయంకాలానికి పక్కగూడెం ప్రెసిడెంటు కృపాలుబాబుని తీసుకుని మా మేనమావ వచ్చేడు. మా కులపెద్దలు నలుగురూ వొచ్చేరు. వాకిట్లో కూచుని ఏటేటో మాట్లాడుకున్నారు. అందరూ కట్టగట్టుకుని పెద్దకాపుగారింటికెళ్లేరు. అట్నుంచి ఆళ్లు తిరిగొచ్చిన మరుక్షణం పొయ్యిలో సగం కాలి చల్లారిన కట్టెపేడొకటి పట్టుకుని మా అమ్మ లోపలి కొచ్చి "ఉప్పుడేటైందో సూడు, ఉప్పుడేటైందో సూడు" అంటూ అదే పనిగా నన్ను బాదడం మొదలు పెట్టింది.

తను అమాయకుడిననీ, నాకు మా మేనమావని చేసుకోడం ఇష్టం లేక పదిరోజులపాటు ఎక్కడికైనా తీసుకుపొమ్మని ఉత్తరం రాసేననీ, చిన్నప్పట్నుంచీ తన కళ్లెదుట పెరిగిన పిల్ల బాధపడుతుంటే చూడలేక ఇష్టం లేని పెళ్లిని తప్పించడానికి తీసుకెళ్లేడు తప్ప తనకే అర్మం కర్మం తెలీదన్నాడంట చినబాబు.

నా మీద మా అమ్మకొచ్చిన కోపానికి నన్ను చంపెయ్యాలనుకుందట. ఇంటెనక గన్నేరుపప్పు నూరుకొచ్చి నా కోసం తీసిన కూరలో కలిపిందట. నాకింకా భూమ్మీద నూకలుండి ఆ రాత్రి పచ్చి మంచినీళ్లైనా ముట్టకుండా ఉండిపోయేను.

మర్నాడు పెద్దకాపుగారికి ఎప్పుడూ ఎగస్పార్టీలో ఉండే అబ్బులు గారొచ్చేడు మా ఇంటికి. ఆయన చెప్పిన ఉపాయం ప్రకారం నన్ను తీసుకొచ్చి పెద్దకాపుగారి వాకిట్లో కూర్చోబెట్టేరు. 'మౌన పోరాటం' అని రాసిన ప్లకార్డొకటి నా చేతిలో పెట్టి, నా వెనుక ఆళ్లంతా కూర్చున్నారు. కాపమ్మగారు నన్ను చూసి వాకిట్లోకొచ్చి "థూ.." అని ఉమిసింది. ఇంకా కోపం తీరక కొత్త పనిమనిషి వాకిట్లో జల్లడానికి తెచ్చిన పేడకళ్లాపి నీళ్లు నా మీద గుమ్మరించింది. "మా ఇంటి తిండి తిని దున్నపోతులా బలిసి, కొవ్వెక్కి కొట్టుకుంటంది" అని నానా తిట్లూ తిట్టింది.

అందరం ఓర్పుతో కూచున్నాం. మూడు రోజులు గడిచాయి, పెద్దకాపు, చినబాబు మా ముందునుంచి బోరవిరచుకుని లోపలికీ, బైటికీ తిరుగుతానే ఉన్నారు.

నాలుగోరోజు మావోళ్లు తండ్రి, కొడుకుల్ని అడ్డుకున్నారు, "పెద్దకాపు గారూ! మేవింక కలెక్టరు కాడికెళ్లిపోతాం, అబం శుబం తెలవని మైనరు పిల్లనెత్తుకెళ్లి పాడుజేసినందుకు నీ కొడుకు ఊసలెక్కడతాడు సూడు" అన్నారు.

కలక్టరనేసరికి పెద్దకాపుగారు దిగొచ్చేడు.

మావోళ్లు పట్టుబట్టి చినబాబుకీ నాకూ రిజిష్టరు పెళ్లి జరిపించేరు. ముందు మమ్మల్ని ఆ ఇంట్లో ఉంచుకోం అని దూరంగా అద్దింట్లో ఉంచేరు. రెండేళ్లు గడిచేసరికి కొడుకు జల్సాల కోసం చేస్తున్న అప్పులు తీర్చలేక తీసుకొచ్చి ఇంట్లో ఆళ్ల కళ్లముందు పెట్టుకున్నారు.

మమ్మల్నిద్దర్నీ విడగొట్టి చినబాబుకి ఇంకో పెళ్లి చెయ్యాలని చాలా ప్రయత్నించేరు. అయితే, మా వోళ్లు నాకు దన్నుగా నిలబడేసరికి ఏవీ చెయ్యలేక ఊరుకున్నారు.

ఇంట్లో నా స్థానం పనిమనిషికన్నా ఏమీ మెరుగ్గా లేదు. కింద వంటింటి పక్క పాతగది ఒకటి మాకిచ్చేరు. చినబాబు ఇల్లంతా తిరగొచ్చుకానీ, నేను, నా పాప మెట్లెక్కి పైకెళ్లకూడదు. చినబాబు కూడా ఎప్పుడో రావాలన్పించినప్పుడు అరుదుగా నా గదికి వస్తూ ఉంటాడు. ప్రేమగా ఒకమాట పలుకు ఆడడు, పాపాయిని దగ్గరకి తీసుకోడు.

ఎంతో మంచిదన్పించే కాపమ్మ పిల్లిమీదో, కుక్కమీదో వంకపెట్టి ఎప్పుడూ నన్ను తిడతానే ఉంటుంది. కోట్లు కట్నం వచ్చే తన కొడుకు జీవితం నా మూలంగా నాశనమైనపోయిందంటుంది.

ఒకప్పుడు సొర్గం అనుకున్న ఈ ఇల్లు నాపాలిటికిప్పుడు పాతాళంలా ఉంది.

ఈ పది సంవత్సరాల్లో చినబాబు మధ్యల్లో వదిలేసిన చదువును పూర్తి చెయ్యలేకపోయేడు కాని, నేను మాత్రం లోకంతో బాటు జీవికకు పనికొచ్చే డిగ్రీలనూ ప్రైవేటుగా చదివేను. మా దళిత వాడ గ్రంథాలయం నుంచి మా అయ్య తెచ్చిచ్చే పుస్తకాలెన్నో చదివేను.

నేనిప్పుడు మనిషిని నాలుగుగోడల వెనక ఉన్నాను కాని నా మస్తిష్కం మాత్రం ప్రపంచమంతా విస్తృతమైంది.

ఈ భవంతిలో నా జీవితం నూతిలో కప్పకన్నా ఏమీ మెరుగ్గా ఉండబోదని నాకర్థమైంది. అందుకే ఒక నిర్ణయానికి వచ్చేను. నా పాప చేతిని పట్టుకుని చాలా కాలానికి ఆ సింహద్వారపు గడప దాటి బైటికొచ్చేను. ఇక పైన నేను ఆ పాతాళంలో పెద్దకాపు కోడలిగా, చినబాబు పెళ్లాంగా జీవించదల్చుకోలేదు. వార్థక్యంలో కూడా రెక్కలు ముక్కలు చేసుకుంటున్న మా అమ్మ అయ్యలకి నేనే ఆసరా కాదల్చుకున్నాను. నేనొక మంచి లాయర్‌గా పేదల పక్షాన నిలవాలనుకొంటున్నాను.

మూడంతస్తుల ఆ మేడవైపు, ఆ తోటలు, దొడ్లవైపు, ఆ కార్లు వైభవాల వైపు వెనక్కి తిరిగి చూడకుండా ముందుకే నడుస్తున్నాను... మా దళిత వాడ వైపు... ఒక చైతన్యం వైపు.... చైతన్యం లేని జీవితం శిలాసదృశం కదా!

☆

# మహిళలలో మణిమాణిక్యం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

**సమాజంలో మహిళలకు ఏవిధమైన గుర్తింపు లేని రోజులలో జన్మించింది మన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్. జూలై 15,1909న శ్రీమతి కృష్ణవేణమ్మ, శ్రీ రామారావు దంపతులకు దుర్గాబాయి జన్మించింది. స్వస్థలం కాకినాడ. దుర్గాబాయి తండ్రిగారు శ్రీ రామారావు ఒక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌ను "విక్టోరియా టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్" పేరుతో నడుపుతుండేవారు. కొన్ని వృత్తి విద్యా కోర్సులలో యువతకు శిక్షణ ఇస్తుండేవారు. దుర్గాబాయి చిన్నతనం నుంచే చాలా ఉత్సాహంగా ఉండేది. పాటలు పాడడం, గృహ అలంకరణ అంటే మక్కువ. దుర్గాబాయి తల్లి నుండి ప్రేరేపితురాలైనది. తల్లి వంట, ఇంటి పనులలో 24 గంటలు బిజీగా ఉండేది. స్త్రీలను గురించి అప్పడే అర్థం చేసుకుంది దుర్గాబాయి.**

దుర్గాబాయికి చిన్నతనంలోనే సుబ్బారావు అనే ధనికునితో వివాహమైంది. ఆమెది బాల్యవివాహం అని ఆమెకే గుర్తులేని పరిస్థితి. ఆమెకు వయసు వచ్చిన తర్వాత, నాలుగు గోడల మధ్య ఒక విలాసవంతమైన జీవితాన్ని కోరుకోలేదు. తన భర్తగారి జమీందారీ గిరిని తాను ఇష్టపడలేదు. తండ్రి చాలా విచారించారు తాను చేసిన బాల్యవివాహానికి. దుర్గాబాయి తల్లితండ్రుల సలహా, సహకారాలతో ఆ జమిందారీ బంధాల నుండి బయటపడింది. తల్లి సహాయంతో ఇంటి వద్ద ఉండి చదువుకున్నది. సామాజిక విషయాలను గురించి ఆలోచించేది. హిందీభాష నేర్చుకున్నది. ఆనాటి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులు దుర్గాబాయిని చాలా విచారానికి గురిచేశాయి.

1923లో అంటే దుర్గాబాయి తన 14వ సంవత్సరంలోనే 600 మందికి వాలంటీర్స్‌గా తర్ఫీదు ఇచ్చింది. ఆల్ ఇండియా కాంగ్రెస్ కాన్ఫరెన్స్‌ను కాకినాడలో నిర్వహించినపుడు, కాన్ఫరెన్స్ హాల్‌లోకి ఇతరులను ఎవరినీ రానీయకుండా ఉండే వాలంటీర్‌గా చేరింది. ఆ సమావేశానికి కొండా వెంకటప్పయ్యగారు కాంగ్రెస్ లీడర్‌గా ఉన్నారు. ఆ సందర్భంలోనే దుర్గాబాయి పండిట్ నెహ్రూను కూడా గేట్ పాస్ లేకుండా రానీయలేదు. మహాత్మాగాంధీ కాకినాడ వచ్చినపుడు ఆయనను దర్శించి, 2 నిముషాలు మాట్లాడే అవకాశం కల్పించమని కొండా వెంకటప్పయ్యగారిని అడిగింది. 2 నిమిషాలు గాంధీజీతో మాట్లాడే అవకాశం దొరికింది. దుర్గాబాయి మహాత్మాగాంధీతో సమావేశమై అనాటి సామాజిక దురాచారాలను, దేవదాసి పద్ధతిని, పరదా పద్ధతిని గాంధీజీ దృష్టికి తెచ్చింది. పలు విషయాలు చర్చించింది. వారి సంభాషణ సుమారు 2 గంటలు సాగింది. తర్వాత మహాత్మాగాంధీ పాల్గొనే అన్ని సమావేశాలకు, చేసే అన్ని ప్రసంగాలకు అనువాదకురాలు మన దుర్గాబాయి.



" The little ladies of Brindavan " అనే పేరుతో ఒక హిందీ స్కూల్‌ను స్థాపించింది. దానికి జమునాలాల్ బజాజ్ ఆర్థిక సహకారం అందించారు. ఈ స్కూలు ఆమె సామాజిక కార్యకలాపాలకు ఒక నిలయం అయింది. తరువాత దుర్గాబాయి స్వతంత్ర సంగ్రామంలో ప్రవేశించింది. మూడు పర్యాయాలు జైలు శిక్ష పడింది. బ్రిటీష్ వారి 'విభజించు- పాలించు' విధానాన్ని ప్రశ్నించింది. మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో 'ఉప్పు సత్యాగ్రహానికి' మద్రాస్ తరపున ప్రాతినిధ్యం వహించింది. టంగుటూరి ప్రకాశం, కె. నాగేశ్వరరావు పంతులు మొదలైన వారితో సహా జైలుకు వెళ్లింది. దుర్గాబాయి సుమారు 100 మంది సత్యాగ్రహులకు నాయకత్వం వహించింది. స్వరాజ్ కార్యాలయాన్ని ఏర్పరచారు. దానికి దుర్గాబాయి నాయకత్వం వహించింది. ప్రముఖులతో కలసి పలుమార్లు జైలుకు వెళ్లింది.

భారత రాజ్యాంగ సభను ఏర్పరచినపుడు దుర్గాబాయిని సభ్యురాలిగా ఎన్నుకున్నారు. సభా సమావేశాలకు ఎల్లప్పుడూ

**4,5 తరగతుల వరకు చదువుకొని, చదువు మానేసిన, అసలు చదవని బాధితులు, వితంతువులు, ఆధారితులు మొదలైన ఎందరో స్త్రీలు "ఆంధ్రమహిళా సభలో" చేరారు. దీనిని ఆధారం చేసుకొని త్వరగా విద్య నేర్చుకొని ధన సంపాదన చేసే విషయంలో స్త్రీలకు కోచింగ్ ఇవ్వడం జరిగింది. చిన్న వర్తకాలు, కుట్టుపని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, స్పిన్నింగ్, వీవింగ్, చేతితో పేపరు తయారీ, వెదురు చెక్కతో వస్తువుల తయారీ, చాపల అల్లకంలాంటి వాటిలో శిక్షణ ఇచ్చేవారు.**

హాజరయ్యేది దుర్గాబాయి. నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, గోపాలస్వామి అయ్యంగార్ మొదలైన వారు పౌరహక్కులు, నియమనిబంధనల గురించి ఆలోచించారు. ప్రపంచంలోని వివిధ రాజ్యాంగాలను గురించి విశ్లేషించారు. బి.ఎన్.రావు ఆధ్వర్యంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణ వ్రాతకు సారథ్యం వహించారు. రాజ్‌కుమారి అమృతకౌర్, రేణుక, దుర్గాబాయ్ స్టీరింగ్ కమిటీ మెంబర్స్ అయ్యారు. ఈవిడ కనీసం 750 సవరణలను సూచించారు. సంతానం, అనంతశయనం అయ్యంగార్ లాంటి మేధావులతో దుర్గాబాయ్ పనిచేశారు. సభా సమావేశాలలో దుర్గాబాయ్‌కి ప్రసంగించే అవకాశాలు ఎక్కువగా లభించాయి. ఆవిడ ప్రెసిడెంట్‌షిప్‌లోనే బెనారస్ విశ్వవిద్యాలయానికి ఎన్నో బిల్లులు మంజూరు చేశారు.

“ఆంధ్రమహిళా సభ”ను కొంతమంది సామాజిక కార్యకర్తలతో కలిసి దుర్గాబాయ్ 1937లో ఒక స్వచ్ఛంద సంస్థగా స్థాపించారు. మద్రాస్, హైదరాబాద్‌లలో ఈ సంస్థ తన ప్రత్యేక కార్యకలాపాలను నిర్వహించేది. బాలికలు, స్త్రీల విద్యాభివృద్ధికి ఈ సంస్థ స్థాపించబడింది. “Chintamani and I” అనే తన జీవిత కథలో దుర్గాబాయ్ “ఆంధ్ర మహిళా సభ పుట్టుక, దాని కొరకు తన ప్రయత్నాలు అన్నీ వివరించింది. ఆంధ్ర మహిళా సభలో స్త్రీల కార్యక్రమాలు, వయోజన స్త్రీలకు విద్య, ఉచిత కోచింగ్ ఇచ్చేవారు. మెట్రిక్యులేషన్‌కు, సెకండరీ స్కూల్ లెర్నింగ్ సర్టిఫికేట్ కోర్సుల్లో కూడా కోచింగ్ ఇచ్చేవారు. చాలామంది 4,5 తరగతుల వరకు చదువుకొని, చదువు మానేసిన, అసలు చదవని బాధితులు, వితంతువులు, ఆధారితులు మొదలైన ఎందరో స్త్రీలు ఈ సంస్థలో చేరారు. ఎంతోమంది చదువుకున్న స్త్రీలు తమ జీవనాధారాన్ని ఆలోచించి ఈ సంస్థలో చేరారు. దీనిని ఆధారం చేసుకొని త్వరగా విద్యనేర్చుకొని ధన సంపాదన చేసే విషయంలో స్త్రీలకు కోచింగ్ ఇవ్వడం జరిగింది. చిన్న వర్తకాలు, కుట్టుపని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, స్పిన్నింగ్, వీవింగ్, చేతితో పేపరు తయారీ, వెదురు చెక్కతో వస్తువుల తయారీ, చాపల అల్లకంలాంటి వాటిలో శిక్షణ ఇచ్చేవారు.

1942లో ఆంధ్ర మహిళా సభలోని విద్యార్థులు బెనారస్ యూనివర్శిటీలో మెట్రిక్ పరీక్షలు రాశారు. 90% ఉత్తీర్ణులైనారు. ఇంటర్‌ను మద్రాస్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసినారు. 1943లో ఇంటర్ క్లాసులలో 8 మంది విద్యార్థినులు చేరారు. తర్వాత కాలంలో ఆంధ్రమహిళా సభ ‘ఆంధ్ర మహిళ’ అనే ఒక మాసపత్రికను రూపొందించింది. తదుపరి 3 సంవత్సరాల కాలంలోనే సొంత ప్రెస్‌ను మద్రాస్‌లో స్థాపించారు. 1937, 1946 మధ్య ఎన్నో చిన్న సంస్థల ఏర్పాటు, అభివృద్ధి కార్యకలాపాలను ఈ సంస్థ చేపట్టింది.

1952లో హిందూ కోడ్‌బిల్ గురించి చర్చ జరిగింది. స్త్రీల అంతస్థు, వివాహం, స్త్రీల వారసత్వం, వరకట్న వ్యతిరేక చట్టాలు పార్లమెంట్‌లో చర్చకు వచ్చాయి.

దుర్గాబాయి మద్రాస్, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లలో ఎన్నో సంస్థలు స్థాపించారు. దుర్గాబాయి కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసినది 1953లోనే. స్వచ్ఛంద సంస్థలు ఎవరి స్పాన్సర్‌షిప్‌తోనైనా ముందుకు రావచ్చు, అభివృద్ధి చెందేలా చేయవచ్చు అని ప్రకటించారు. దానికి తమవంతు ప్రభుత్వ సహాయం ఉంటుందన్నారు. ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ఏర్పడ్డాయి. ఈనాడు అభివృద్ధిలో ఉన్న ఎన్నో సంస్థలు ఆనాడు స్థాపించబడినవే. ప్రణాళికా సంఘ సభ్యురాలిగా, ఆమె 40 మిలియన్ రూపాయలు కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు (CSWB) సమకూర్చారు.

సి.డి. దేశ్‌ముఖ్ గొప్ప ఆర్థికవేత్త, ప్రణాళికా సంఘ సభ్యుడు. దుర్గాబాయికి దేశ్‌ముఖ్‌తో పరిచయం ఏర్పడింది. దుర్గాబాయి, దేశ్‌ముఖ్‌ల వివాహం 22, జనవరి 1953లో జరిగినది. జవహర్‌లాల్ నెహ్రూ, సుచేతాకృపాలిని, దుర్గాబాయి అన్న నారాయణరావు, విజయలక్ష్మి పండిట్, ఇందిరాగాంధి వంటి ప్రముఖులు వివాహానికి హాజరయ్యారు. వారి వివాహ జీవితంలో ఒక్క చిన్న మాట తేడా లేకుండా జీవితాన్ని ఆనందంగా గడిపారు. ఇద్దరూ దేశ, విదేశాలలో అనేక ప్రభుత్వ కార్యకలాపాలలో పాల్గొన్నారు. దుర్గాబాయి ఐక్యరాజ్యసమితిలోని ఎన్నో కమిటీలలో సభ్యురాలుగా ఉన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్త్రీల ఆరోగ్యం, విద్య మొదలైన అంశాలలో ఎన్నో కోర్సులకు ప్రయత్నాలు చేశారు. మహిళావిద్య అని 5వ పంచవర్ష ప్రణాళికలో ప్రత్యేక సెక్షన్‌ను ఏర్పరచారు. 1959లో బాలికలు, మహిళల విద్యపై జాతీయ కమీషన్‌కి దుర్గాబాయి ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో, CSWB ఛైర్‌పర్సన్‌గా తన దృష్టి గ్రామీణ స్త్రీల సంక్షేమం పైనఉన్న విషయాన్ని నెహ్రూకు తెలియచేశారు. ఎన్నో పథకాలు ఏర్పాటు చేశారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్స్ ఎడ్యుకేషన్, నేషనల్ కమిటీ ఫర్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ (NCWET) మొదలైన వాటికి మొట్టమొదటి ఛైర్‌పర్సన్ దుర్గాబాయి. ఈ సంస్థలలో ఎన్నో సవరణలు, రికమండేషన్‌లు ప్రవేశపెట్టారు.

దుర్గాబాయి స్థాపించిన ఆంధ్రమహిళా సభ ఎన్నో పథకాలు, కోర్సులు ప్రవేశపెట్టింది. కాలానికి అనుగుణంగా టైప్, కంప్యూటర్ ఇతర వృత్తి విద్యా కోర్సులలో ఉచిత శిక్షణా సంస్థగా పేరుతెచ్చుకుంది.

దుర్గాబాయి తన జీవితమంతా స్త్రీల అభివృద్ధికి, ఎన్నో సంస్థల ఏర్పాటుకు, స్కీములకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. CSWB తో దేశంలోనే నేటికీ అందరి మనసులలో సాంఘిక సంక్షేమ స్కాలర్‌షిప్‌ల రూపంలో ఆమె గుర్తుండిపోతారు. ఎంతోమందికి ఈ విషయం తెలియదు. ఎస్.టి, ఎస్.సి, బి.సి. స్కాలర్‌షిప్‌ల రూపకర్త ఈవిడే. దుర్గాబాయి 1981 మే 9న ఈ లోకాన్ని వీడినా అందరి మనసులలో స్థిరంగా నివసించే ఆదర్శ మహిళ. అందుకు ఆవిడ పనులే తార్కాణం.

**మారుతున్న సమాజంలో ఉన్నత శిఖరాలనందుకుంటున్న నేటి ఆధునిక మహిళల స్థితి అనేకానేక సమస్యలమయంగా వుండడం శోచనీయం. ఈ నేపథ్యంలో సాక్షాత్తూ దుర్గాబాయమ్మే పూనుకున్నా సాధ్యపడదేమో! అందుకే ఆవిడ స్ఫూర్తితో ప్రతి మహిళా ఒక దుర్గాబాయమ్మ అయి స్త్రీ అభ్యున్నతికి, ప్రగతిశీలత్వానికి నడుంకట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అదే ఆవిడకు అచ్చమైన నివాళి.**

**- వై. సరోజ**



# గ్రామ రెవెన్యూ అధికారులు నిర్వహించ వలసిన విధులు

రెవిన్యు పరిపాలనలో గ్రామ రెవిన్యూ అధికారి పాత్ర అత్యంత కీలకము. గ్రామ స్థాయిలో రెవిన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేసే నిమిత్తం ప్రభుత్వం 8-2-2007 నుండి ప్రత్యేకంగా రెవిన్యూ విధులు నిర్వర్తించటానికై గ్రామ రెవిన్యూ అధికారుల వ్యవస్థను ప్రవేశపెట్టింది. గ్రామ పరిపాలనను, అనువైన, సమర్థవంతమైన రీతిలో నిర్వహించుటకు ప్రభుత్వం గ్రామ రెవిన్యూ అధికారుల విధులు (జి.ఓ.యం.యస్. నెం. 1059 రెవెన్యూ (గ్రామ పరిపాలన) శాఖ తేది: 31-07-2007 యందు నిర్ణయించడమైనది.

## గ్రామ రెవెన్యూ అధికారుల విధులు

### I. సాధారణ పరిపాలన / రెవెన్యూ విధులు

1. గ్రామ పాలన వ్యవహారాల రెవెన్యూ రికార్డులు, లెక్కలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించడం.

2. ప్రభుత్వానికి రావలసిన భూమిశిస్తు, సెస్‌లు, పన్నులు, ఇతర బకాయిలను వసూలు చేయడం.

3. సర్వే రాళ్ల తనిఖీతో సహా పంటలను నూరు శాతం అజమాయిషీ చేయడం.

4. ధృవపత్రాల జారీ: గ్రామ రెవెన్యూ అధికారులు సంబంధిత గ్రామాలలో ఈ దిగువ పేర్కొనబడిన ధృవపత్రాలను నియమబద్ధంగా జారీ చేయాలి.

### పహాణి / అడంగల్ ఎక్స్‌ట్రాక్టులు

5. అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, ఇతర విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల వంటివి సంభవించినప్పుడు సత్వరం ఉన్నతాధికారులకు తెలియచేయడం. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాలను అంచనా వేయడంలో రెవెన్యూ అధికారులకు సహకరించడం, సహాయాన్ని అందజేయడం.

6. అకస్మాత్తుగా వరదలు / ప్రమాదాలు సంభవించినప్పుడు సత్వర చర్య తీసుకొనే నిమిత్తం రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారాన్ని అందించడం.

7. గ్రామ సేవకుల వేతనాల బిల్లులు తయారు చేయడం

8. గ్రామ చావిడీల నిర్వహణ: ప్రభుత్వ భూములు, చెరువులు, చెట్లు, ప్రభుత్వానికి చెందిన ఇతర ఆస్తుల పరిరక్షణ. ప్రభుత్వ ప్రయోజనాలు కాపాడేందుకు గట్టి చర్యలు తీసుకోవడం.

10. నిధి నిక్షేపాలు, హక్కులు లేని ఆస్తుల గురించి ఉన్నతాధికారులకు సత్వరం సమాచారం అందజేయటం.

11. పురాతన కట్టడాల కూల్చివేత గురించి, శిలాశాసనాలు, స్మారక



చిహ్నాలు లభ్యమైనప్పుడు  తహశీల్దార్‌కు ఆ సమాచారం అందించాలి.

12. ప్రభుత్వ భూములు, ఇతర ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి.  గ్రామ రెవెన్యూ అధికారుల పరిధిలోని గ్రామాలలోనూ, పరిసరాల్లోనూ, ప్రజాప్రయోజనాలకు ఉద్దేశించిన రహదారులు, వీధులు, బహిరంగ ప్రదేశాల వంటి భూములు దుర్వినియోగం కాకుండా, నష్టపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి.

13. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనా, వాటికి నష్టం వాటిల్లినా సంబంధిత సమాచారాన్ని తహశీల్దార్‌కు తక్షణం తెలియజేయాలి. తదనంతర చర్యలు చేపట్టాలి.

14. రెవెన్యూ రికవరీ చట్టం క్రింద ప్రభుత్వ బాకీలు వసూలు చేసే నిమిత్తం సదరు బాకీదారుల ఆస్తుల వివరాల సేకరణ ప్రక్రియలో సంబంధిత అధికారులకు సహకరించాలి.

15. లీగల్ నోటీసులు, సమన్‌లు జారీ చేయడంలో అధికారులకు సహకరించాలి.

16. ప్రజలకు అవసరమైన సంఘటనలను తెలియచెప్పటానికి దండోరా, ఇతర పద్ధతులు అవలంభించాలి.

17. రుణాల వసూళ్లలో సహకరించాలి.

18. వారసులు లేని ఆస్తి స్వాధీనమైనప్పుడు పంచనామా నిర్వహించాలి.

19. ప్రభుత్వం జప్తు చేసిన ఆస్తులకు భద్రత కల్పించాలి.

20. ఓటర్ల జాబితాల తయారీ, నవీకరణ (అప్‌డేట్)లో సహకరించి, సవరణ చేయవలసినప్పుడు,  ఇతర ఎన్నికల విధులు నిర్వహించాలి.

21. తమ పరిధిలోని గ్రామ పంచాయితీలు నిర్వహించే సమావేశాలకు హాజరై, వాటి అభ్యర్థన మేరకు పింఛన్‌లు, అమలులో ఉన్న రేషన్ కార్డుల వివరాలు, ఇళ్ళ స్థలాల పట్టాల పంపిణీ, రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన ఇతర విషయాల సమాచారాన్ని అందజేయాలి.

22. ఎ.పి. ట్రాన్స్‌కో గ్రామంలో నిర్వహిస్తూ చేపట్టే విద్యుత్ పనుల నిర్వహణకు సహకరించాలి. గ్రామాలలో విద్యుత్ చౌర్యం, విద్యుత్ అక్రమ వాడకం గురించిన సమాచారాన్ని సంబంధిత విద్యుత్ అధికారులకు అందజేయాలి.

23. సంబంధిత అధికారి / ఉన్నతాధికారి ప్రకటన మేరకు కనీస వేతనాల చట్టం 1948 క్రింద వీరు ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరిస్తారు.

24. ఏ రెవెన్యూ అధికారి కానీ, జిల్లా కలెక్టర్, ఆర్.డి.ఓ. లేక తహశీల్దార్, నియమిత అధికారులు కానీ తనిఖీకి కోరినప్పుడు గ్రామ రెవెన్యూ అధికారి తాను నిర్వహిస్తున్న గ్రామ రిజిష్టర్లు, ఇతర రికార్డులు చూపాలి. పైన పేర్కొన్న విధంగా అధికారులు కోరితే తప్ప, ఆ రికార్డులను గ్రామ రెవెన్యూ అధికారులు తమ వ్యక్తిగత ఆధీనంలో భద్రపరచాలి.

25. బదలీ /సస్పెన్షన్/తొలగింపు /డిస్మిస్/పదవీ విరమణ / సెలవుపై వెళ్ళే సందర్భాలలో (క్యాజువల్ లీవ్ మినహా) అన్ని గ్రామ రిజిష్టర్లు, రికార్డులను అధికారికంగా నియమితులైన అధికారికి అప్పగించాలి.

## II. పోలీసు విధులు

1) హత్యలు, ఆత్మహత్యలు, అసహజ మరణాలు, గ్రామాలలో అశాంతి ప్రబలడానికి గల ఇతర ముఖ్య పరిణామాల గురించి పోలీసు శాఖకు సత్వరమే సమాచారం అందజేయాలి.

2) అనుమానస్పదంగా గ్రామంలో ప్రవేశించి సంచరిస్తున్న వారి గురించిగ, పోలీసులకు సమాచారం అందించాలి.

3) హింసాత్మక సంఘటనలను, ప్రజలకు గందరగోళం/ఇబ్బంది (న్యూసెన్స్) కలిగించే చర్యలను నిలువరించాలి. 4)



అపరాధులను గుర్తించి, న్యాయ రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి.

5) చోరీ సొత్తు కోసం సోదా నిర్వహించి, పోలీసు స్టేషన్‌లో అప్పగించాలి.

6) నేరానికి సంబంధించిన రుజువులను భద్రపరచాలి.

7) వారసులు లేని / ఎవ్వరికి చెందని సొత్తులను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో అప్పగించాలి.

### III. సామాజిక సంక్షేమం, అభివృద్ధి

1) ఇందిరమ్మ, ఇందిరప్రభ, ఇందిరా క్రాంతి పథం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సహకరించాలి.

2) దారిద్ర్య రేఖకు దిగువన వున్న కుటుంబాల వివరాల సేకరణలో సహకరించాలి. వారి ఆదాయ పరిమితిని అవరోహణ క్రమంలో జాబితాలు రూపొందించాలి.

3) బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమానికి సంబంధించి అవసరమైన పత్రాలు తయారుచేయడంలో, ఈ పథకం అమలుకు సహకరించాలి.

4) మహిళలు, పిల్లలపై జరిగే దురాగతాల గురించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. 24 గంటలలోగా చర్య తీసుకోవాలి.

5) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు వారిపై జరిగే అత్యాచారాల గురించి సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి, వారికి సహకరించాలి.

6) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారికి ఆలయ ప్రవేశం కల్పించడం ద్వారా అంటరానితనాన్ని నిర్మూలించాలి.

7) అంటువ్యాధులు ముఖ్యంగా మలేరియా, మెదడువాపు, అతిసారం వంటి వ్యాధులు ప్రబలినప్పుడు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తక్షణం తెలియజేయాలి.




8) గిరిజన గ్రామ అభివృద్ధి సంస్థల సమావేశాలకు హాజరై, సూక్ష్మ ప్రణాళికల తయారీ వాటి అమలుకు సహకరించాలి.

9) అక్షరాస్యత తరగతుల నిర్వహణలో సహకారం అందించాలి.

10) పంటల భీమా పథకం అమలుకు, పంటలను అంచనా కట్టడంలో తోడ్పాటును అందించాలి.

11) వ్యవసాయ కార్యక్రమాల అమలు, సమాచార విస్తరణకు చేయూతనివ్వాలి.

12) వ్యవసాయ గణాంకాలు తయారీలో సహకరించాలి.

13) విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నల్లబజారులో విక్రయిస్తున్నట్లు వంటి సమాచారాన్ని తక్షణం సంబంధిత అధికారులకు అందజేయాలి.

14) సహకార రంగం పరిధిలోని, వెలుపల గల చేనేత కార్మిక కుటుంబాలు, వారి ఆర్థిక స్తోమత వివరాలు సేకరణలో తోడ్పాటును అందించాలి.

15) చేనేత కార్మికులకు అవసరమైతే 'డిపెండెన్సీ' సర్టిఫికెట్లు జారీ చేయాలి.



16) వివాహ నిర్బంధిత రిజిస్ట్రేషన్ చట్టం 15/2002 ప్రకారం రాష్ట్రంలో జరిగే వివాహాలను తప్పనిసరిగా రిజిష్టరు చేయు నిమిత్తం తమ పరిధిలో నున్న గ్రామంలో, సముదాయంలో మ్యారేజ్ అధికారిగా వ్యవహరించటం.

### IV. ఇతరాలు

1. ప్రభుత్వం, భూ పరిపాలన శాఖ ప్రధాన కమీషనర్, కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దారు లేక అధికారం పొందిన ఏ ఇతర అధికారి అయినా అప్పగించిన విధులు నిర్వర్తించాలి.

***- బి. వెంకటేశ్వర రావు,***

*కన్‌సల్టెంట్, ల్యాండ్ సెల్*

# సూనృత వాక్యము మేలు చూడగన్....

మహాభారతం ఎంతో ప్రశస్తమైనది. ఎన్నో సూక్తుల సమాహారమది. ఉక్తి అంటే మాట. సూక్తి అంటే మంచి మాట. ఎప్పుడు మంచినే ఇతరులకి చెప్పాలి. ఇతరులు చెప్పేవి మంచి మాటలయితే తప్పక వినాలి. అలా అని మంచిని బోధించేవాడు పండితుడై ఉంటే ఇంకా మంచిది. ఎందుకంటే లోకంలో ఎందరో పండితులుంటారు. కానీ వాళ్ళంతా మన మంచిని కోరరు. మన మంచిని కోరే శ్రేయోభిలాషులూ ఉంటారు. కానీ వాళ్ళు పండితులు కారు. రోగాన్ని తగ్గించేదీ, రుచిగా ఉండేది అయిన ఔషధం దొరకడం ఎంత కష్టమో, మన మంచి కోరేవాడు తెలివిగలవాడై ఉండడం కూడా అంతే కష్టమని భోజప్రబంధం పేర్కొంటోంది. అలాగే హితమైన మాట మనసుకు రుచించదు. మనసుకి రుచించేదీ హితం చేయదు. 'హితం మనోహారి చదుర్లభం వచః' అన్నారు కదా.

ఈ విధంగా మంచి మాటలను గురించిన లోతయిన వివేచనను మన ప్రాచీనులు చేశారు. దీనికి కారణం ఏమంటే-- మంచి మాట చేసే మేలు అంతా ఇంతా కాదు. మాటల్లో చెప్పలేనిది. మంచి మాట జీవితాన్ని వెలిగిస్తుంది. అప్పటికే వెలుగుతున్న జీవితాన్ని మరింత ప్రకాశవంతం చేస్తుంది. ఆ మంచి వెలుగులో మరికొంత మంది కళ్ళు విచ్చుకొని చూసేటట్టు చేస్తుంది. అంతా మంచే జరుగుతుంది. అందుకే మన మొద్దు మెదళ్ళలో సూక్తుల్ని గిలక్కొట్టి మన ప్రవృత్తిని మార్చేందుకు బహుధా శ్రమించారు మన పండితులు. కవులు, కోటి ఆయుధాలు చేయలేని పనిని ఒకే ఒక మంచిమాట చేస్తుంది. వేలచేతులు సైతం తీయలేని దుఃఖాన్ని ఒక మంచి మాట తీసేస్తుంది.

**నుతజల పూరితంబు లగు నూతులు నూరిటి కంటె సూ**
**నృతవ్రత! యొక బావి మేలు మరి బావులు నూరిటి కంటె నొక్క స**
**త్కృతు వది మేలు తత్కృతు శతంబున కంటె సుతుండు మేలు త**
**త్సుత శతంబు కంటె నొక సూనృత వాక్యము మేలు చూడగన్**







మహాభారతంలోని ఈ ఒక్క పద్యం చాలు. మంచి మాటకున్న ప్రాధాన్యం తెలుసుకోవడానికి. తెలుసుకొన్న దానికి పదిమందికి తెలియజెప్పాలి. అది అందరికీ మంచిది.

వంద నూతుల కంటే మంచినీటితో ప్రజల దాహాన్ని తీర్చే ఒక బావి మేలు. అటువంటి వంద బావుల కంటె ఒక క్రతువు మేలు. అటువంటి క్రతువుల్ని వందల కొద్దీ ఆచరిస్తే వచ్చే ఫలితం ఒక్క కుమారుని వల్ల లభిస్తుంది. అటువంటి వంద మంది పుత్రులకంటె మేలయినది ఒకే ఒక్క సత్య వాక్యం. దాని ప్రభావం అనంతమయినది. సత్యమే లోకానికి హితాన్ని కలిగిస్తుంది. లోకతత్వాన్ని తెలియజెప్పేదే సత్యం అంటే. సత్య జ్ఞానవిహీనుడయిన మానవుడు అజ్ఞానంవల్ల దుఃఖాలను కొని తెచ్చుకొంటున్నాడు. సత్య వాక్పరిపాలన సులభం కాదు. ఆచరించి చూపిన ధన్యులు చరిత్రపురుషులయ్యారు. వారి జీవితమే అందరికీ ఆదర్శవంతం. ఇటువంటి పుణ్యపురుషుల చరిత్రల ఆధారంగా సూక్తులు పుట్టుకొస్తాయి. అందుకే వ్యాసభగవానుడు సత్ప్రవర్తన కల పంచపాండవుల పునీతమయిన చరిత్ర ఆధారంగా వందమంది కుమారుల దుష్కృత్యాన్ని బయటపెట్టే విధంగా సూక్తి సముద్రం లాంటి మహాభారతాన్ని రచించి, మానవజీవన గమనాన్ని మార్చే ప్రయత్నం చేశాడు. మంచి వైపునకు ఆకర్షించే మార్గాన్ని వేశాడు. తండ్రి మార్గంలో నడిచిన శుకమహర్షి చిలుకపలుకుల్లాంటి మంచి మాటలతో భాగవతకథనం చేసి తద్వారా సూక్తిమాధుర్యాన్ని పరీక్షిన్మహారాజుకు అందించాడు. వీరి మార్గంలోనే సూతమహర్షి శౌనకాది మహామునులకు, వైశంపాయనుడు జనమేజయమహారాజుకు, శ్రీకృష్ణుడు పార్థునికి, భీష్మాచార్యుడు ధర్మరాజుకి ఇలా ఎందరో నాటినుండీ నేటిదాకా ధర్మసూక్ష్మాలతో కూడుకొన్న సూక్తుల్ని ప్రవచిస్తూ మానవులకు ఆనందాయకమయిన మార్గాన్ని చూపించారు. ఇక చరిత్రలోకొస్తే బుద్ధుడు, కౌటిల్యుడు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణమహర్షి వంటి ఎందరో సత్పురుషులు లోకోపయోగమయిన సూక్తిదుందుభుల్ని విశ్వవీథుల్లో మ్రోగించి జనజాగృతికి నాంది పలికారు. ఇంకా ఉపన్యాసకేసరులు కవిపుంగవులు, తమకు తోచిన రీతిలో మంచిని బోధించడం ద్వారా మానవవికాసానికి పాటుపడుతున్నారు. మంచిని పెంచి, మంచినే వచించి, మంచినే ఆచరించే వారికెప్పుడూ మంచే జరుగుతుందనే మంచి మాటను మనసులో పెట్టుకొని సత్ప్రవర్తనతో మెలగడం అందరికీ మంచిది.

**- అద్దంకి శ్రీనివాస్**

# రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు

## 19.5.2010న జరిగిన మంత్రివర్గ సమావేశంలోని కొన్ని ముఖ్య నిర్ణయాలు

- కోస్తా ప్రాంతాన్ని ముంచెత్తనున్న పెను తుఫాను "లైలా" పై మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా చర్చించింది.
- ఇప్పటికే అప్రమత్తతతో ఉన్న పాలనా యంత్రాంగం తుఫానును ఎదుర్కోవడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిగారు ఆదేశించారు.
- మంత్రులంతా సీనియర్ అధికారులతో కోఆర్డినేట్ చేసుకుని జిల్లాలకు తరలి వెళ్ళాలని ముఖ్యమంత్రిగారు కోరారు.
- సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించడానికి అవసరమయిన అన్ని రకాల చర్యలు వెంటనే తీసుకోవాలి. అవసరమైతే పోలీసు ఇతర బలగాల సహకారాన్ని తీసుకునైనా తరలించాలి.
- ప్రమాదం ఉన్న అన్ని ప్రాంతాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి 24 గంటల కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ సిబ్బందికి ఈ నెల 25 వరకు, అవసరమైతే ఆ పైన సెలవులు రద్దు చేయాలి.
- వాతావరణ పరిస్థితులు, తుఫాను ప్రభావం గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచార వ్యవస్థల ద్వారా తెలియపరచాలి. వారిని తగిన జాగ్రత్తలు తీసుకునేటట్టు అప్రమత్తం చేయాలి.
- తుఫాను 25వ తేది తెల్లవారు జామున ఒంగోలు - విశాఖ మధ్య తీరం దాటుతుంది.
- దీని ప్రభావం వల్ల ఈ రోజు సాయంత్రం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయి. 48 గంటల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయి.
- 20వ తేది తెల్లవారు ఝామున 95 నుంచి 155 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.
- తమిళనాడుతో పాటు ఆంధ్రా కోస్తా, ఉత్తర కోస్తా అంతటా అతి భారీ వర్షాలు కురుస్తాయి.
- ఇప్పటికే నేషనల్ డిసాస్టర్ ప్రొటెక్షన్ ఫోర్స్ కోస్తా తీరంలో రంగంలోకి దిగింది.

### ప్రాథమిక ఆరోగ్యవ్యవస్థ పటిష్టీకరణ

- రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పటిష్ట పరిచే ప్రతిపాదనల ఆమోదము.
- ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పలు సంస్కరణల ద్వారా పటిష్ట పరుస్తారు.
- కమ్యూనిటీ హెల్త్ అండ్ న్యూట్రిషన్ క్లస్టర్ బేసిక్ హెల్త్ యూనిట్‌గా ఉంటుంది.
- ఒక్కో క్లస్టర్‌లో 4 నుంచి 10 ప్రైమరీ హెల్త్ సెంటర్‌లు ఏరియా హాస్పిటల్ లేదా క్లస్టర్ హాస్పిటల్ నెట్‌వర్క్‌లో ఉంటాయి.
- క్లస్టర్ హాస్పిటల్ రిఫరల్ సర్వీసెస్‌ను అందిస్తుంది.
- ప్రజలందరికీ ప్రైమరీ హెల్త్ కేర్ సమర్థవంతంగా అందించడానికి ఆషా, సబ్ సెంటర్, పి. హెచ్. సి ల సర్వీసులు రేషనలైజ్ చేస్తారు.
- దీనికనుగుణంగా స్పెషలిస్ట్స్, డాక్టర్స్, స్టాఫ్ ను రీపాజిషనింగ్ చేస్తారు.

### ఆర్.టి.సి- ప్రభుత్వ గ్యారంటీ

- నేషనలైజ్డ్ బ్యాంక్స్ నుంచి రెండు విడతల్లో లో రు. 200 కోట్ల వంతున రు.400 కోట్ల అప్పు తీసుకోవడానికి ఎ.పి.ఎస్. ఆర్.టి.సి కి ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చే ప్రతిపాదనలు ఆమోదం.

  2010-11 వరకు సహకారానికి ప్రభుత్వం ఇవ్వాల్సిన కన్‌సెషనల్ బస్ పాసెస్ బకాయిల క్రింద ఈ మొత్తాన్ని తరువాత అంద చేస్తారు.
- గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో 5.44 ఎకరాల ప్రభుత్వ భూమిని 132/33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించే ప్రతిపాదన ఆమోదం. మార్కెట్ విలువ ప్రకారం రూ. ఒక ఎకరాకు లక్ష చొప్పున చెల్లిస్తారు.
- విజయనగరం జిల్లా కోమరాడ మండలంలో థర్మల్ పవర్ ప్లాంట్‌నిర్మాణం కోసం 640.75 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించే ప్రతిపాదన ఆమోదం. కోమరాడ, కోటిపామ్, పెదకార్జల, రేగులపాడు, శివరాంపురం గ్రామలలో ఈ భూమి ఉంది. న్యూఢిల్లీకి చెందిన అల్ఫా ఇన్‌ఫ్రా ప్రోపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ 2640 ఎమ్.డబ్ల్యు థర్మల్‌పవర్ ప్లాంట్ నిర్మిస్తుంది. అక్కడి మార్కెట్ విలువ ప్రకారం రేటు చెల్లిస్తారు.
- తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న బార్బర్లు / టన్‌సురర్ల పదవుల సంఖ్యతో సమానంగా గ్రేడ్-1 10, గ్రేడ్-2 20, ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలు ఆమోదం. మిగిలిన బార్బర్లు / టన్‌సురార్లు అందరికీ గ్రేడ్ 3 హోదా కల్పిస్తారు. సాలీనా అయ్యే ఖర్చు: రూ. 1.32 లక్షలు
- స్టేట్ ఎలక్షన్ కమీషన్ స్టేట్ ఎలక్షన్ కమీషన్‌లో కొన్ని ఉద్యోగాల పేర్లు మార్పు చేసే ప్రతి పాదనలు ఆమోదం.

6 మంది సీనియర్ అసిస్టెట్ పోస్టులను అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్/ అసిస్టెంట్ డెస్క్ ఆఫీసర్స్, 2 జూనియర్ అసిస్టెంట్స్ పోస్టులను టైపిస్ట్-కమ్-అస్టిస్టెంట్స్ పోస్టులుగా, 3 టైపిస్ట్ పోస్టులను డాటా ఎంట్రీ ఆపరేటర్స్ మారుస్తారు. రాజభవన్ అకౌంట్స్ రాజభవన్‌లో అకౌంట్స్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించి, పర్యవేక్షించడానికి మూడు ఉద్యోగాల నియామక ప్రతిపాదన ఆమోదం. అకౌంట్స్ ఆఫీసర్స్, సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్ లను నియమిస్తారు.

## 5-6-2010న జరిగిన రాష్ట్ర మంత్రి సమావేశపు నిర్ణయాలు

ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్యగారి అధ్యక్షతన జూన్ 5 ఉదయం 11-30 గంటలకు సమావేశమైన రాష్ట్ర మంత్రి వర్గం గిరిజన

ప్రాంతాల్లో 2151 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ, 'ఇందిరమ్మ ఇళ్ళ' నిర్మాణం పై పలు కీలక నిర్ణయాలకు తీసుకున్నది.

ఈ నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీమతి డా॥జె.గీతారెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ముఖ్య నిర్ణయాలు..

గిరిజన ప్రాంతాల్లో ముఖ్యంగా గిరిజన మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి వీలుగా 2151 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే ప్రతిపాదన ఆమోదం. దీని కోసం ప్రత్యేక డిఎస్సీ నిర్వహిస్తారు.

## గృహనిర్మాణం

గత ఎన్నికల ముందు ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళకు 'మంజూరు' అనుమతించే ప్రతిపాదన ఆమోదం. అయితే, వీటి అర్హతను కూలంకషంగా పరిశీలించి మంజూరు చేస్తారు. ఇటువంటివి దాదాపు ముడు నుంచి నాలుగులక్షలు ఉంటాయని అంచనా ఒక్కో యూనిట్‌కు రూ. 54,250/- అందజేస్తారు.

## లోక్ అదాలత్‌లు

- రాష్ట్రంలో మూడు సంచార లోక్ అదాలత్‌ల ఏర్పాటు ప్రతిపాదన ఆమోదం
- రంగారెడ్డి, కడప, విశాఖ జిల్లాల్లో ఈ సంచార లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.
- వీటికి అవసరమయ్యే మూడు వాహనాలు, సిబ్బందికి దాదాపు రూ.27 లక్షలు మంజూరు ప్రతిపాదనలు ఆమోదం.
- మొదటగా మూడు ప్రాంతాల్లో పైలట్ ప్రాజక్టులుగా వీటిని ఏర్పాటు చేస్తారు.
- ప్రజలకు ఖర్చు లేకుండా, సమయం వృథా కాకుండా వారి ముంగిట న్యాయాన్ని అందించాలన్నదే ఈ ప్రాజెక్టు ముఖ్యోద్దేశం.
- ఒప్పందం ద్వారా, పార్టీలను రాజీకి వచ్చేట్లు చేయడం ద్వారా కేసులను పరిష్కరించడం. గ్రామాల్లో స్నేహపూరిత వాతావరణం కల్పించడం ప్రధానోద్దేశ్యం.

## భూములు

- రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి గ్రామంలో కేటాయించిన భూమికి బదులుగా పది ఎకరాల మరొక భూమిని షేక్‌పేట్ మండలం, గ్రామంలో దిల్ కు కేటాయించే ప్రతిపాదన ఆమోదం.
- సమీకృత టౌన్‌షిప్ నిర్మాణకోసం దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ (దిల్) కు ఎకరాకు రూ. 11.61 కోట్ల వంతున కేటాయిస్తారు
- రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం నెక్కంపూర్ గ్రామంలో 55 ఎకరాలు, షామీర్ పేట్ మండలం జవహరనగర గ్రామంలో వంద ఎకరాల ప్రభుత్వ భూమిని సెక్రటేరియట్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీకి కి అప్పగించే ప్రతిపాదన ఆమోదం.
- ఈ భూమి ను అప్పగించిన తేదీలు 20-3-2003, 19.07.2005న నిర్ణయించిన ధరల ప్రకారం వసూలు చేస్తారు.
- మెదక్ జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం, బొంతపల్లిలో ఉన్న ఫార్మస్యూటికల్ కంపెనీలు పూర్తిగా పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ బెల్ట్ పెంపొందించేందుకు మార్కెటు ధరలపై అవసరమైన ప్రభుత్వ భూముల కేటాయింపు ప్రతిపాదనలు ఆమోదం.

హెటెరో ల్యాబ్స్‌కి 19.31 ఎకరాలు

సిరెక్స్ ఫార్మాకి 5 ఎకరాలు

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 11 సెంట్ల ప్రభుత్వ భూమి కేటాయింపు ప్రతిపాదన ఆమోదం. చదరపు గజం రూ. వెయ్యి వంతున కేటాయిస్తారు.
- నెల్లూరు జిల్లా వెంకటగిరి మండల బొప్పాపురం గ్రామంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణ కోసం 7.74 ఎకరాల ప్రభుత్వ భూమి ఉచితంగా పై కేటాయించే ప్రతిపాదన ఆమోదం.
- రాష్ట్ర కేడర్ లో 33 ఫారెస్ట్ అసిస్టెంట్ కన్సర్వేటర్ పోస్టులను ను డిప్యూటీ కన్సర్వేటర్ స్థాయికి అప్‌గ్రేడ్ upgrade చేసే ప్రతిపాదన ఆమోదం.
- దీనికి అయ్యే ఖర్చు : సాలీనా రూ. 6.15 లక్షలు
- అదే విధంగా,పశుసంవర్ధక శాఖలో నాన్‌కేడర్ స్పెషల్ సెక్రటరీ పదవి ఏర్పాటు ప్రతిపాదన ఆమోదం.
- వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆరు ఉద్యోగ నియామక ప్రతిపాదన ఆమోదం.
- వీటిలోఒక ప్రొఫెసర్ 2 అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఉన్నాయి.

సాలీనా ఖర్చు రూ.53 లక్షలు.

- గత నెలలో సంభవించిన లైలా తుపాను వల్ల జరిగిన నష్టాల మరమ్మత్తులు, సహాయ పునరావాస కార్యక్రమాల కోసం రూ. 1357.42 కోట్లు సహాయం అందించాలని కేంద్రానిన కోరుతూ మెమోరాండం సిద్ధమయ్యింది.
- జాతీయ విపత్తుల కంటెంజెన్సీ ఫండ్‌నుంచి ఈ నిధులు అందించాలని కోరనున్నారు.
- నష్టాల తాత్కాలిక మరమ్మత్తులు, ఇతర కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 396.41 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చింది.
- ఈ తుఫాను వల్ల రాష్ట్రంలోని అన్ని రంగాలకు సంబంధించి సంభవించిన నష్టం అంచనా రూ. 1603.22 కోట్లు.
- దీని వల్ల 22 మంది మృతి చెందారు.
- ఆరుగురు గాయపడ్డారు.
- 1.20 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- 377 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- 14 జిల్లాలో 153 మండలాల్లో 985 గ్రామాల్లో 17.80 లక్షల జనాభాకు తుఫాను నష్టం ప్రభావం చూపింది.

***- అదపాక సత్యారావు***

అదనపు సంచాలకులు సమాచార శాఖ

# ఫీచర్ వ్యాస వ్యాసులు అను కాలమిస్టులు

***అ**ణువులో అనంత విశ్వాన్ని దర్శించగలవారు మాత్రమే ఫీచర్ వ్రాసి నెగ్గగలరు. అల్ప విషయంపై అనల్పంగా చర్చించగల చతురత వుండాలి. తెలుగుదేశంలో అలాంటివారు ఎందరో వున్నారు. వారిలో కొందరి ఫీచర్ రచనలను అనుకరిస్తున్నాను యీ పేరడీలో -*

*కృష్ణానది పుష్కరాలు వచ్చినప్పుడు -ఒక్కొక్కరి కలం కదలికలు ఎలా వుంటాయో ఊహించి ఈ పేరడి వ్రాయడం జరిగింది.*



## ప్రముఖుల ప్రేమలేఖలు

**ఈ పేరడీలోని ప్రముఖులంతా వారి జీవితాల్లో ప్రేమలేఖలు రాశారో లేదో నాకు తెలియదు. వారి మీద నాకున్న యెనలేని అభిమానం కొద్దీ వొకవేళ వారు రాసి వుంటే యెలా వుండేవి అని వూహించి ఈ పేరడీ రాయడం జరిగింది. ప్రసిద్ధ రచయితల్ని పదే పదే పలు విధాలుగా స్మరించడానికి వారి పట్ల నాకు గల అభిమానమే కారణం. ఈ విషయాన్ని మిగతా అభిమానులు కూడా గమనించగలరని ఆశిస్తున్నాను.**

### గిరి కుమారుడు

ఇది విశ్వనాథ వారి కలం పేరు. వారి రచనా పాటవం వల్ల వారికి గల ఆత్మవిశ్వాసాన్ని స్వోత్కర్షగా అపార్థం చేసుకున్నవారు వున్నారు. విశ్వనాథ ప్రేమలేఖ రాసినా తనని తాను తగ్గించుకోవడం జరగదు.

*బాలామణీ!*

*ఆశీః*

నిన్ను జూచితిని తదాది ఆలోచనలన్నియు నీ చుట్టూ పరిభ్రమించును. వదలి వచ్చుటకవి మొరాయించుచున్నవి. నావంటి వాని మనస్సు సైతము బందీకృతమొనర్చిన నీదగు రూప లావణ్యములు అసామాన్యమే అయి వుండవలె.

మునుపే సరస్వతి నన్ను వరించెననుట లోక విదతము. అందులకై ఎందరు ఈర్ష్యబడిరో, బడుతుండిరో - అది వేరు విషయము. నేటివరకు రసభంగం కలగకుండ నెటో కాలము వెళ్ళదీయుచుంటిని. సరస్వతికి రసభంగము వాటిల్లిన 'సవతి' యగును కదా! సవతిపోరు కొని తెచ్చుకొనుటకు యే పురుషుడు మాత్రము ఇచ్చగించును? నేను వెర్రివాడను కాను. సాహిత్యమున సముద్రుడులాంటి వాడనని లోకము అంగీకరించిననూ లేకున్ననూ నేను భావింతును. ఈవు కిన్నెరసానివి. ఇక నేమి గావలె.




నా మనము నీపై నిడుట నీ యదృష్టము. కుంకుమ శోభితమైన నీ నొసట... కుంకమయనిన జ్ఞప్తికి వచ్చును. కాశ్మీర దేశము కుంకుమ పూలకు బ్రసిద్ధి. పుష్పాడులు తెమ్మెరలపై దేలుచూ అరుణోదయ మేదియో, మధ్యాహ్న మేదియో పసిగట్టనలవి గాకుండ సేయును. కుమ్ యను శబ్దము జేయుచు ఆ మొగ్గలు విచ్చుకొనును. అందుకే యది కుంకుమ యైనది. కాశ్మీర కుంకుమలో పదియారు వన్నెలున్నవి. వన్నెకొక ప్రత్యేకత గలదు..."

*(ఇలా సాగే వీరి ప్రేమలేఖకు జవాబు వస్తుందంటారా?)* ☆

### అడివోరి చిన్నోడు

**అడివి బాపిరాజుగారి రచనల్లో ఐశ్వర్యం, ఆదర్శాలు తొంగి చూస్తుంటాయి. ఆ బాణీ వారి ప్రేమలేఖకు మాత్రం వర్తించదని ఎక్కడుంది?**

*సౌభాగ్యవతి శశికళకు,*

అడివి బాపిరాజు శుభాకాంక్షలతో వ్రాయుట. మా వకిలు గారైన ఆదిభట్ల హరినారాయణ మూర్తి గారింటిలో మిమ్ములను చూచియుంటిని. ప్రథమ వీక్షణముననే మీ రూపము నన్నాకట్టుకున్నది. జపాన్ దేశపు సుందరాంగులను చూచియుంటిని గాని వారు స్ఫురద్రూపులు కారు. ఎత్తులో కొంత తగ్గుదురు.

శశికళ యనిన రాజా రవివర్మ చిత్తరువు వలె కమనీయమని నా యూహ.

మీరు శాస్త్రీయ సంగీతమును దీక్షితులు గారి శిష్యరికమున సాధన చేసి యుండిరని వకీలుగారు చెప్పిరి. దీక్షితులు గారి గాత్ర సంగీతమనిన నేను చెవి కోసుకొందును. ఆలాపనమున వారి బ్రత్యేకత కనిపించును. ముఖ్యముగా శ్యామల రాగము మిక్కిలి మనోరంజకముగా నుండును.

మీ విషయము మా తల్లిగారితో సంప్రదించవలెనని నిశ్చయించుకొంటిని. ఆమె మన వివాహమునకు తప్పక అంగీకరించునని నా నమ్మిక. రాబోవు కోడలి కోసమై ఆమె ఇరువది నాలుగు క్యారెటుల మేలిమి బంగారముతో వొడ్డాణము చేయించి యుంచినారు. అది తూకమున ముప్పది శౌరీలు తూగును. గజ్జల పతకము గలదు. నడుమేలేని



ఈ కోడలు దీనినెట్లు ధరించునాయని అత్తగారు నిరుత్సాహపడవల సియున్ననూ యెట్లో వొప్పింప యత్నింతును. ఇక బులాకీలు, మక్కెరలు మీ నాసికకు బరువుచేటే కదా! ప్రదానపుటుంగరమునకు మంచి ముత్యము వేయించుట మా ఇంటి రివాజు....”

*(ఇలా సాగి వారి ఆచారాలు, అనువాయితీలు చెప్పి ముందే ఆమెని భయపెట్టి విరహ ప్రేమికుడుగా మిగిలిపోయే అవకాశం ఎక్కువగా వుంది.)*

☆

## ముని- మాణిక్యం

**మునిమాణిక్యం నరసింహారావు గారి కాంతం కథలు సంసారంలోని సరిగమల్ని వినిపిస్తాయి. పెళ్ళికి ముందు ప్రేమలు వీరికి అట్టే తెలియవు. వీరిదంతా సంసారపక్షం -**

*ప్రియమైన కాంతానికి,*

శుభాశీస్సులతో వ్రాయు లేఖాంశములు. ఉభయకుశలోపరి. నీవు వ్రాయించిన జాబు అందినది. సంగతులు తెలిసినవి. ఎదురింటి మీనాక్షికి మళ్ళీ ఆడపిల్లే! ఈ విషయం నీకు సంతోషం కలిగించగలదని తెలుపడమైనది. మీ జానికమ్మ పిన్ని గారింట్లో అంతా కులాసాగానే వున్నారు. కనకమహాలక్ష్మి నీ రాకకు ఎదురు చూస్తున్నది. వారి పెద్ద అమ్మాయికి సీమంతం చేస్తారట. నువ్వు చెప్పిన ప్రకారం పనిమనిషి దగ్గరున్న పెద్ద దబరాగిన్నె తెప్పించాను. పాత కాగితాలవాడు అమ్మ గారు ఎప్పుడొస్తారని రోజూ వాకబు చేస్తున్నాడు.

నువ్వు మడిగా కాక విడిగా చిన్న జాడీలో తీసి వెళ్ళిన అవకాయ అయిపోయింది. నువ్వు వెళ్ళినప్పటినుంచి అదేకదా ఆధరువు? మరి పెద్ద జాడీలోంచి తీసుకోమంటావా? ఏ సంగతి జాబు వ్రాయించ వలెను. వచ్చే తదియా గురువారం దివ్యంగా వుంది. ఒక వేళ నువ్వు బయలుదేరితే ప్రయాణంలో జాగ్రత్త. మన బందరు రైలుస్టేషన్‌లో నువ్వు కాపరానికి వచ్చినప్పటి నుంచి గుర్తుగావున్న రావిచెట్టుని మొన్నీ మధ్య నరికి పోగులు పెట్టారు. మరి నువ్వు స్టేషను ఎట్లా గుర్తుపడతావోనని బెంగగావుంది. నీ నోట్లో మాట దాగనట్లే మన పెద్ద బాల్చీలో నీళ్లు ఆగడం లేదు. నువ్వు రాగానే మాటు వేయిద్దాము...”

☆



## తిలకామృతం

**అమృతజల్లు లాంటి తిలక్ కవితల్లో సామాజికస్పృహ కంటె సౌందర్య స్పృహ యెక్కువ. కొద్దిపాటి అస్పష్టత వారి కవితారీతికి అదనపు అలంకారం.**

*“మానవ ప్రియా!*



మీ ప్రతి అణువులోను నవ్య శిరీష మృదుత్వం ఏదోవుంది. సముద్రపు టంచున నిశ్శబ్దంగా మిగిలిపోయే కెరటపు నురగలా మీరు లేని మీ సన్నిధిలో నేను... నిన్న కలత నిద్రలో మంచి కలగన్నాను. కల నిండా అందెల రవళులు, జూకామల్లె తీగెలు, వెన్నెల మడుగులు, అంగన రమ్య చేలపు కొసలు వెన్నెలలో జీరాడడమూ, వాదగలేని పైట వొత్తిగిలడమూ, పున్నమి ఆమె అడుగులకు మడుగు లొత్తడమూ - కవికి రసవంతంకాక మరేమిటి? ఆ స్వప్నసుందరి ని మీరుగా గుర్తించి నిట్టూర్చిన జ్ఞాపకం.

మీ గురించి కలిగే ప్రతి ఊహకు మౌనభాష్యాలు రచించుకుంటూ ఎన్నాళ్ళిలా మధుర వేదనా స్రవంతిలో ఈదులాడాలో? సౌందర్య సహృదయాలు సమ్యక్ స్వరంలా మేళవించి అది మావిచిగుళ్ళను చీల్చుకువచ్చే కోయిల పాటగా నా గుండె కింద సెగ అయినప్పుడు పైకి పెగిలిరాని అవ్యక్త ప్రేలాపన, దాని భావం చెబితే మిగిలేది శూన్యమే సుమా! పోనీ ఈ నిశబ్ద ఘోషను ఎన్నాళ్ళు ఇలా భరించమంటావో నువ్వే శాసించు దేవీ! అదైనా చాలు కొంత ఊరట. గడిచిన సాయం పొద్దులు వాడని జాజిపూలు, కాదనగలరా...?

*(తిలక్ సఫలుడు కావచ్చునా...?)*

☆

## పాత్రికేయుని ప్రేమవార్త

**వృత్తి రీత్యా జర్నలిస్టులు కొన్ని పదాలకు అలవాటు పడి ఆ పరిధిలోనే వుండిపోవడం తప్పనిసరి అవుతుంది. ఏ విషయాన్నైనా తేల్చి చెప్పకపోవడం తమ మీద బాధ్యత పెట్టుకోకుండా జాగ్రత్త పడడం వారి విధి నిర్వహణలో వొక భాగం కనుక ప్రేమలేఖలోనూ అదే ధోరణి...**

ప్రేయసికి ఒక విజ్ఞప్తి

విజయవాడ జూలై 1

*శ్రీమతి / కుమారి విజయలక్ష్మి గారికి,*

ఇటీవల లబ్బీపేట ప్రాంతంలో సాయంత్రం సుమారు ఆరు గంటల వేళ మిమ్మల్ని చూడడం తటస్థించింది. ఎర్ర చుక్కల తెల్లచీర కట్టుకున్న మీరు ఆ రోజు చాలా అందంగా వున్నట్లు నేను భావించలేక పోలేదు. మీరు డాక్టరుగారి రెండో అమ్మాయని అభిజ్ఞవర్గాల ద్వారా తెలియ వచ్చింది.

కాగా మిమ్మల్ని చూసినప్పటి నుంచి మనసు పరిపరి విధాల పోతోంది.



ఇది ఒక వేళ ప్రేమభావన అయినా కావచ్చు.

పోతే నా వివాహం చేయాలనే ధృడ సంకల్పంతో మా తల్లిదండ్రులు వున్నట్లు, అందుకుగాను వారు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు, ఇటీవల వెల్లడైంది. కనుక, మీకు ఆమోదయోగ్యమైతే అద్యతన భావిలో మన వివాహం జరుగగలదని, ఇది విఫలం కాబోదని ఆశిస్తున్నాను. అన్యధా భావించడానికి అస్కారం లేదు కాబట్టి మీరు మీ అభిప్రాయాన్ని నిష్కర్షగా తెలుపగలరని విశ్వసిస్తున్నాను."

*(ప్రేమ సఫలమైందా? ఆమె జవాబు రాసిందా? అనేది వివరాలకు వచ్చేవారం వార్తల్లో చూడాల్సిందే.)*

☆

## తాపీ వ్రాతలు

**ఏ విషయాన్నైనా సమగ్రంగా సోదాహరణంగా చర్చిస్తే కాని తాపీ ధర్మారావుగారికి తోచదు - వారిది భౌతికవాదం.**

*"సుభద్రా!*



నిన్ను చూడగానే హృదయోల్లాసం కలిగినమాట వాస్తవమే అయినా కొన్ని విషయాలను ముందుగా చర్చించడం అవసరం. ఆనూ పానూ తెలుసుకోకుండా అమాయకంగా ప్రవర్తించడ మనేది నవీన శతాబ్దంలో కూడా జరగడం హాస్యాస్పదనం. అంద చందాలను వర్ణించుకుంటూ ఊహాలోకాల్లో విహరించడం స్త్రీ పురుషులిద్దరికీ శ్రేయస్కరం కాదు. జీవితాలను పరస్పరం పంచుకోబోయే ముందు ఇద్దరి మధ్య సరైన అవగాహన అవసరం. ఈ విషయాలను నా 'జొన్నకర్ర' అనే వ్యాసంలో సమగ్రంగా చర్చించాను.

మనుష్యులలోనే కాదు, అన్ని జీవరాసులకు జత గూడడం అనే ఉద్రేకగుణం వుంటుంది. చివరకు సీతాకోకచిలుకల్లో కూడా ఈ జతకట్టడం అనేది వుంది. ధ్రువ ప్రాంతంలో వుండే పెంగ్విన్ పక్షుల వలపు సంకేతాలు ప్రేమ భాషలు విచిత్రంగా వుంటాయి. (చూ: నా 'పెళ్ళి దాని పుటు పూర్వోత్తరాలు.) జీవితం లౌకికపరమైన విషయాలతోనూ లైంగికపరమైన కోరికలతోనూ ముడిపడి వుంటుంది. నేటి యువతీ యువకులు ప్రేమ అనేది వో అతీంద్రియ లౌకిక అనుభూతి అని భ్రమపడుతున్నారు. కాని, ప్రేమ అనేది పూర్తిగా కామ పరమైంది కానప్పుడు పురుషుడు స్త్రీనే ఎందుకు ప్రేమించాలి? వివరాలకు నా 'కొత్తిమీర' వ్యాసం చదువు.

మెసపొటేమియాలో యువతీ యువకుల కామకలాపాలు చాలా వింతగా వుంటాయి.

☆

## చివరకు మిగిలిన లేఖ

**బుచ్చిబాబు గారి నవలలో తాత్త్విక చింతన, రసదృష్టి, కథని డామినేట్ చేయడం పరిపాటి. ఏమయినా కాల్పనిక సాహిత్యంలో ఆయన నిధి. వారి శైలి ఇలా వుంటుంది.**



*డియర్ కోమలీ!*

మనసులో కలిగే భావాలనీ, వూహల్నీ మాటల్లోకి తర్జుమా చేద్దామంటే వోటమి యెదురయ్యే సందర్భాలే యెక్కువ అనుకుంటాను. ఆ రోజు మెరినాలో లేత పసుపురంగు బెనారస్ చీరలో నిన్ను చూశాక నా డ్రాయింగ్ రూములో వుండే బంగారు నీరు తీసిన వీనస్ డిమైలో ప్రతిమలో మొదటి సారిగా కొన్ని లోపాలు కనిపించాయి. ఒక్కొక్కప్పుడు స్త్రీలో కనిపించే పసితనపు లాలిత్యం, ఆమె సౌందర్యం కంటే ఆకర్షణీయంగా వుంటుంది.



కాలవ వార గడ్డిపోచ పైరగాలికి సుకుమారంగా వొంగినప్పుడల్లా రోజా రెమ్మ తగిలినట్టు గుండె చివుక్కుమంటుంది. ఆ సుకుమారచేతనలో నీ జ్ఞాపకాలు మెదులుతాయి. సర్వీ చెట్టు గాలి తాకిడికి చేసే శబ్దంలో విషాదం గూడు కట్టినట్లు, భగ్న ప్రేమికుని మూగ వేదనలా ఈ సృష్టి అంతలో తాను వొంటరిగా మిగిలిపోయిన వూహ కలిగిస్తుంది.

'ది కాంక్వెస్ట్ ఆఫ్ హాపినెస్'లో రసెల్ అంటాడు. 'జీవితంలో విఫలమైన కోరికలు కాలగతిలో మధుర స్మృతులు అవుతాయని. ఈ ప్రతిపాదన విచిత్రంగా వుంది కదూ....

☆

## దేవులపల్లి

**లలిత లలితంగా వుండే కృష్ణశాస్త్రిగారి వచన శైలిని అనుకరించాలనే చాపల్యమే ఈ ప్రయత్నం.**

*వసంతా!*

కోరికలు పరుగులెత్తడమూ, బిడియం పగ్గాలు వేయడమూ వీటి మధ్య మనసు నలిగిపోవడమూ అందులోనే ఆనందం వుందేమిటి చెప్మా?

ఆమె అందచందాలను కనులతో ఏతం వేసి యే జామి గుబురు వైపుకో జాలు చేయాలని చూస్తానా - గట్టు తెగిన వాగులాగు తోటంతా అందాల వెల్లువ! గాజుల రవళికీ, నువ్వుల గలగలకీ తేడా వొకందాన



తెలియదు. ఆ నువ్వులు అలాగే కదలి ఏటి కెరటాల మీదుగా సాగి, కోటి పారిజాతాల బరువైనా గుండెల రేవు చేరుకోవడం యెలాగ భరించానో?

గాలి పల్లకి మీద సాగిపోయే గోరింట పరిమళం ఆమె వునికిని చెప్పేసి వెళ్ళిపోతుంది. బోయీల్లాగ తుమ్మెదల హడావుడి- మాట చెవిని పడనిస్తేనా? అలా బృందావనంలో పొగడ నీడన కృష్ణస్వామి కోసం నిరీక్షించే రాధలాగ, పున్నాగలన్నీ గుట్టగా ఒక చోటే రాలినట్టు ఆమె కూర్చుని వుంటుంది. పైరగాలి కొంటెతనాన్ని పసిగట్టి మావిచిగురుల చిరుగుల మాటునుంచి జారిన వెన్నెల తునక ఆమె పైటచెరుగులా అమరినపుడు - నా కనులకు తిరునాళ్ళు కాక మరేమిటి?

ఉప్పాడ జరీపైట మడతల నుంచి కొసరి కొసరి గుబాళించే వలపు తలపులు - ఒక తీయని చక్కదనం ఆమె కనుల్లోంచి జారి మల యినాలంలాగు వొడలంతా ఆక్రమించడమూ - ఇవేమీ పట్టనట్టు సంజె పొద్దు బద్ధకంగా వొళ్లు విరుచుకోవడమూ - నన్ను వంటరి వాణ్ణి చేసి వేధిస్తాయి. పొదరిల్లు. పున్నమి వెన్నెల కోటి కోర్కెలు నిండిన హృదయ భారంతో నేను - ఆమె కూడా వుంటే యెంత బాగుండేది? ఆమె ఎవరో కాదు సుమీ ... మీరే

నాకు అట్టే తెలియదుగాని మా నండూరి, బసవరాజు అయితే ప్రేమతత్వాలు బాగా పాడగలరు. నా మోజు అంతా గిరజాల మీదే గాని బసవరాజు కవిత్వం మీద చూపుతాడు. మా నండూరి సరేసరి!

*(దేవులపల్లికి జవాబు రాదు. వారి విరహగీతాలు తర తరాల తెలుగు వారికి కావాలి కదా!)*

☆

## శ్రీశ్రీ

**శ్రీశ్రీ గారి వచన శైలిని అనుకరిస్తూ వారు ప్రేమలేఖ రాస్తే యెలా వుంటుందో వూహిస్తూ -**

*మధుర వాణీ!*

ఆ రోజు బ్రాడ్వేలో నువ్వు వెళ్తుంటే రేసు గుర్రం రోడ్డున పడ్డట్టు అన్పించింది. అప్పటికప్పుడే నీకు మూడు ముక్కలు వుత్తరం కూడా రాసిన జ్ఞాపకం.



నువ్వు నా ద్వంద్వ వైఖరిని నిరసిస్తున్నట్టు యీ మధ్యనే తెలిసింది. నా అదృష్టం కొద్దీ యీ దేశంలో నాకు మిత్రుల కంటే శత్రువులే యెక్కువ. ఆ వర్గంలో మీ నాన్న గారు వున్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. అసలు విషయం చెబుతాను విను. శ్రీశ్రీ బాగున్నదాన్ని దేన్నైనా మెచ్చుకునే సహృదయుడు. అంత మాత్రం చేత మరెవర్నో కూడా ప్రేమిస్తున్నానని, ద్వంద్వ వైఖరి అని నన్ను అనుమానించడం తెలుగుదనం తప్ప మరొకటి కాదు.

నన్ను ప్రేమించనందుకు చింత కొంతే కాని మీరు సందు చివర విశ్వనాథాన్ని అభిమానిస్తున్నారని విని చింతించాను. చిలకముక్కుకి నేరేడు పండులాగ విశ్వనాథాన్ని మిమ్మల్ని పక్క పక్కన వూహించుకుంటే మీ మీద జాలి వేస్తోంది. అణా అప్పుచెయ్యడం కూడా చేతగాని విశ్వనాథం నిన్ను వుద్ధరించలేడనేది మాత్రం స్పష్టంగా చెప్పగలను, జాలిపడే నాలాంటి వాళ్ళను మన సమాజం నమ్మదు. ప్రేమలు, రాజకీయాలు, రైళ్ళు, బస్సులు అన్నీ కలుషితమై పోయిన మన దేశంలో నమ్మకానికి చోటు లేదు. అది ఏ హిమాలయ శిఖరాగ్రసానువులోనో నక్కింది. చైనా దేశంలోకి జారిపోయిందేమోననికూడా నా సందేహం...

*(శ్రీశ్రీ అసలు జవాబుతో పనిలేదు)*

☆

## మోహనప్రసాద్

**సరియలిస్టుకవి వేగుంట మోహన ప్రసాద్ గారి అధివాస్తవికంగా ఆలోచిస్తారు. ప్రేమలేఖ అయినా అలాగే రాసిపారేస్తారు. పేరుగాని సంబోధనగాని వుండదు. సరాసరి సంగతిలోకే.**



"అట్లా అని అందమూ లేదు. కింగ్స్‌వేలో క్లియోపాట్రా లాగా కనిపించి యెక్కడ దాక్కున్నావోగాని నేను మాత్రం టెలిఫోన్ రిసీవర్లన్నీ వెదికాను, టెలివిజన్ తెరలోగానీ, ఫ్లూరసెంటుబార్‌లోగాని వొదిగిపోయావా!

రేపటి సాయంకాలం నా ముక్కు పుటాలు నిన్ను చూసినపుడు నా కళ్ళు సౌందర్యాన్ని ఆఘ్రాణించి ఫోమ్‌బెడ్ మీద మూర్ఛ పోయాయి. నువ్ నడిచిన దారినిండా పడిపోయిన ఊదారంగు కలల్ని గుప్పిళ్ళనిండా తీసుకొని జేబులో కుక్కుకొని వాటి బరువుతో నడవలేక రిక్షా యెక్కి వెళ్ళిపోయాను.

'నువ్వు కాదన్నా- దమయంతి, ద్రౌపది, కీలర్, హెలెన్... యెవరు కాదన్నా బాధలేదు. జీవన దుఃఖ తంత్రుల్ని పూల రెక్కలతో చీల్చేసుకుని ఎయిర్‌పోర్ట్‌లో రన్‌వే మీద నా సమాధిని నేనే కట్టుకుంటాను. బోయింగ్, జెట్, ఏవరోన్, ఏదయినా నామీంచి ఎగరాల్సిందే. ఆఖరికి బొదలైరూ, బ్రెజ్నెప్ అయినా.

కళ్యాణం తంతు నావేనా.. నీ గాజుల గలగలలో డికెన్స్‌కి నిద్రాభంగం తప్పదు. అనుకున్నట్టే నక్షత్రం నన్ను పొడిచేసి పసిపిల్లలా చేతులు కడుక్కుని వెళ్లిపోతుంది పాతాళానికో - అనంతకాశానికో - పొగ మంచు మెట్ల మీదుగా పండరి భజన చేసుకుంటూ వెళ్దాం బదరీగాని, పిట్స్‌బర్గ్ కాని, అక్కడ దేవదారు చెట్లమీద యీతలు కొడతాను నేను..."

**1. రాజవీధి  2. ట్యూబ్‌లైటు  3. హిందూ వివాహ మంత్రం.**

*(ప్రేమ భావంతో కాక పోయినా లేఖ అర్థం తెలుసుకోవడానికైనా ఆమె రాక తప్పదు. అప్పుడు చెబితే తెలుస్తుంది. యిది ప్రేమలేఖ అని.)*

☆

# మన రాష్ట్రంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు చేసే ప్రక్రియ

వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్చే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు చట్టం 2006ను ప్రభుత్వం రూపొందించింది. ఈ చట్టం తేది: 2/01/2006 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుంది. దీనికి సంబంధించిన నిబంధనలు ప్రభుత్వం వారి జి. ఒ. ఎమ్.ఎస్.నెం:1537 తేది: 19-10-2006లో తీసుకుని వచ్చారు.

వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములుగా మార్పు చేసుకోవటానికి ప్రభుత్వం నిర్ణయించిన భూమి బేసిక్ విలువలో 10 శాతం విలువ కన్వర్షన్ ఫీజుగా చెల్లించి సదరు రసీదును దరఖాస్తుతో పాటు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి దాఖలు చేయాలి. దరఖాస్తు నమూనా ఫారం-A జతపరచడమైనది.

దరఖాస్తుకు సంబంధించిన భూమి బేసిక్ విలువ తెలిసికొనవలయునన్న దరఖాస్తు దారుడు సంబంధిత సర్వే నెం, విస్తీర్ణం వివరాలతో రెవెన్యూ డివిజనల్ అధికారికి దరఖాస్తు చేయాలి. దరఖాస్తు అందిన 15 రోజులలో సమాచారాన్ని దరఖాస్తు దారునికి ఇవ్వాలి.

కన్వర్షన్ ఫీజును ఈ దిగువ తెలియపరచిన హెడ్ ఆఫ్ ఆకౌంట్‌లో చెల్లించాలి.

"0035 - Taxes on Immovable Property other than agricultural land

MH 101 - Ordinary collections

SH (01) - Receipts under the A.P. Non Agricultural Lands Assessment

001 - Urban Areas

002 - Non - Urban Areas"

చెల్లించవలసిన రుసుం కంటె తక్కువ చెల్లించిన ఎడల దరఖాస్తు చేరిన 30 (ముప్పది) రోజుల లోపల సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి మిగిలిన రుసుంను చెల్లించమని దరఖాస్తు దారునకు నోటీసు పంపాలి. నోటీసు అందిన 15 (పదిహేను) రోజుల లోపల ధరఖాస్తు దారుడు మిగిలిన రుసుం చెల్లించాలి.

దరఖాస్తు దారునకు 30 (ముప్పై) రోజుల లోపల ఎటువంటి నోటీసు రెవెన్యూ డివిజనల్ అధికారి నుండి రానిచో చెల్లించిన కన్వర్షన్ ఫీజు (రుసుం) సరిపోయినట్లు భావించబడును.

దరఖాస్తు చేరిన 60 (అరవై) రోజులలోపు రెవెన్యూ డివిజనల్ అధికారి గారు అనుమతి ఉత్తర్వులు ఇవ్వనిచో కన్వర్షన్ అప్లికేషన్ ఆమోదించినట్లే.

వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూమిగా రెవెన్యూ డివిజనల్ అధికారి అనుమతి లేకుండా మార్పు చేసినట్లయితే, అట్టి భూమిని చట్ట ప్రకారం వ్యవసాయేతర భూమిగా పరిగణింపబడదు. ఆమోదం లేకుండా భూమి బేసిక్ వాల్యూలో 10 శాతం విలువ, దానిపై 50 శాతం పెనాల్టీ చెల్లించవలసినదిగా రెవెన్యూ డివిజనల్ అధికారి ఉత్తర్వులు ఇస్తారు. ఉత్తర్వు లిచ్చిన 15 (పదిహేను) రోజుల లోపల సదరు విధించిన ఫీజు, పెనాల్టీ చెల్లించనిచో రెవెన్యూ బాకీవలే ఆ సొమ్మును వసూలు చేస్తారు.

రెవెన్యూ డివిజనల్ అధికారి ఉత్తర్వులిచ్చిన 60 (అరువది) రోజులలో జిల్లా కలెక్టర్ గారికి అప్పీలు ఉంది. అప్పీలుపై రూ. 3/- లు కోర్టు ఫీజు అతికించాలి. ఆర్డర్ కాపీని దాఖలు చేయాలి.



## దరఖాస్తు ఫారం నమూనా

### FORM - A
(see rule 3 (i))

To
The Competent Authority and
Revenue Divisional Offi cer,
Division, District.

Sir,

Sub: Land Conversion act -Village, Mandal........... District - Sy. No. Ext - conversion of Agricultural land to Non-agricultural purpose -req.

I ----------------- S/o ------------------------- R/o ------------------------------------------ submit that Iam pattadar of agricultural lands in sy. No. ------------------ of ------------------------ village -------------Mandal ----------------------District to an extent of ---------------- gts/cts . I would like to convert Agricultural land specified in the schedule into Non-agricultural purpose.

I request the Competent Authority to accord necessary permission for the conversion of the said agricultural lands to non-agricultural purpose act, 2006 (A.P. Act No: 3 of 2006 )

I ----------------------------------- for Rs -----------------------------------------(Rs ------------------------ ----- only) paid to the Government treasury of -------------------------- (v) / town/ city @ 10% basic value of the land towards conversion fee.

I hereby declare that the lands mentioned above are neither covered by any litigation /court cases / encroachment nor these lands are assigned lands/ULC Surplus land /Agricultural Ceiling surplus land/Tank bed lands .

Yours faithfully,

( Address )

**SCHEDULE**

| Sl. No. | Village , Mandal & District | Sy. No. | Total extent (Sy. No. wise) | Extent for which permission for conversion sought | Remarks |
|---|---|---|---|---|---|
| | | | | | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |

ఈ చట్టం ఈ క్రింది వాటికి వర్తించదు.

1. ప్రభుత్వ భూములు
2. స్థానిక సంస్థలకు చెందిన భూములు (వ్యాపారానికి వాడని భూములు)
3. మత, ధర్మాదాయ ప్రయోజనాలకు ఉపయోగించు భూములు
4. కుటీర పరిశ్రమలకు ఉపయోగించిన ఎకరంలోపు భూములు

ఈ చట్టం క్రింద యిచ్చిన ఆదేశాలను సివిల్ కోర్టులలో ప్రశ్నించడానికి వీలులేదు.

**- బి. వెంకటేశ్వర రావు,**
కన్సల్టెంట్
ల్యాండ్ సెల్

వార్తల్లో 'అపార్డ్'

# గ్రామసభ నిర్వహణకు 'అపార్డ్' అనుసరిస్తున్న బహుముఖ వ్యూహాలు ప్రశంసనీయం



గ్రామసభ నిర్వహణపై అవగాహన కోసం అపార్డు అనుసరిస్తున్న బహుముఖ వ్యూహాలు ప్రశంసనీయమని, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమని భారత ప్రభుత్వం పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి రష్మీ శర్మ శుక్లా అన్నారు.

జూన్ 10వ తేదీన ఆమె అపార్డును సందర్శించిన ఆమె రాష్ట్రంలో పీసా చట్టం అమలు చేయడానికి తీసుకుంటున్న చర్యల గురించి అపార్డు బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ మరియు ఈక్విటీ విభాగాధితి శ్రీ సెబాస్టియన్ రాజు, సెంటర్ ఫర్ మీడియా, పబ్లికేషన్స్ విభాగాధిపతి డా॥వి.ఎన్.వి.కె. శాస్త్రి దీనిపై స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 1998లోనే రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టానికి సవరణలు తీసుకొనివచ్చి పీసా చట్టంలోని నిబంధనలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపచేసిందని తెలియచేసారు.

ఐతే చట్టాన్ని అనుసరించి చేసేనిబంధనల రూపకల్పనలో చట్టపరమైన అంశాలు ఇమిడి ఉండటంతో, నిబంధనల రూపకల్పనను ఇటీవలే నిపుణుల పర్యవేక్షణలో చేపట్టటం జరిగిందని, అతి కొద్ది సమయంలోనే ఈ కార్యక్రమం పూర్తవుతుందని తెలియచేసారు.

శ్రీమతి రష్మీశర్మశుక్లా మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాలలో గ్రామ సభను పటిష్టం చేయడానికి రాష్ట్రాలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అదేవిధంగా గిరిజన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ అందచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె అపార్డులోని శిక్షణా సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. వీడియోకాన్ఫరెన్సు ద్వారా ఇ.టి.సి. ప్రిన్సిపాల్‌తో సంభాషించి, ఎటువంటి శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయో తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు, పంచాయితీరాజ్ సిబ్బందికి 'అపార్డు' మనటివి ద్వారా ప్రసారంచేస్తున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకొనటంతో పాటు ప్రత్యక్ష చర్చ కార్యక్రమాన్ని కూడా వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సి.డి.పి.ఏ సెంటర్ హెడ్ ప్రొ॥ఆర్.సూర్యనారాయణ రెడ్డి అపార్డుకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా అపార్డులోని వివిధ సెంటర్ల అధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు, కన్సల్టెంట్‌లు పాల్గొన్నారు. ■







# చెంచుల అభివృద్ధికి అమలవుతున్న ప్రత్యేక ప్రణాళిక

జూన్ 2004 సంవత్సరంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణాధికారుల ఆధ్వర్యంలో చెంచుల అభివృద్ధి ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఉన్న చెంచు కుటుంబాల అభివృద్ధి కోసం ఈ ప్రత్యేక ప్రణాళిక అమలు జరుగుతోంది.

ఏర్పాటు చేసుకొని, తాము ఏర్పాటు చేసుకొన్న సంస్థలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలను తీర్చుదిద్దుకుంటూ ముందడుగు వేస్తున్నాయి.

### సంఘాలు/సంస్థలను బలోపేతం చేయడం

సంఘాలు సంస్థలను బలోపేతం చేయడంలో ఏ మండలానికి ఆ మండలం ప్రత్యేక వ్యూహంపై సి.ఇ.ఓ సెర్ప్, సెర్ప్ ప్రాజెక్ట్ సలహాదారు సలహాలు తీసుకుంటూ మంచి ఫలితాలు పొందే దిశలో ముందుకు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్), ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో

'ఇందిరాక్రాంతి పథం' అమలులో భాగంగా జరుగుతున్న 4 జిల్లాల పరిధిలో నున్న గిరిజన ప్రాంతాలు ఉన్న నల్లమల అటవీ ప్రాంతం సుమారు 356 చ.కి.మీ.లలో విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలోని చెంచు కుటుంబాలు అటవీ భూముల సాగు ద్వారా, కలపేతర ఉత్పత్తుల ద్వారా జీవనం సాగిస్తున్నాయి. ఈ నాలుగు జిల్లాలలోని 17 మండలాలలో ఉన్న 258 చెంచుగూడేలలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. చెంచు అభివృద్ధి ప్రణాళికలో 17 చెంచు మండల సమాఖ్యలు ఏర్పాటు చేసుకొని, చెంచు అభివృద్ధి ప్రణాళికలో సూచించిన కార్యక్రమాల అమలు ద్వారా సంఘాలు, సంస్థలు మంచి ఆచరణ పద్ధతులను పోతున్నారు. చెంచుల అభివృద్ధి ప్రణాళికలో సూచించిన విధంగా 707 సంఘాలు, 127 గ్రామైక్య సంఘాలు, 17 చెంచు మండల సమాఖ్యల ఏర్పాటులో తగు జాగ్రత్తలు తీసుకొని, మార్పులు, చేర్పులు ద్వారా సంఘాలు / సంస్థల పటిష్టతకు దోహదపడే దిశగా పని చేసి సత్ ఫలితాలను పొందుతున్నారు. ఇందుకుగాను ప్రతి చెంచు సమాఖ్యలో సంఘాలకు, సంస్థలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మొదటగా 4 జిల్లాలలోని అన్ని చెంచు సమాఖ్యల పరిధిలో నున్న గూడేలను అనంతపురం, కర్నూలు యు.ఎన్.డి.పి. మండలాల నుండి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ టీములు సందర్శించి సంఘాల లోటు



పాట్లను గుర్తించి వారికి గ్రూపుస్థాయి మెంబర్లతో శిక్షణ ఇప్పించి మంచి ఆచరణ పద్ధతులు పాటించేటట్లు చేయగలిగారు. మొదటిగా సంఘాలలో వారం రోజుల పాటు మీటింగులు, వారం పొదుపులు, వసూలైన పొదుపులను తమ అవసరాలకు చిన్న అప్పులుగా ఇవ్వడం, బ్యాంకులో వున్న పొదుపులను కూడా రొటేషన్‌లోకి తీసుకురావడం, వాటిని తిరిగి అప్పుగా ఇచ్చి అసలు వడ్డీలను నిర్ణయించుకోవడం, తిరిగి వసూలైన డబ్బును మరొక సభ్యురాలి అవసరానికి ఇవ్వడం వంటి మంచి పద్ధతులు అలవాటు చేయడంతో పాటు కొత్తసంఘాలను ఏర్పాటు చేయడం, పడిపోయిన సంఘాలను తిరిగి పనిచేసేటట్లు చేయడం వంటి కార్యక్రమాలు చేశారు.

దాదాపు 50 శాతం గ్రూపులు ఇటువంటి మంచి పద్ధతులు పాటిస్తున్నాయి. దీని వలన గ్రామైక్య సంఘం స్థాయిలలో, మండల సమాఖ్య స్థాయిలలో మంచి నాయకత్వం గలవారు నాయకత్వ బాధ్యతలు తీసుకొని ముందుకు వచ్చారు. చెంచు అభివృద్ధి ప్రణాళికలో మానవ వనరుల అభివృద్ధి వీరితోనే ప్రారంభమైంది. వీరి పట్టుదల, కృషి చాలా చెంచు కుటుంబాలలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. 2005-06, 2006-07, 2007-08 బడ్జెట్ కేటాయింపులలో కూడా సంఘాలు/ సంస్థలు స్వయం ప్రతిపత్తి కలిగి వుండేదానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

## శ్రీశైలంలో చెంచులక్ష్మి మహా సమాఖ్య ఏర్పాటు

4 జిల్లాలలోని 17 చెంచు మండలాలలో మారుమూల ప్రాంతమైన నల్లమల అడవులలోని 254 గూడేల నుండి సుమారు 7846 చెంచు కుటుంబాల మహిళలు 707 స్వయం శక్తి సంఘాలుగా ఏర్పడ్డారు. దగ్గరగా వున్న కనీసం రెండు లేక మూడు గూడేలలోని అన్ని స్వయంశక్తి సంఘాలు కలసి ఒక గ్రామైక్య సంఘంగా ఏర్పడటం. మొత్తం అన్ని చెంచు గ్రామైక్య సంఘాలు కలసి ఒక చెంచు మండల సమాఖ్యగా ఏర్పడటం జరిగింది. ఇప్పటివరకు 17 మండలాలలో 17 చెంచు మండల సమాఖ్యలు ఏర్పడ్డాయి. ఈ 17 చెంచు మండల సమాఖ్యలు కలసి రాష్ట్ర స్థాయిలో ఒక 'చెంచులక్ష్మి మహా సమాఖ్యగా' శ్రీశైలంలో ఏర్పాటైంది.

## సమాఖ్య ఉద్దేశ్యాలు

4 జిల్లాలలోని 17 చెంచు మండల సమాఖ్యలతో నిరంతరం పనిచేస్తూ 8372 చెంచు కుటుంబాలలో డి.ఆర్.డి.ఏ పేదరిక నిర్మూలనకై కృషి చేయడం మొదటి ఉద్దేశ్యంకాగా, డి.ఆర్.డి.ఏ., ఐ.టి.డి.ఏ., జి.సి.సి. 4 జిల్లాలలోని ప్రభుత్వశాఖలు, ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులతో సమన్వయం సాధించి వారి కార్యక్రమాలను, సేవలను గ్రామ స్థాయిలోనున్న అన్ని చెంచు కుటుంబాలకు అందేట్లు కృషి చేయటం రెండవ ఉద్దేశ్యం.

మండల సమాఖ్యలు, గ్రామైక్య సంఘాలకు అవసరమైన శిక్షణలను గుర్తించి, వాటిని ఏర్పాటు చేసి సమాఖ్యలు సంఘాలు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలుగా, స్వావలంబన సాధించటానికి కృషి చేయటం మూడవ ఉద్దేశ్యం. 8,372 చెంచు కుటుంబాల అభివృద్ధి కొరకు, ఎప్పటికప్పుడు వారి అవసరాలను, సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి నిరంతరం పని చేయటం మహా సమాఖ్య నాలుగవ ఉద్దేశ్యం.

## మహా సమాఖ్య సమావేశాలు

ప్రతి నెలా కార్యనిర్వాహక కమిటీ సమావేశం 16 న జరుగుతుంది. దీనికి 17 మంది అధ్యక్షురాళ్లు, జిల్లా చెంచు సమాఖ్యల ఇన్‌ఛార్జ్



ఏరియా కో-ఆర్డినేటర్లు హాజరవుతారు. అలాగే ప్రతి మూడు నెలల కొకసారి 16, 17 తేదీలలో 51 మంది ప్రతినిధులతో మహాసమాఖ్య ఆర్.జి.బి. సమావేశాన్ని మహాసమాఖ్య ఆఫీసులో నిర్వహించాలి. మహాసమాఖ్య సమావేశంలో సభ్యులందరూ పాల్గొని, సమిష్టి నిర్ణయ విధానం పాటించటానికి కావలసిన కట్టుబాట్లు నిర్ణయించుకొని సమావేశం నిర్వహిస్తారు. మహా సమాఖ్య సమావేశాలకు, డి.ఆర్.డి.ఏ, ఐ.టి.డి.ఏ, జి.జి.సి అధికారులను, ప్రభుత్వశాఖలు, సంస్థల నుండి అధికారులను ఆహ్వానించి సభ్యులలో ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు.

## సూక్ష్మరుణ ప్రణాళికలు - అమలు విధానం

చెంచుల అభివృద్ధి పథకంలో మొదటిసారిగా 2005 సంవత్సరాంతంలో యం.సి.పి. 7 మెట్ల శిక్షణా కార్యక్రమం 4 జిల్లాలలోని సి.సి.లు/సి.వి.లు/సి.ఎఫ్.లకి ఇప్పించడం జరిగింది. సంఘాలలో మంచి పద్ధతులను ఏ విధంగా సిఆర్‌పిలు అమలు చేశారో, అలాగే సూక్ష్మ రుణ ప్రణాళిక శిక్షణ విషయంలో కూడా సంఘాలను పటిష్ఠ పరచడానికి కృషి చేస్తున్నారు. చెంచు సంఘాలలో యం.సి.పి. 7 మెట్ల పద్ధతి సంఘాలలో మంచి మార్పుకి నాంది పలికింది. సంఘాలలో ఏ అప్పు కావాలన్నా వారు మైక్రోప్లాన్ చేసుకోవాలని, దాని ద్వారా అప్పు పొందాలని నిర్ణయించుకుంటున్నారు.

ఇప్పటివరకు 115 ఆహార భద్రత గ్రామ సంఘాలలో చెంచు కుటుంబాలకు రూ. 100.36 లక్షలలో మైక్రోప్లాన్ ద్వారా అప్పుగా తీసుకున్నారు. అలాగే 118 జీవనోపాదుల గ్రామ సంఘాలలోని 3832 మంది 3 కోట్ల 98 లక్షల రూపాయలు ఆదాయం పెంచుకొనే కార్యక్రమాలకు అప్పుగా మంజూరు చేశారు. జీవనోపాదులు అప్పు కింద ఒక గ్రూపునకు సరాసరి ఒక లక్ష రూపాయల మేరకు తీసుకొన్నారు. ఇప్పటి వరకు ఆహారభద్రత, జీవనోపాదుల కోసం యం.సి.పి పద్దతిలో మొత్తం 5 కోట్ల 76 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొన్నారు.

## చెంచు అభివృద్ధి ప్రణాళిక దృష్టిపెట్టే అంశాలు

- చెంచు కుటుంబాలన్నింటికీ ఆహారభద్రత కల్పించడం.
- జీవన ప్రమాణాలు మెరుగుపరచుకొనడానికి తగిన ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా జీవనోపాధులను మెరుగు పరచుకోవడం.
- చెంచులు సేకరించే అటవీ ఉత్పత్తులకి మంచి మార్కెటింగ్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం.
- వివిధ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య నిధి, చదువుల నిధి, ఇంటి నిర్మాణపు నిధి, ఇంటి అవసరాల నిధి, భూమి అభివృద్ధి నిధులను ఏర్పాటు చేసుకోవడం.
- ప్రభుత్వం నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం పెంపొందించటం.
- సామాజిక భద్రత పథకాలను అందుబాటులోకి తీసుకురావటం.

## ఆహార భద్రత

ఇప్పటికీ చెంచు కుటుంబాలు ఆహార సేకరణ మీద రోజంతా కష్టపడవలసి వస్తోంది. దీనికి వారి సామాజిక వ్యవస్థలో ఉన్న లోపం కూడా ఒక కారణం కావచ్చు. సంవత్సరం పొడవునా ఆహార సేకరణ, వేటలతోనే చెంచుల జీవితాలు గడిచిపోతున్నాయి. ఈ దశలో వారు రకరకాల తిండి పదార్థాలు తీసుకొన్నప్పటికీ వారిలో పౌష్టికాహార లోపం స్పష్టంగా కనిపిస్తుంది. మహిళలలోనైతే రక్తహీనత ఎక్కువ. సమతుల ఆహారం లేకపోవడం వలన అవసరమైన విటమిన్లు అందకపోవడం వలన అనారోగ్యం పాలౌతున్నారు. దీనిని గుర్తించిన ఇందిరా క్రాంతిపథం చెంచుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా, అన్ని చెంచు కుటుంబాలకు ఆహారభద్రత కల్పించాలని నిర్ణయించింది. 2005-06 బడ్జెట్‌లో రూ. 1 కోటి 17 లక్షల కేటాయింపు ద్వారా 8316 చెంచు కుటుంబాలకు ఆహారభద్రత కల్పించాలని నిర్ణయించారు. ఆహారభద్రత అమలు చేసే బాధ్యతను చెంచు సమాఖ్య, గ్రామైఖ్య సంఘాలు తీసుకొని సమర్థవంతంగా అమలు చేయగలిగినాయి.

సంఘాలలో ఆహారభద్రతకు సూక్ష్మరుణ ప్రణాళిక తయారుచేస్తే పద్ధతి, ద్వారా గ్రామైక్య సంఘం, చెంచు మండల సమాఖ్యలు గణనీయమైన పాత్ర పోషించాయి. ఈ క్రింద తెలిపిన 7 మెట్ల ద్వారా సంఘ సభ్యులతో చర్చించి ఆహారభద్రత ప్రణాళిక తయారు చేసుకొన్నారు. అవి:

## ఆహార భద్రత అమలు - నిర్వహణ విధానం




**సూక్ష్మ రుణ ప్రణాళిక - అంశాలు**

1. సంఘ సమగ్ర సమాచారం
2. సభ్యుల సమగ్ర సమాచారం
3. సభ్యుల ఆదాయ - వ్యయాలు సంవత్సరానికి
4. సభ్యులకు కావలసిన సరుకుల అంచనా ధరల వివరాలు
5. అసలు ధరలు వివరాలు
6. పంపిణీ బాధ్యత
7. ఒప్పందాలు

సభ్యుల నుండి సంఘానికి, సంఘం నుండి గ్రామైక్యసంఘానికి 3 నుండి 8 కంతుల లోపు చెల్లించే విధంగా నిర్ణయించారు. వి.ఓ నుండి సమాఖ్యకు 100 కంతులు చెల్లించే ఏర్పాటు చేశారు. దీనివలన ఆహార భద్రతకు సంబంధించిన డబ్బు, వి.ఒ.ల వద్ద ఉంటుంది (ఉదా. ఒక విఒకు సి.యం.ఎస్. నుండి ఒక లక్ష రూపాయలు ఆహారభద్రతకు అప్పు ఇచ్చినట్లయితే, ఆ విఒ నెలకు 1000 మాత్రమే సి.యం.ఎస్.కు చెల్లించవలసి ఉంటుంది. అయితే సంఘాల నుండి విఒకు రూ. 12,500 లు వసూలు అవుతుంది. అంటే ఆ విఒలో ఇంకా రూ. 11,500 మిగిలి వుంటుంది. దీనిని వారు ఆహారభద్రతకు కాని, లేదా జీవనోపాధులకు కాని ఇచ్చే స్వేచ్ఛ వారికి వుంది. విఒ నిర్ణయాల ప్రకారం అవసరమైతే ఆహారభద్రతకు గానీ, జీవనోపాధులకుగానీ తీసుకొనే స్వేచ్ఛ ఆ విఒకి ఇవ్వడమైనది.

## జీవనోపాధులు

గూడేలలో ఉన్న అట్టడుగు పేద, నిరుపేదల స్థితిగతులలో మార్పు తీసుకుని వచ్చే అంశానికి చెంచుల అభివృద్ధి ప్రణాళికలో అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. సామాజిక పెట్టుబడి నిధి నిర్వహణ బాధ్యత అంతా చెంచు సమాఖ్యకు ఇవ్వడం జరిగింది. సి.ఐ.ఎఫ్. 6 శాతం వడ్డీతో 100 నుండి 120 కంతులు తిరిగి చెల్లించే పద్ధతిలో విఒలకు అప్పుగా ఇవ్వడం జరుగుతుంది. స్వయం ప్రతిపత్తి గల సంస్థలుగా పనిచేసే దానికి ప్రతి విఒకు 2 లక్షలపైగా సిఐఎఫ్‌ను మైక్రోప్లాన్ ద్వారా ఇవ్వాలని సమాఖ్యలో నిర్ణయించారు.

విఒలలో సామాజిక పెట్టుబడినిధిని నిరుపేదలకు గుర్తించి మొదటగా వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి సంఘానికి రూ. 1,00,000లకు పైగా సూక్ష్మ రుణ ప్రణాళికా ద్వారా అప్పు మంజూరు చేయాలని తీర్మానించుకున్నారు. యం.సి.పి. చేయడానికి గ్రామైక్య సంఘాలకు అర్హతలను నిర్ణయించి మంచి ఆచరణ పద్ధతులు ఉన్నవాటికి సి.ఐ.ఎఫ్. మంజూరు చేస్తున్నారు. ఇప్పటివరకూ 4 జిల్లాలలోని 17 మండలాలలో 587 సంఘాలకు రూ. 398.86 లక్షలు విఒలకు అప్పుగా మంజూరు చేశారు. సి.ఐ.ఎఫ్. రొటేషన్ విధానాన్ని యం.సి.పి. ద్వారా ముందుగానే ప్రకటించారు. సంఘంలోని 6వ సభ్యురాలికి అప్పు ఏ నెలలో వస్తుందో ముందుగానే ప్రణాళిక నిర్ణయించుకొని దాని అమలుకు ప్రయత్నం చేస్తున్నారు.

## కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ మార్కెటింగ్ (ఎన్.టి.ఎఫ్.పి)

కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణలో సుమారు 63 శాతం చెంచు కుటుంబాలు దీనిపై ఆధారపడి బతుకుతున్నాయి. కలపేతర అటవీ ఉత్పత్తులలో మంచి ధర ఉన్నవి మారేడు గడ్డలు, జిగురు, తేనె, కరక్కాయలు, కుంకుడు, శీకాయ, చిల్లగింజలకు గిరిజన కార్పొరేషన్ వారు రేట్లు నిర్ణయించారు. కాని చెంచులు వాటిలో మారేడుగడ్డలను, తేనెను, కరక్కాయలను బయటి మార్కెట్‌లో అమ్ముకొని కొంత లాభాన్ని పొందగలుగుతున్నారు.

కమ్యూనిటీ గమనించిన ముఖ్యమైన విషయాలలో గిరిజన సహకార సంస్థ వారి ధరలపైన, తూనికలపైన, బయటి మార్కెట్

### సామాజిక పెట్టుబడి నిధి- నిర్వహణ విధానం





రేటు విషయాలలో కొంత అవగాహన పెంచుకున్నారు. అవగాహన పెంచుకొని బయటి మార్కెట్‌లో అటవీ ఉత్పత్తులను మంచి రేట్లకు అమ్ముకోవాలని నిర్ణయించుకొని గిరిజన సహకార సంస్థకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకొన్నారు.

## ఆరోగ్య నిధి

ముఖ్యంగా 4 జిల్లాలోని చెంచు సమాఖ్యలు చెంచు గూడేలలో వచ్చే జబ్బులను గుర్తించాయి. విషజ్వరాలు, అంటువ్యాధులు, టి.బి. (ఉబ్బసం), రక్తహీనత, త్రాగునీటి ద్వారా వచ్చే ప్రమాదకర వ్యాధులు, సారాయి ఎక్కువగా తాగడం వలన వచ్చే అనారోగ్యాల వలన ఎక్కువ మంది చనిపోతున్నారు. ఇందిరా క్రాంతి పథం చెంచుల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి వారిలో అవగాహన కల్పించాలని భావించింది. మొదటగా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎక్కువ శాతం అనారోగ్యాలకు గురికాకుండా చేయడం. రెండవది స్థానికంగా ఉండే వైద్య సదుపాయాలను గురించి సంఘాల ద్వారా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. మూడవది ప్రతి చెంచు సమాఖ్యలో ఆరోగ్యనిధి క్రింద కొంత నిధిని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దీనిని పావలా వడ్డీకి ఇవ్వాలని నిర్ణయించారు. దీని ద్వారా ఎక్కువ మందికి సహాయం చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 276 మంది 23.88 లక్షల సహాయం చేశారు.

## చదువు నిధి

చెంచులలో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉండటానికి సాంఘిక, ఆర్థిక కారణాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. 1981 జనాభా లెక్కల ప్రకారం చెంచులలో అక్షరాస్యతా శాతం సరాసరి 11.5 శాతం. ప్రస్తుతం మహిళల అక్షరాస్యత 9.71 శాతంగా ఉంది. కొన్ని చెంచు కుటుంబాలలో విద్యపట్ల అవగాహన పెరిగినప్పటికీ ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం వలన పిల్లలను పై చదువులు చదివించలేకపోతున్నారు. సంఘాలు/ గ్రామ సంఘాల సమావేశంలో విద్య పట్ల అవగాహన కలిగేటట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే సమాఖ్య మీటింగులో సభ్యులు చర్చించిన తరువాత ఇటువంటి కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడానికి చదువుల నిధిని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

దీని ద్వారా పై చదువులు వెళ్ళే పిల్లలకు సహాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు 42 మందికి 9,92 లక్షల సహాయం చేశారు.

## ఇంటి నిర్మాణం

ఇంటి నిర్మాణం చెంచులకు ఒక ప్రధాన సమస్యగా మారింది. వారి ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు కట్టుకోవాలంటే సమస్యగా ఉంది. దీన్ని ఆధారంగా చేసుకొని కాంట్రాక్టర్లు చెంచులకు ఇళ్లు నిర్మించే పనిని చేస్తున్నారు. ఇవి నాసిరకంగా ఉండడంతో కొద్ది కాలానికే పడిపోతున్నాయి. చెంచు సమాఖ్యలు ప్రధానంగా ఎవరికి వారే సొంతంగా ఇండ్లు కట్టుకోవడానికి అవగాహన కల్పిస్తున్నాయి. అలా సొంతంగా కట్టుకోవాలనుకునే వారికి బేస్‌మెంట్ వేసుకొనేందుకు రూ.2000 నుండి రూ.5000 రూపాయల వరకు తక్కువ వడ్డీతో అప్పు మంజూరు చేస్తుంది. దీనికి కంతులు (వాయిదాలు) వారు కోరుకొనే పద్దతులలో ఇస్తున్నారు. ఇప్పటి వరకు 238 మందికి రూ. 30.03 లక్షల అప్పుగా ఇచ్చారు.

## ఇంటి అవసరాల నిధి

చెంచు కుటుంబాలలో ఉన్న సామాజిక వ్యవస్థకు, మిగతా కులాలలోని సామాజిక వ్యవస్థకు కొంత తేడా వుంది. ఉదా॥ చెంచు కుటుంబాలలోని యువతీ యువకులకు పెండ్లి అయిన తరువాత దంపతులు కుటుంబం నుండి వేరుపడితే వెంటనే ఆస్తులు పంచి ఇవ్వరు. మిగిలిన సంతానానికి కూడా పెండ్లి అయిన తరువాతే ఆస్తుల పంపకం జరుగుతుంది. అప్పటి వరకు పెండ్లి అయిన దంపతులు తమ సొంత కాళ్ళ మీదే బతకవలసి వుంటుంది. ఈ సమస్యను గుర్తించిన చెంచు సమాఖ్య పెండ్లి అయిన కుటుంబానికి వారికి కావలసిన గృహ అవసరాల కోసం కొంత డబ్బును ఇచ్చి ఆ వస్తువులు కొనుక్కునేటట్లు చేస్తుంది. సంఘం, గ్రామ సంఘం తీర్మానం ద్వారా అప్పు తక్కువ వడ్డీకి ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 32 మందికి రూ. 4.85 లక్షలు అప్పుగా ఇచ్చారు.

## పభుత్వ కార్యక్రమాలు - అనుసంధానం

1. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా అమలు చేస్తున్న పేదరిక నిర్మూలనా కార్యక్రమాలలో పాల్గొని నిరుపేద పేదలకు అభివృద్ధి పథకాలను అందించడంలో సమాఖ్యలు నిరంతరం పని చేస్తున్నాయి. ముఖ్యంగా ఇందిరా క్రాంతి పథకం నుండి 2005-06, 2006-07 సంవత్సరాలలో 17 చెంచు సమాఖ్యలు 4 కోట్ల 84 లక్షల రూపాయల మేరకు సామాజిక పెట్టుబడి నిధి (సి.ఐ.ఎఫ్) పొందాయి.

| సి.ఐ.ఎఫ్ నిధి వివరాలు | మొత్తం రూ. |
|---|---|
| ఆహార భద్రత | 117.05 |
| జీవనోపాదులు | 262.39 |
| ఆరోగ్య నిధి | 29.44 |
| చదువుల నిధి | 24.36 |
| ఇంటి నిర్మాణపు నిధి | 25.64 |
| ఇంటి అవసరాల నిధి | 12.03 |
| కొనుగోలు కేంద్రాలు / భూమి అభివృద్ధి | 13.17 |
| **మొత్తం సి.ఐ.ఎఫ్ రూ.** | **484.06** |

పై సామాజిక పెట్టుబడి నిధి (సి.ఐ.ఎఫ్) గురించి చెంచు లక్ష్మి మహా సమాఖ్య సమావేశంలో చర్చించి వివిధ అవసరాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు చేసుకొన్నారు.

## గ్రెయిన్ బ్యాంక్

మారుమూల ప్రాంతాలైన అటవీ ప్రాంతంలో నివశించే చెంచు కుటుంబాలకు ఆహారభద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం గ్రెయిన్ బ్యాంకు బియ్యం పథకం ద్వారా నిరుపేద చెంచు కుటుంబాలకు ఆహార భద్రత కల్పించింది. ఈ కార్యక్రమం ద్వారా 130 గ్రామ సంఘాలు 178 గ్రెయిన్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసుకొని సుమారు 12018 క్వింటాల బియ్యాన్ని చెంచు కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది. గ్రెయిన్ బ్యాంక్ బియ్యం విలువ రూ. 69.61 లక్షలు, గ్రెయిన్ బ్యాంక్ బియ్యం అప్పు తిరిగి చెల్లించిన సభ్యులు మళ్ళీ తిరిగి అదే మొత్తాన్ని గ్రామ సంఘం నుండి పొందుతారు.

## అటవీ హక్కుల చట్టం

అటవీ హక్కుల చట్టం ద్వారా గుర్తించిన చెంచు కుటుంబాల వారు సాగు చేస్తున్న అటవీ భూములు పొందడానికి గ్రామ సంఘం బాధ్యత తీసుకుంది. గూడెం స్థాయిలో అటవీ హక్కుల చట్టంలో సభ్యులుగా ఉండి వివిధ స్థాయిల్లో వచ్చే సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ విధంగా నాలుగు జిల్లాలలోని 2036 చెంచు కుటుంబాలకు 7274 ఎకరాల భూమిని పొందారు.



## బ్యాంకు లింకేజి కార్యక్రమం

చెంచు సంఘాలు మారుమూల ప్రాంతాలలోని అటవీ ప్రాంతంలో ఉండడం వలన సంఘాలకు అప్పులు ఇవ్వడంలో బ్యాంకర్లు ఆసక్తి చూపలేకపోతున్నారు. అప్పు తిరిగి చెల్లింపులో కూడా సరైన అవగాహన లేకపోవడం కూడా ఒక కారణం. అయితే కొన్ని సంఘాలు బ్యాంకు నుండి ఎటువంటి సమస్యలు లేకుండా అప్పు పొందుతున్నారు. ఇంతవరకు 170 సంఘాలకు ఒక కోటి 17 లక్షలు అప్పుగా తీసుకున్నారు.

## ఐ.టి.డి.ఏ -ఐ.జి.ఎ కార్యక్రమం

ఐ.టి.డి.ఏ ద్వారా అమలు చేస్తున్న ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కింద 2009-10 సంవత్సరంలో నిరుపేదలైన చెంచు కుటుంబాలను చెంచు సమాఖ్యల ద్వారా లబ్ధిదారులుగా గుర్తించి వారికి సహాయం చేయటమైంది. ఇంతవరకు 4 జిల్లాలలో 571 మంది లబ్ధిదారులను గుర్తించి 71.96 లక్షల రూపాయలను మంజూరు చేసి వారికి ఆస్తులు కొనుగోలు చేసి, పర్యవేక్షణ కూడా చేస్తున్నారు.

## చెంచు-జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఇ.జి.యస్)

08.05.2009న చెంచు లక్ష్మి మహా సమాఖ్య సమావేశానికి విచ్చేసిన గ్రామీణాభివృద్ధిశాఖ అప్పటి ముఖ్య కార్యదర్శి శ్రీ కె. రాజు ఐ.ఎ.ఎస్, కమీషనర్ గ్రామీణాభివృద్ధి శాఖ శ్రీమతి శాంతికుమారి ఐ.ఎ.ఎస్, ఇ.జి.యస్ డైరెక్టర్ శ్రీ మురళి, సెర్ప్ అడ్వైజర్ శ్రీ జగన్నాథరావు, తదితరులు అటవీ ప్రాంతంలో అమలు జరుగుతున్న ఉపాధి హామీ కార్యక్రమాన్ని సమీక్షించడం జరిగింది. సమీక్ష అనంతరం చెంచు గూడేలలో ఇ.జి.యస్ అమలులో వస్తున్న సమస్యలను, లోపాలను కూలంకషంగా చర్చించడం జరిగింది. చెంచు సమాఖ్యల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మంచి ఫలితాలను సాధించే విధంగా ఇ.జి.యస్ కార్యక్రమాన్ని ప్రత్యేక చెంచు ఇ.జి.యస్ వ్యూహంగా ఏర్పాటు చేసి గ్రామ సంఘాల ద్వారా అమలు చేయాలని ప్రతిపాదించారు. చెంచు ఇ.జి.యస్ కార్యక్రమాన్ని రాజీ లేని సూత్రాలను పాటిస్తూ సమర్ధవంతంగా అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 104 గ్రామ సంఘాలలో, 12841 మంది కూలీ సభ్యులుగా నమోదు అయ్యారు. రూ. 467.27 లక్షలు గ్రామ సంఘాల ద్వారా ఉపాధి కూలీలకు పంపిణీ చేయడం అయింది.

## సామాజిక భద్రతా పథకాలు

మారుమూల ప్రాంతాలైన అటవీ ప్రాంతాలలో నివశించే చెంచులు వివిధ రకాల ఆపదలకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. అలాగే సామాజిక సమస్య వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందిరా క్రాంతి పథకం సామాజిక భద్రత పథకాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, నిరుపేదలైన చెంచులకు సమగ్ర సామాజిక భద్రతా పథకాలను రూపొందించ వలసిన అవసరాన్ని గుర్తించింది. నిరుపేదలకు ప్రభుత్వ భద్రతా పథకాలతో పాటు వివిధ సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పించి, వాటిని ఉపయోగించుకొనేటట్లు చేస్తుంది. ఐ.కె.పి ద్వారా ఆమ్ ఆద్మి యోజన బీమా పథకం, అభయ హస్తం పెన్షన్లు మొదలైన సామాజిక భద్రతా పథకాలను అమలు చేస్తున్నారు. అలాగే ఐ.టి.డి.ఏ. పరిధిలో ఉన్న అన్ని చెంచు కుటుంబాలకు జనశ్రీ బీమా యోజన పథకం అమలు జరుగుతుంది.

*- నవీన్‌కుమార్, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్, ఎన్.టి.ఎం.యు. హైదరాబాద్*



# గ్రామీణాభివృద్ధికి పాడిపరిశ్రమ

**భారతీయ సంస్కృతికి, పాడి పరిశ్రమకు విడదీయరాని అనుబంధం వుంది. భారతీయ ఆహారపు అలవాట్లలో పాల ఉత్పత్తులు ముఖ్యమైనవి. అందుకు పాడి పరిశ్రమ ఆవశ్యకత అతి ప్రధానమైంది. పాడి పరిశ్రమ మూలంగా గ్రామీణ ఆదాయం పెరగడమే కాకుండా, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. స్వాతంత్ర్యానంతరం - సహకార ఉద్యమం గ్రామీణాభివృద్ధిలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించింది. ఫలితంగా పాడి పరిశ్రమాభివృద్ధిలో సహకార పాడి సమాఖ్యలు గ్రామీణ భారతంలో సామాజిక ఆర్థికవృద్ధికి వెన్నుదన్నుగా నిలిచాయి.**

1950వ సంవత్సరం దశకంలో భారతదేశంలో పాల ఉత్పత్తి కేవలం 17 మిలియన్ మెట్రిక్ టన్నులు అయితే నేడు సాలీనా 91.5 మిలియన్ మెట్రిక్ టన్నుల పైబడి పాల ఉత్పత్తి జరుగుతూ ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిచింది.

అయితే ఈ పరిణామ దిశను తెలుసుకోవడానికి చరిత్ర పుటలలోనికి అవలోకిస్తే, 1940 వ దశకంలో పాడి పరిశ్రమలో దళారుల ప్రవేశంతో రైతులు బాగా నష్టపోయారు. ఫలితంగా స్వయం సమృద్ధిని



సాధించుకోలేకపోయాం. 1950 దశకంలో, మన దేశ పాల ఉత్పత్తి కేవలం 17 మిలియన్ మెట్రిక్ టన్నులే అయినందువలన, దేశ ప్రజల అవసరాలను తీర్చడం కోసం యూరప్, న్యూజిలాండుల నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకునేవారం.

ఈ నేపథ్యంలో గ్రామీణ సహకార సంఘాలు ఉద్భవించడం జరిగింది. 1945లో గుజరాత్‌లోని కైరా బడుగు రైతులు దళారుల దోపిడీని నిరసిస్తూ సమ్మె చేయడంతో, ప్రయివేటు కాంట్రాక్టర్లను నియమించుకొని కైరా జిల్లా నుండి పాలను సేకరించే పనిని పొల్సన్ సంస్థకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిని అడ్డుకోనేందుకు సర్దార్ వల్లభాయి పటేల్, దేశాయిల సలహా మేరకు, ఉద్యమానికి త్రిభువనదాస్ పటేల్ నాయకత్వం వహించారు, కైరా జిల్లాలో సమ్మె విజయవంతమైంది. ఫలితంగా అమూల్ ఆవిర్భావమైంది. ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్ (Anand Milk Union Limited) లోని మొదటి అక్షరాలు 'అమూల్' (AMUL) గా రూపొందించింది. భారతదేశంలో శ్వేత విప్లవ పితామహునిగా పేరు పొందిన డాక్టర్ వర్గీస్, అమూల్ పదానికి అమూల్యమైనది లేదా వెలకట్టలేనిది అనీ అర్థం ధ్వనించేలా రూపొందించారు.

దేశంలో మార్కెట్‌లో బ్రాండ్ పేరు లేకుండా అమూల్ ఉత్పత్తులు 1946 నుండి అందుబాటులో వున్నప్పటికీ, 1955 నుంచి వెన్న ఉత్పత్తుల- వినూత్న ప్రచారం 'అమూల్' ను ప్రతి ఇంటికి పరిచయం చేయడంతో, ఆనాడు 247 లీటర్ల పాల సేకరణ జరుగగా, నేటికి 1000 కోట్ల లీటర్ల స్థాయిని మించి ఉత్పత్తి పెరగగా, 45 వేల టన్నులను మించి అమ్మకాలు పెరిగి అమాల్ సంస్థ విశ్వరూపం ప్రదర్శించడంతో పాల ఉత్పత్తి దాతలకు స్ఫూర్తి నిచ్చింది. దేశప్రజల్లో 22 శాతం మంది అమూల్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు.

దేశంలో 600 కోట్ల రూపాయిల విలువ చేసే వెన్న ఉత్పత్తుల అమ్మకాలకు 86 శాతం అమూల్ ఉత్పత్తులు మార్కెట్ అవుతున్నాయి. ఇది సహకార సంస్థల చరిత్రలో అమూల్యమైన విషయమే!



***ఆంధ్రప్రదేశ్‌లో పాడి పరిశ్రమాభివృద్ధికి స్థాపించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (APDDCF) నిర్వహిస్తున్న బాధ్యతలు, విధులు :***

- ★ గ్రామస్థాయి నుండి, జిల్లా స్థాయిలకు పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థల నిర్వహణ.
- ★ పాల ఉత్పత్తి, పశుగ్రాసం, దాణా ఉత్పత్తి, సంకరజాతి సంతానోత్పత్తి కార్యక్రమాల నిర్వాహణకు సహకారం అందించడం.
- ★ సహకార సంస్థలను సమర్ధవంతంగా నిర్వహించడానికి కావలసిన నాయకత్వం, నిర్వహణ, నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు మార్కెటింగ్, ప్రాసెసింగ్, రైతులకు శిక్షణా కార్యక్రమాల నిర్వహణ.
- ★ గ్రామీణ పేద ప్రజలకు ఉపాధిని కల్పించడం ద్వారా సమగ్ర పాడి పరిశ్రమాభివృద్ధిని సాధించడం, పాల ఉత్పత్తికి మూలమైన ఆవులు, గేదెల సంరక్షణ. పాల ఉత్పత్తికి సంబంధించిన చిన్న వివరణ.

రాష్ట్రంలో పశుసంపద, పాలిచ్చే పశువుల సంఖ్య ఆశాజనకంగా అభివృద్ధికి నోచుకోలేదు. మేలైన జాతి పశువుల సంతానోత్పత్తి కోసం క్రాస్ బ్రీడింగ్ పద్ధతులు, కృత్రిమ పిండోత్పత్తి సదుపాయాలను పశు సంవర్ధకశాఖ, పాడి పరిశ్రామాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి. పశువులకు రోగనిరొధక టీకాలు వేయడాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

ఆదాయం చేకూర్చే, పాలిచ్చే పశువులకు బీమా సౌకర్యాన్ని జనరల్ ఇన్సూరెన్సు వంటి సంస్థలు కల్పించాయి. ఈ బీమా పథకంలో 2 నుండి 10 సంవత్సరాల వయసు గల దేశీయ, విదేశీయ, సంకర జాతి ఆవులకు, 3 నుంచి 12 సంవత్సరాల వయసు గల అన్ని జాతుల గేదెలకు బీమా సౌకర్యం వుంది.

పశువు ప్రస్తుత విలువలు 4 నుంచి 6 శాతం, వార్షిక ప్రీమియంతో బీమా చేయవచ్చు. బీమా చేసిన పశువులను గుర్తించడానికి, వాటి చెవికి పోగును వేస్తారు. రైతులు ఈ పోగును జాగ్రత్తగా కాపాడాలి. పశువు చనిపోయినా, పాలు ఇవ్వడం ఆగిపోయినా, చెవిపోగు ఆధారంగా బీమా చేసిన గుర్తింపుతో రైతుకు నష్టపరిహారం అందుతుంది.

| ఆవుల జాతి | రోజుకు ఇచ్చే పాలు |
|---|---|
| జెర్సీ ఆవు | 12 నుంచి 15 లీటర్లు |
| ఒంగోలు ఆవు | 8 నుంచి 10 లీటర్లు |
| ఉదీర్ ఆవు | 10 నుంచి 15 లీటర్లు |
| దేశీయ ఆవు | 4 నుంచి 5 లీటర్లు |

పశువుల ఆరోగ్య పరిరక్షణకు నాణ్యమైన పశువులమేత, మంచినీరు అవసరం. హైబ్రిడ్ నేపియన్ గడ్డి, పారా గడ్డి, గిని గడ్డి, స్వీడ్ సూడాన్ గడ్డి, దీనానాధీ గడ్డి అనేవి మేలైన పశుగ్రాసాలు. జొన్న, మొక్కజొన్న, బొప్ప, ఎండుగడ్డి కూడా పశువుల మేతగా ఉపయోగపడ్తాయి.

| గేదెల జాతి | రోజుకు ఇచ్చే పాలు |
|---|---|
| ముర్రా జాతి గేదె (గౌడు గేదె) | 8 నుంచి 10 లీటర్లు |
| సుర్తి గేదె (గుజరాతీ) | 8 నుంచి 10 లీటర్లు |
| దేశీయ జాతి గేదె | 4 నుంచి 5 లీటర్లు |

పాడి పశువులకు రోజుకు 30 నుంచి 35 లీటర్ల నీరు అవసరం. పాలిచ్చే పశువు ఇచ్చే ప్రతి ఒక్క లీటరు పాలకు, 2 లీటర్ల నీటిని పశువుచేత త్రాగించాలి. పశువులను నీటితో శుభ్రంగా కడగాలి.

గ్రామీణాభివృద్ధి పథంలో, గ్రామీణ భారతంలో పాడి పరిశ్రమ మహిళల జాతీయ విధానంలో ఆర్థిక సాధికరతను సాధించింది. దేశం మొత్తం మీద ఒక కోటి 10 లక్షల పైబడి మహిళలు ఇంట్లో ఉండి గేదెలను, ఆవులను మేపుతూ ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. తేనె టీగల పెంపకం, కోళ్ళ పెంపకంలో వచ్చే ఆదాయం కన్నా పాడి చేయడం వలన మహిళలు అధిక సంపాదనా పరులవుతున్నారు.

కనుక, మనుషుల మాదిరిగానే, పశువుల విషయంలో కూడా ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, పశుసంవర్ధత సలహాలను పాటించిన నాడు పాడి పరిశ్రమ పరిఢవిల్లటంతో పాటు, గ్రామీణ భారతంలో జీవనోపాదులు పెరిగి, మహిళలకు ఆర్థిక స్వావలంబన ఏర్పడడం ద్వారా గ్రామీణాభివృద్ధి జరుగుతుందనడంలో సందేహం లేదు.

*- ఎ.వి.రాజా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ*

Printed & Published by: Dr. Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Dr. Phani Kumar**

# గ్రామసభ నిర్వహణపై అవగాహనకు 'అపార్డ్' అనుసరిస్తున్న బహుముఖ వ్యూహాలకు కేంద్ర ప్రభుత్వ ప్రశంస

(వార్త 56వ పేజీలో)





RNI No. APTEL / 2009/27888




# సౌరశక్తే ఇక జగతికి వెలుగు



Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.